
బాల బాలికలకు
వెలుగుబాట
డా॥ నండూరి రామకృష్ణమాచార్యులు

# వె లు గు బా ట

రచయిత

డాక్టరు నందూరి రామకృష్ణమాచార్య

Name of the Book

వెలుగుబాట

VELUGUBATA

Author and Publisher

Dr. Nanduri Ramakrishnamacharya, M.A.Ph.D.,
1-8-76. Prenderghast Road,
35, Jawahar Nagar,
Sec'bad - 500 003

Language

TELUGU

Year of Publication – 1984

No of copies – 1000 copies

Price : 10/-

Printed at

R. K. Printers
9/71, Dwarakapuram Colony,
Behind Bus Depot,
Dilsukh Nagar, Hyderabad.36.

ACKNOWLEDGEMENT

*This book is published with the Financial Aid of the TIRUMALA TIRUPATI DEVASTHANAMS under the scheme of publishing Religious Books.

కృతజ్ఞతలు

*ఈ గ్రంథము తిరుమల తిరుపతి దేవస్థానమువారి ఆర్థిక సాహాయ్యముచే ప్రచురింపబడినది.

వెలుగుబాట

# కృతి సమర్పణము

1

చిరువాయిపాటి రాఘవ
వరునకు విజ్ఞాన కీర్తి పరివేషునకున్;
పరతత్త్వార్థి జన మనో
హరునకు-వేదాంత విక్రమాదిత్యునకున్.

2

వ్రాసె-వచన కృతిగ- "రామానుజ చరిత్ర"
క్రాంతదర్శియైన రాఘవయ్య;
[illegible]
మేలి నవల మించి-మేటి నాటిక మించి
స్వచ్ఛ సత్య మతడు చాటగలిగె.

3

ఎడద గూడు కట్టు-పునమి కప్పురి వెల్గు
రాఘవయ్య దివ్య రచన చదువ!
బరువు లేని బలము-ప్రతిపదంబున తోచు
అమృత రస సముద్ర మతని శైలి.

4

అతడు దించినాడు ఆధ్యాత్మిక వికాస
దివ్యవైభవమ్ము తెలుగులోకి;
మతము రంగరించె మానవత్వముతోడ!
రాఘవయ్య ఋషికి ప్రణతి శతము.

5

నీ కలమందు దివ్యనవనీతము పొంగులువారు, వాఙ్మయ
శ్రీకమనీయతామృత ఝరీ సుకుమార తరంగ నాట్య హే
వాకము చిందులాడు; సుడిసంపుల సొంపుల పండువెన్నెలన్
నాకవనమ్ములోన సుమనఃవ్రతతుల్ వికసించునట్టుగన్.

6

నీకు—"వెలుగుబాట"—నివాళిగా గూర్చి
ఇచ్చినాడ మెచ్చి కృతిని కొనుము;
ఈ కృతి కృషి-కడలి హిమవన్నగము కల్పు
గంగవోలె—మనల-కలుపుగాక.

7

పరమపవిత్రమైన అనుబంధము స్నేహము; అందు సాహితీ
పరిమళముల్ సదా వెలుగుబాటలు తీరిచి దిద్దిదన్-హృదం
తరములు ఊగులాడు కవితాలత పై గిజిగాని గూళ్ళుగా;
ఇరువురి మైత్రిలో పులకరించుచుగాక; రసప్రపంచముల్.

కృతికర్త

నండూరి రామకృష్ణమాచార్య

కృతిభర్త

తిరువాయిపాటి రాఘవయ్య M.A. B.Ed.

Retired Principal

కట్టుబడిపాలెం- (బుచ్చిరెడ్డిపాలెం)

నెల్లూరు మండలం

# మున్నుడి

అల్పాక్షరముల అనల్పార్థ రచనకు
ప్రసిద్ధి కెక్కినవి సంస్కృత సుభాషిత శ్లోకాలు.
ఈ శ్లోకాలు ప్రాయికముగా చాటువులు.
కాలమహాస్రవంతికి ఎదురీది బ్రతికినట్టివి.
ప్రతిశ్లోకంలో లోకానుభవం హృదయంగమంగా అభివ్యక్తమౌతుంది.
తక్కువ మాటలతో ఎక్కువ భావాన్ని ఈ శ్లోకాలు వ్యక్తం చేస్తాయి.
ఈశ్లోకాలు బహుళముగా అజ్ఞాత కర్తృకములు.
ఈ శ్లోకాలు ఎవరు వ్రాశారు? అనేది ముఖ్యం కానేకాదు.
ఈ శ్లోకం ఏమి చెప్పుతోంది? అనేదే ప్రధానాంశం అవుతుంది.
యుగయుగాంతరాలనుండి-గ్రంథస్థాలు కాకపోయినా-ప్రజల నాలుకలపై
నలుగుతూ ఈ సుభాషిత శ్లోకాలు మార్కండేయ మహర్షి అంశను పంచుకొని
మృత్యుంజయములై లోకంలో చిరస్థాయిగా నిలుస్తున్నాయి.
చదువుకంటె స్వానుభవం గొప్పది కదా.
స్వానుభవం ఈ శ్లోకాలకు జీవనాడి.

సంస్కృతంలోని "శతశ్లోకేన పండితః" అనే సుభాషితం ఈ శ్లోకాలపట్ల సార్థకం. "ఏకశ్లోకః ప్రబంధశతాయతే" అన్నమాట ఎచ్చట అయినా అన్వర్థం అని చెప్పగలుగుతే-యీ చాటు శ్లోకాలపట్లనే అని చెప్పడంలో అతిశయోక్తి కాజాలదు.

ప్రతి శ్లోకంలో విశ్వజనీన వివేకం సూక్ష్మరూపం ధరించిన రసగుళిక. సహృదయుని లోకానుభవం, ఆలోచనాశక్తి పెరిగినకొద్దీ-

ఈ సుభాషిత శ్లోకాలు ఎల్లలు ఎదుగుతూ విశ్వరూపప్రదర్శనం వెల్లివిరియ చేస్తాయి. ఎందరి జీవితాలకో తరతరాలుగా వెలుగుబాటలు ప్రసాదించిన ఈ సుభాషిత శ్లోకాలు–వ్యాఖ్యానసహితంగా తెలుగువారికి మచ్చుకు కొన్ని అచ్చులో అందించటం జరిగింది.

ఈ శ్లోక కర్తలు ఎందరో మహానుభావులు

అందరకూ నా వందనాలు. ఇందులో వ్యాఖ్యానం మాత్రమే నాది. ఏ వ్యాఖ్యానమైనా దిఙ్మాత్రవివరణమే. అందని ఆకాశమే అని నా విన్నపం.

ఈ సుభాషిత శ్లోకాలు తొలుత "సత్తగిరి" పత్రికలో యువవాణి శీర్షికలో ప్రచురితములు.

నా యీ కృషికి ప్రేరణ కల్పించిన "కారయిత" సత్తగిరి సంపాదకులు శ్రీ కాట్రగడ్డ సుబ్బారావుగారు. "వెలుగుబాట" అనే పేరు పెట్టిందికూడా వారే.

కవితామణిహారంలో కాళిదాసమహాకవి తనదని చెప్పుకోదగింది దారం మాత్రమే అని సవినయంగా విన్నవించాడు.

ఈ వెలుగుబాటలో నా విన్నపం.

"రచన చేసినాద రత్నాలుగుదిగ్రుచ్చి
దార మెరుపుతెచ్చి హారమొకటి,"

—నందూరిరామకృష్ణమాచార్య

# ప్రతిజ్ఞ

మంచితనమునందు – మానవత్వమునందు
నీతియందు – నిండు నిజమునందు
ఆచరించిచూపు ఆదర్శములయందు
కలదు – నమ్మకమ్ము కలదు – మాకు

సహనమందు – స్వచ్ఛ సరళ జీవితమందు
ధ్యానయజ్ఞమెనగు జ్ఞానమందు
సర్వమత సమత్వ సహజీవనము నందు
కలదు నమ్మకమ్ము కలదు మాకు

అభిరుచులకు అమరు అభినివేశములందు
మెదడు ఎడద గలుపు చదువులందు
విద్యకుచితమైన ఉద్యోగములయందు
కలదు–నమ్మకమ్ము కలదు మాకు

కార్యదీక్షయందు - క్రమశిక్షణమునందు
కళలయందు – బ్రదుకు విలువలందు
శ్రమకు పేర్మి పెంచు సౌమనస్యమునందు
కలదు నమ్మకమ్ము కలదు మాకు

దేశభక్తి కార్చు దివ్యరక్తమునందు
త్యాగయోగవిజయ యజ్ఞమందు
యువకదీప్తి తెచ్చు నవయుగోదయమందు
కలదు నమ్మకమ్ము కలదు మాకు

కర్మయోగమందు - ధర్మపీఠమునందు
        నిజము తుదకు పొందు విజయమందు
పుణ్యలక్ష్యమందు పూజ్యయత్నములందు
        కలదు నమ్మకమ్ము కలదు మాకు

సృష్టి శిల్పమరయు జిజ్ఞాసుహృదులందు
        ఎప్పుడెదుగు సృష్టి ఎల్లలందు
సరసహేతువాద సార్వభౌమతయందు
        కలదు నమ్మకమ్ము కలదు మాకు

స్వేచ్ఛయందు-విశ్వవిజ్ఞాన గతియందు
        గొప్పతనము గూర్చు గురువులందు
సమతయందు – సర్వసౌభ్రాత్రగుణమందు
        కలదు నమ్మకమ్ము కలదు మాకు

శాంతియందు విశ్వసహకారకృషియందు
        మానవాళి ఐకమత్యమందు
సాంస్కృతిక పరాగ సమ్మేళనములందు
        కలదు నమ్మకమ్ము కలదు మాకు

సంఘసేవయందు – సంక్షేమ రాజ్యాంగ
        సాధనావిధాన సవనమందు
చిత్తశుద్ధియందు - శీలరక్షణయందు
        కలదు నమ్మకమ్ము కలదు మాకు

)(o)(

# అభినవ సప్తపాతకాలు

1. Politics without principles
2. Wealth without work
3. Pleasure without Conscience
4. Knowledge without character
5. Commerce without morality
6. Science without humanity
7. Worship without sacrifice

– M. K GANDHI

ఆశయాలులేని అపరాజకీయముల్
    పనికి విముఖమైన ధనదురాశ
అంతరాత్మలేని అనుభోగ లౌల్యమ్ము
    సచ్చరిత్ర లేని జ్ఞానదీప్తి
వంచనమున వచ్చు వర్తకాభ్యుదయమ్ము
    త్యాగనిరతిలేని ప్రార్థనమ్ము
సద్ హృదయములేని శాస్త్రవిజ్ఞానమ్ము
    గాంధీ - సప్తపాతకమ్ములనియె.

అసతోమా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మాఽమృతం గమయ.

"అసత్తునుండి నన్ను సత్తులోనికి కొనిపొమ్ము
చిమ్మచీకటినుండి వెలుగులోనికి గొనిపొమ్ము
మృత్యువునుండి అమృతత్త్వములోనికి చేర్పుము"

ఇది విశ్వజనీనమైన ప్రార్థన. ఏదేశంలోనివారైనా, ఏకాలానికి చెందినవారైనా, ఏమతానికి చెందినవారైనా సరే ఈ ప్రార్థనలో నిరభ్యంతరంగా పాల్గొనవచ్చు.

సృష్టి తొలియుషస్సులో మంత్రద్రష్టలైన మహర్షుల దర్శనం - అనుభూతి - ఈశ్లోకం.

ఈ శ్లోకం - యుగయుగాంతరాలలో భారతీయవేదాంతమునకు పూజాపీఠమైనది.

ప్రపంచంలో - వెల్లివిరిసిన వేదాంతదర్శనాలు అన్నిటికీ సత్తు - అసత్తు, చీకటి - వెలుగు, మృత్యువు - అమృతత్వము అన్వేషణ శీర్షికలైనవి.

# మౌనం

చిత్రం వటతరోర్మూలే
వృద్ధాః శిష్యా గురుర్యువా;
గురోస్తు మౌనం వ్యాఖ్యానం
శిష్యాస్తు ఛిన్నసంశయాః ॥

ఓహో-ఆశ్చర్యకరం! మఱ్ఱిచెట్టు క్రింద కూర్చున్నారు! వృద్ధులైన శిష్యులు! యువకుడైన గురువు! గురువుగారు మౌనముద్రలో ఉన్నారు. అయితే ఆ మౌనమే శిష్యులందరకూ సర్వసంశయనివృత్తి చేస్తోంది!! ఇది పై పద్య తాత్పర్యము.

ఇది దక్షిణామూర్తి ధ్యానశ్లోకాలలో ఒకటి. ఈ శ్లోకాన్ని మథించినకొద్దీ అమూల్యమైన అంతరార్థాలు వెలువడుతాయి. అందులో కొన్ని ముఖ్యాంశాలు

అది మఱ్ఱిచెట్టు. నాలుగు గోడలమధ్య ఇటుకలతో మట్టితో కట్టబడిన బడి కాదు. దిగంతవిశ్రాంతమైన సువిశాల సుందర సహజ సజీవ పర్ణశాల! అచ్చట ఎదిగే మెదడుకు ఎల్లలు లేవు.

జ్ఞానమునకు వయస్సుతో నిమిత్తం లేదు. బాలుడైన గురువు దగ్గరనుండి గూడ వృద్ధులైన శిష్యులు నేర్చుకోవచ్చు.

ఇక విద్యావబోధమునకు "మాట" అత్యవసరమని-అపరిహార్యమనీ అందరూ అంగీకరించే అంశమే గద. కానీ మాటలలో వివరించే అనుభూతి గాని, విద్య గాని పరిమితపరిధిని దాటిపోలేవు.

అంతేగాదు, ఆదర్శపూరితమైన ఏ మహోజ్వల సందేశం అందించటకైనా పొడిపొడి పలుకుబడులు అపహాస్యభాజనాలు. సత్యహరిశ్చంద్రుని గురించి ఏ ఉపన్యాసం చెప్పనక్కరలేదు. దేశభక్తిని గూర్చి ఉపన్యాసాలకంటే గాంధీమహాత్ముని దర్శనం చాలు. అందుచేత ఉపదేశంకంటే ఉదాహరణ మేలనే సామెత ఏర్పడింది.

అంటే—అసలు మాటలాడకుండా విద్యాప్రబోధం జరగవలెనని గాదు. అక్షరాలు చదివించటం, పాఠాలు వల్లెవేయించటం అర్థాలు స్వారస్యాలు వివరించటం, ఇది అంతా విద్యాబోధనలో ప్రాథమికదశ. ఆ నిచ్చెనలు అన్నీ ఎక్కిన "వృద్ధశిష్యులు"-ఉన్నత జ్ఞానార్జన చేసేందుకు మాటలు చాలవు. నిజానికి, "పదమునకు ఉన్న అర్థమ్ము పరిమితమ్ము". మాటలు చెప్పలేని మహితార్థమును మౌనమే చెప్పగలదు, అయితే, ఎవరికి? యోగ్యత ఉన్న జిజ్ఞాసువులకే. అర్హత, జిజ్ఞాస లేనిదే ఏ విద్య ఎవరికీ అంటదు— అన్నమాట నిర్వివాదాంశం. అందులో ఆధ్యాత్మికవిద్య అనుభవైకవేద్యం అంటారు పెద్దలు.

"కవితకు అసాధ్యమైన అర్థవిలసనము
వీణకు-అగమ్యమౌ నాదబిందులయలు
మానసమున కందని భావమధురిమములు
అనుభవింతును నీ మౌనమందు దేవ !

మౌనమునకు ఉన్నట్టి శక్తి మాటలకు లేదనే మాట, నిత్యజీవితమున గూడ అందరకు అనుభవమే. నోరు పారవేసుకునేవారు ఎందుకూ పనికిరాని అప్రయోజకులు.

మాటలేమి తెలుపు? మౌనమ్ము తెలుపురా
మనసు కంద నట్టి మధురిమములు !
మౌన మేమి తెలుపు? గానమ్ము తెలుపురా!
ఎడద కంద నట్టి ఎల్లలెల్ల

మాటకంటే మౌనం-మౌనంకంటె గానం - మేల్తరములు అని చెప్పవచ్చు. అందుచేతనే ఆధ్యాత్మికసాధనలో భజనకు ఎనలేని ప్రాముఖ్యం యావజ్జగత్తులో లభించింది.

అయితే మౌనంలో రెండు రకాలు ఉన్నవి. నీరవ నిశ్శబ్దత అసలు మౌనమే కాదు. మాటల ఆవశ్యకత ఉన్నప్పుడు పెదవి కదపక పోవటం నిజమైన మౌనం. ఇట్టి మౌనమే పరాకాష్ఠరూపంలో క్రియాశూరత అని అంటాము. ఒకానొక సేనాధిపతినిగూర్చి చెప్తారు; ఆ సేనాపతి ఆరు భాషలలో ఉపన్యసించగల విద్వాంసుడట. కానీ అతడు ఎప్పుడూ పెదవి విప్పేవాడు కాదట. అందుకని సహవ్రతులు ఆయనను "ఆరు భాషలలో అనర్గళంగా మౌనభాషణ చేయగల అసాధారణ వ్యక్తి" అని అభివర్ణించేవారట. అనగా ఆయన మాటలాడకుండానే కేవలం తన వ్యక్తిత్వగౌరవంవల్లనే తన ఆజ్ఞలు సైనికులు పాటించేటట్లు చేయగలిగేవాడట.

"క్రమశిక్షణ యొక్క మాతృభాష మౌనమే" అన్న సంగతి అధికారరంగంలోని అనుభవజ్ఞులు అందరికీ తెలిసిన విషయమే!

వేమన "కంచు మ్రోగు నట్లు కనకంబు మ్రోగునా!
విశ్వదాభిరామ వినురవేమ ! -అన్నాడు.

ఇంకో కోవకు చెందినట్టిది- "జ్ఞానమౌనం". జ్ఞానతేజస్వియైన గురువు కేవలం తన వర్చస్సువల్లనే శిష్యుల సర్వసంశయాలు పోగొట్టి "లోవెలుగు" ప్రసాదించగలడు.

ఉపనిషత్తులు ఆత్మతత్త్వాన్ని గూర్చి చెప్పిన తుది పలుకులు అది మనస్సునకు వాక్కునకు అప్రాప్యమనిగదా. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ". "అదే నీవు అగుచున్నావు"- "తత్త్వమసి" ఇక చెప్పవలసినదేమున్నది! అనుభవైక వేద్యముగదా అది.

అందుచేత గురువుగారి మౌనమే ఆదర్శ వ్యాఖ్యానం. గురువు పెదవి విప్పినప్పుడు ఆ మహామహితాత్ముడు ఒక మెట్టు దిగజారటమే.

# న ట రా జు

"ఆంగికం భువనం యస్య
వాచికం సర్వవాఙ్మయం।
ఆహార్యం చంద్రతారాది
తం వందే సాత్త్వికం శివం॥

పై శ్లోకం నటరాజు లీలాతాండవ స్తవం. భారతదేశంలో నృత్య ప్రదర్శనాలకు పై శ్లోకం ప్రార్థనాగీతిగ వెల్లివిరిసింది. ఈ శ్లోకానికి ఆంధ్రీకరణం

ఎవని కాంగికమ్ము భువనసర్వస్వమ్ము !
వాచికమ్ము సర్వవాఙ్మయమ్ము ।
అభ్ర చంద్ర తార లాహార్య మెవనికి !
అట్టి సాత్త్వికు శివు నభినుతింతు,

లీలాతాండవలోలుడైన నటరాజును ఆరాధ్యదైవంగా ఉపాసించిన గౌరవం భారతదేశానికి దక్కింది.

కేవలం లౌకికదృష్టితో చూచినా, సమస్త కళలకు ఆద్యప్రకృతి ఆదిమానవుని ఆటవికతాండవం. అడవిలో శాఖామృగంగా సంచరించే ప్రాక్తనమానవుని హృదయం రసతరంగితమైనప్పుడు అతడు పట్టలేని ఆనందంతో చిందులు త్రొక్కుతూ గంతులు వేశాడు. ఆ ఆటవిక తాండవాన్ని ప్రసరిస్తే

1. విన్యాస విశేషాత్మకమైన నృత్తం.
2. తాళలయాన్వితమైన నాదం

3. భావ సమన్వితమైన శబ్దం

అభివ్యక్తమౌతాయి. పైమూడూ యుగయుగాంతరాలలో క్రమ పరిణామ వికాసబద్ధాలై 1. నృత్యం 2 గానం 3. కవిత్వం అనే లలిత కళలుగా వికసించాయి. సంగీతం అంటే కేవలం గానం కాదు ఆలంకారికుల దృష్టిలో

"గీతం చ నృత్తం చ వాద్యం చ-సంగీతం"

కేళీతాండవలోలుడైన నటరాజు చేతిలో ఢమరుకం ఉంటుంది.

ప్రతి సాయంసంధ్యాసమయంలో సహ్యాద్రిపై పరమశివుడు నృత్యం చేస్తాడని భారతీయ సనాతన సంప్రదాయం అభివర్ణిస్తూంది.

జడల మిన్నేటి తుంపురల్ చదల చెదర
సహ్యగిరి-మరిసంజ కెంజాయ కెరలి
నింపుచుందువు నిష్ఠేద నిత్య నృత్య
కేళికాహేళి బ్రహ్మాండగోళ మెల్ల!!

అనేది నటరాజ స్తుతి.

లలిత కళలకు ఏకైక ధ్యేయంగా ఆలంకారికులు ప్రతిపాదించినది "రసం".రససిద్ధాంతప్రోక్త భరతముని-దానిని నాట్యపరంగానే ఉద్దేశించాడు అయితే తరువాత ఆ సిద్ధాంతం లలిత కళలు అన్నిటికీ విస్తరించింది.

"రసానుభూతి అంటే సహృదయుడు లలితకళోపాసనవల్ల పొందే ఆనందతన్మయత్వం" అని స్థూలంగా నిర్వచించవచ్చు. ఆ ఆనందం, మాటలో చెప్పలేనిది. "వాచామగోచరమ్", "అనిర్వచనీయము", "బ్రహ్మానందసహోదరం" అని ఆలంకారికుల అభిభాషణ.

"A thing of Beauty is a Joy for ever"

"సుందరవస్తు సందర్శనం సంతతానంద సంధాయకం'' అన్నాడు ఆంగ్లకవి కీట్సు.

కాళిదాస మహాకవి, ఈ భావాన్నే మనోహరతరంగా అభివర్ణించాడు.

"రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్ సుఖితోఽపి జంతుః
తచ్చేతసా స్మరతి నూన మబోధపూర్వం
భావస్థిరాణి జననాంతరసౌహృదాని॥"

"సౌందర్య సందర్శనంతోపాటు మాధుర్యశ్రవణంగూడ సంతతానందసంధాయకం అన్నాడు'' కాళిదాసు. పై శ్లోకానికి తెలుగులో స్వేచ్ఛానువాదం

"సుందరతన్ కనుంగొనినదో మృదుగానము నాలకించినన్
డెందము క్రొందవాగయి వడిన్ ప్రవహించును పొంగులెత్తి, ఆ
నందము మేలుకొల్పును మనఃకుహరాంతరసుప్తవాసనా
బృందము-కందళించు వచియింపగరాని 'పురానుభూతులన్.

ఈ రసానందయోగప్రదాత కేళీతాండవలోలుడైన "నటరాజు".

అతని నాట్యానికి సమస్తసృష్టి రంగభూమియే. అభినయం చతుర్విధాలు. 1) ఆంగికం 2) వాచికం 3) ఆహార్యం 4) సాత్త్వికం. అపైన రసానుభూతియే. ఈ భువనం అంతా నటరాజుకు ఆంగికమే. సర్వవాఙ్మయం వాచికాభినయానికి ఉపకరిస్తుంది! ఇందులో సెలయేటి సవ్వడులు- కోకిలాలాపాలు - తుమ్మెదల ఝుంకారాలు-సింహగర్జనలు- ఏనుగుల ఘీంకారాలు చిరుగాలి కెరటాల రొదలు అన్నీ కలుస్తాయి. ఆహార్యంగా సూర్యచంద్రతారకాది సమస్తసృష్టి ఏర్పడుతుంది. ఇక

ఆలంకారికులు స్థాయిభావం - పరిపుష్టి చెందేందుకు ముందు-ఎన్నో విభావాలు ఆలంబన ఉద్దీపన విభావాదులతోపాటు సంచారీభావాలను పేర్కొన్నారు. సాత్త్వికభావానుభూతి ఈ ఉత్తుంగతరంగాలు అన్నీ సమసిపోయిన నిశ్చల నిర్మలానందసాగరం. దానికి ప్రతీక-నటరాజు సాత్త్వికాభినయం.

నటరాజు-మృత్యుంజయుడు.

మృత్యుదేవత హృదయ విదారక వికటాట్టహాసంతూత నృత్యరంగ భూమిలో ఆనంద పర్యవసాయియే.

నటరాజుకు బాలశవపీఠము అమృత నిరతిశయానంద సిద్ధికి ప్రతీకము.

అతని డమరుకంనుండి ఉద్భవించిన నాదప్రస్తారంనుంచి "అఇఉణ్ ఋఌక్ ల నుండి వ్యాకరణశాస్త్రం ఉద్భవించింది!!

సమస్త భువన సృష్టి అతనికి ఆంగికం.
సమస్త వాఙ్మయాలు అతనికి వాచకం.
సర్వప్రకృతి అతనికి ఆహార్యం.
అతడు మూర్తీభవించిన సాత్త్వికానుభూతి!
అతడు రసస్వరూపుడు

"రసో వై సః" *

---

దానం ప్రియవాక్సహితం
జ్ఞానమగర్వం క్షమాన్వితం శౌర్యం
విత్తం త్యాగనియుక్తం
దుర్లభమేతత్ చతుర్భద్రం.॥

# క్రొత్త పాతల మేలికలయిక

"పురాణ మిత్యేవ న సాధు సర్వం;
న చాపి కావ్యం నవ మిత్యవద్యమ్,
సంతః పరీక్ష్యాన్యతరత్ భజంతే
మూఢః పరప్రత్యయనేయబుద్ధిః ॥

ఇది మాళవికాగ్నిమిత్రనాటక ప్రస్తావనలో కాళిదాస మహాకవి వ్రాసిన శ్లోకం. దీని తాత్పర్యం....''పాతది అయినంతమాత్రాన మంచిదే అనుకోరాదు. క్రొత్తదైనంతమాత్రాన ఆ కావ్యం చెడ్డది అనుకోరాదు. ప్రాజ్ఞులు పరీక్షించిన మీదట దేనినైనా అంగీకరిస్తారు. మూఢుడు మాత్రం స్వబుద్ధిమీద ఆధారపడక, ఇతరులు చెప్పిన మాట నమ్ముతాడు."

కాళిదాస మహాకవి ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం ఎవరు కాదంటారు? అయితే ఇందులో ఒక "అంతర్యం" ఉంది. కాళిదాసు ఈనాడు మనదృష్టిలో మహాకవి గాని ఆనాడు అతని సమకాలికుల దృష్టిలో క్రొత్తవాడే కదా. కాళిదాసు లబ్ధప్రతిష్ఠుడు కానప్పుడు—అతని బ్రతుకు తొలి దినమ్ములలో చెప్పిన శ్లోకం అది. కాళిదాసు ఆత్మప్రత్యయంతో అన్న మాటలు ఆ శ్లోకం. కానీ, ఆ క్రొత్తకావ్యం గొప్పది అని సమకాలీనులు అంగీకరించాలి గదా.

చరిత్రలో క్రొత్తకు-పాతకు ఈ సంఘర్షణ ఉండటం సహజం. భవభూతి మహాకవి గూడ, కాళిదాసు కవికంటె ప్రస్ఫుటంగా కంట తడి పెట్టుతూ, గుండె దడ దడ కొట్టుకుంటూ ఈ విషయం ఉద్ఘోషించాడు.

"కాలం అనంతమైనది. భూమండలం సువిశాలమైనది. ఈ

అనంతమైన కాలంలో విపులమైన పృథివిలో నా కవిత్వం మెచ్చుకునే సమానధర్ముడు-సహృదయుడు ఉద్భవించక పోడు-అతని కోసమే నేనీ రచన చేస్తున్నాను."

దీనినిబట్టి భవభూతిమహాకవికిగూడ సమకాలీనుల మన్నన లభించలేదనడం సుస్పష్టం.

తెలుగులో చేమకూరి వేంకటకవిగూడ అప్రస్తుత ప్రశంసగా విజయవిలాస కావ్యం మధ్య,

"ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే గదా" అని విలపించాడు.

ఇది కేవలం మనదేశంలో పుట్టిన మహాకవులకు మాత్రమే పట్టిన దుర్గతికాదు.

"Seven cities claimed Homer Dead
Where the living Homer begged for Food"

గ్రీసు దేశంలో అపర వ్యాసుడు అని చెప్పదగిన హోమకవి, పురసత్రములో పొట్ట చేతపట్టుకొని బ్రతికినంత కాలము తిండికోసం బిచ్చమెత్తుకొని తిరిగాడు. అతడు చచ్చిపోయిన పిమ్మట అతడు మావాడు అంటే మావాడని అతని శవాన్ని ఖననం చేసే గౌరవం దక్కించుకోవాలని ఏడు నగరరాజ్యాలూ పోరాడాయట! బ్రతికివున్నంత కాలం, ప్రతిరోజూ చచ్చి, చచ్చిపోయిన పిమ్మట చిరస్థాయిగా బ్రతకడం ప్రపంచ చరిత్రలో కవులందరునూ పట్టే విచిత్రవిధివిలాసం కాబోలు. ఏమైనా-ఒక్క సాహితీజగత్తులోనే కాదు-ప్రపంచచరిత్రలో అన్నిశాఖలలో క్రొత్త పాతలకు సంఘర్షణ సహజసిద్ధం అనిపిస్తుంది.

కొత్తదనమును కనలేక కుమిలి క్రుం
ప్రసవవేదన పడుచుండు ప్రాతదనము,
కొత్తపాతల మేలికూర్పులు ఘటిల్లి
ఉద్భవించుత నూత్నయుగోదయమ్ము.

అని సమన్వయతీర్మానం ప్రతిపాదించవచ్చు.

అయితే-ప్రాతదనాన్ని మాత్రమే ఆరాధించే శ్రోత్రియులు ఛాందసులుఉంటారు. కొత్తదనమే జగద్విమోచనానికి ఏకైక శరణ్యం అని వాదించే విప్లవ వీరులూ ఉంటారు. లోకంలో ఇరుపక్షాలకు రాజీ కుదరడం కష్టసాధ్యం. సమన్వయవాదిని ఉభయపక్షాలు తిరస్కరిస్తాయి.

ఎదుటివాడు చెప్పేది-అర్థం చేసుకోకుండా అసలు పిసలొగ్గి వినకుండా కలహానికి నడుము కట్టేవారుంటారు.

అర్థపాత్ర శూన్యమంచు వక్కాణొకండు!
ఒకడు సగము నీరు ఉన్నదనెను;
బద్ధలయ్యె తలలు వాదభేదము చేత!
రమ్య హాస లోలం! రామకృష్ణ!

కొందరకు సమన్వయ ప్రతిభ ఉంటుంది. వీరశైవం-వీరవైష్ణవం కొట్లాటల మధ్య నిలిచి "హరిహరనాథోపాసన ప్రతిపాదించాడు తిక్కన మహాకవి. చరిత్రగమనం-అధికారుల చేతుల్లోనే ఉన్నప్పటికీ, సత్యం సమన్వయసంధాతల పక్షాన్నే ఉంటుంది.

నవయుగ వైతాళికుడుగా, ఐదంయుగీనసాహితీద్రష్టగా ఆధునికులు ప్రస్తుతించే అప్పారావుగారు కోరుకున్నది

"కొత్తపాతల మేలి కలయిక" మాత్రమే.

శ్రీ గురజాడ కూడ తిక్కన కాళిదాస మహాకవుల వలెనే సమన్వయసంధాత.

అధ్యాత్మిక రంగంలో కూడ సమన్వయవాదులు ఉన్నారు. తిక్కన హరిహరోపాసన వంటిదే కబీరు ఏకేశ్వరోపాసన. కబీరు

"ఈశ్వర అల్లా తేరే నామ్" అని ప్రతిపాదించాడు.

సంస్కృతంలో వసుధైక కుటుంబులు ఏనాడో

"ఆకాశాత్ పతితం తోయం
యథా గచ్ఛతి సాగరం,
సర్వదేవ నమస్కారః
కేశవం ప్రతిగచ్ఛతి."

"ప్రపంచ మంతటా ఆకాశం నుండి కురిసే వాననీరు ఒకే సముద్రాన్ని ఏవిధంగా చేరుతున్నదో ఆదేవిధంగా సమస్త దేవతలకు పెట్టే నమస్కారాలు ఒకే దేవునకు చేరుతాయి" అన్నారు సమన్వయ వేదాంతులై.

ఇక సింహావలోకనప్రాయంగా కాళిదాసమహాకవి తీర్పును అంగీకరించవచ్చు.

"ప్రాతదైన దెల్ల బంగారమా? ఏమి?
క్రొత్తదైన దెల్ల చెత్త గాదు!
మంచి యెచట నున్న ఎంచి గైకోదగు
మందబుద్ధి పరుల మాట నమ్ము". *

---

వెలయంగ నశ్వ మేధం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దులనిడి తూచిన సత్యము
వలనన ముల్ సూపు గౌరవంబున పేర్మిన్

# "శాంతము లేక"

ఉత్తమే క్షణకోపస్స్యాత్ !
మధ్యమే ఘటికాద్వయమ్,
అధమే స్యాదహోరాత్రం,
పాపిష్టే మరణాంతకమ్ !!

పై శ్లోకానికి ఆంధ్రీకృతి
అణగు ఉత్తమునకు క్షణములో కోపమ్ము !
ఉండు మధ్యమునకు రెండు ఘటికలు !
అధముకోప ముండు అహము రాత్రియుగూడ
పాపి చచ్చువరకు పగ వహించు !!

ఈ శ్లోక తాత్పర్యం వింగడిస్తే ఈ క్రింది అంశాలు తేలగలవు,

1. కోపం మంచిదిగాదు.
2. మంచివారికి కోపం వస్తే అది తాటాకుల మంటవలె చప్పున చల్లారిపోతుంది.
3. ఏదో రెండుఘటికలవరకు మధ్యములకు కోపం చల్లారక పోవచ్చు. అది క్షంతవ్యమే.
4. అధములకోపం ఒకరాత్రి పగలు వరకు ఉంటుంది.
5, ఇక కోపం తాను మరణించేవరకు "కసిగా" పెంపొందించు కోటం పాపాత్మునికే చెల్లుతుంది.

కోపం అంతసేపు ఉంచటం మానవత్వం కాదు. అది అధమ మానవుల లక్షణం.

"మరణాంతాని వైరాని', అనే సూక్తి చొప్పున శత్రు మరణంతో కోపం తీరాలి, శత్రువు మరణించని పక్షంలో పాపాత్ముడు తాను మరణించేవరకు క్రోధం పెంచుకుంటాడు. అది క్షమింపరాని దోషం.

"తామసం తా మసి" అని తెలుగులో ఒక సామెత ఉంది.

క్రోధాన్ని గూర్చి ఒక విద్వాంసుని ప్రవచనం. "నీకు కోపం తెప్పించునట్టి నీశత్రువు నీకంటె బలవంతుడా? యోచించు; బలవంతునిపై పుట్టే కోపం నిరర్థకం. బలవంతునిపై ఆగ్రహం నీకు చేటు. అందుచే అట్టికోపం తగ్గించుకోవటం అంటే నిన్ను నీవు రక్షించుకోటమే. ఇక నీకు కోపం తెప్పించిన శత్రువు నీకంటె బలహీనుడే అయితే అట్టి వానిపై కసితీర్చుకోటం అనవసరం. ఆ పక్షంలో అతనిని నీవు క్షమించటమే నీ యోగ్యతకు నిదర్శనం. నీ బలానికి సార్థక్యం. ఏ విధంగా చూచినా కోపం మంచిదిగాదు, సోదరా! కోపం మంచిదిగాదు."

మనిషిని కోపం ఆవహించటం కొయ్యకు నిప్పు అంటుకోవటం వంటిది. ముందు ఆ కొయ్య బొగ్గు అవుతుంది. ఆ నిప్పు ఎదుటి వానిని దహించవచ్చు; దహించకపోవచ్చు. అది ఆపైమాట. కోపం ముందు కోపిష్ఠిని దహిస్తుంది.

కోపం వచ్చినపుడు మనిషి శరీరంలో వచ్చే మార్పులు గురించి ఒక ప్రఖ్యాత శరీర శాస్త్రజ్ఞుడు అన్నమాటలు ఉదాహరించదగినవి.

"కోపం వచ్చినపుడు మనిషి శరీరంలో ఉద్వేగం ఏర్పడుతుంది.

రక్తప్రవాహం ఎక్కువ వేగం పుంజుకుంటుంది. నాడిలో దూకుడు ఏర్పడుతుంది. కన్నులు ఎఱ్ఱబారుతాయి. కంటిలో ఉపద్రవం ఏర్పడుతుంది. రక్తంలో కొన్ని ఆమ్లాలు ద్రావకాలు ఉద్భవిస్తాయి. శరీరం అనిర్వచనీయమైన వ్యయప్రయాసలకు లోనవుతుంది. ఒక్క వాక్యంతో చెప్పాలంటే మనిషికి కోపం వచ్చినప్పుడల్లా కొంత ఆయుస్సు క్షీణిస్తుంది. ఆరోగ్యం తగ్గుతుంది."

ఆధ్యాత్మిక పురోగతికోసంకాకుండా కేవలం ఆయురారోగ్యము కాపాడుకోవాలి అనే స్వార్థ చింతతోనైనా మనిషి "కోపం" తెచ్చుకోకుండా ప్రశాంతచిత్తత అలవరచుకోక తప్పదు.

"క్రోధ మోహ నామకులైనత్యాగరాజు."శాంతము లేక సౌఖ్యము లేదు, దాంతునికైనా వేదాంతునికైనా" అని ఆలపించాడు. ఘోరశస్త్రలిడవు రెలియించు మండుదు రెపుడు అంతరంగ మయ్యుభయంబునడంగకున్న ఊరక గలదె బ్రాహ్మణ్య గౌరవంబు." ఇది మహాభారత ప్రబోధం.

"కోపం తాత్కాలికమైన ఉన్మాదం" అని చీనా సామెత.

సరే! మానవులు కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్య వివశులు. మనుజులకు అప్పుడప్పుడు కోపం వస్తుంది. ఏం చెయ్యాలి అని ఎమరుప్రశ్న ఎవరైనా వేయవచ్చు. దీనికి సులువైన విరుగుడు సూచించాడు ఒక పెద్దమనిషి. కోపం రాగానే ఒకటి రెండు మూడు అని పది అంకెల వరకు నీలోలోపల గుణించు. కోపం తగ్గుతుంది. తగ్గకపోతే ఇంకో పదివరకు లెక్కపెట్టు. అప్పటికీ తగ్గకపోతే వంద వరకు లెక్కించు. పరిహాస విజల్పితమైన యీ పరిష్కారంలో కొంత పరమార్థంగూడ లేక పోలేదు.

తెలుగులో "అసమర్థుడికి కోపం ఎక్కువ" అనే సామెత ఏర్పడింది. ఎందుచేతనో సమర్థత, మౌనగాంభీర్యం సహజీవనం కొనసాగిస్తాయి. అట్లాగే అసమర్థత-కోపం ఒకేచోట ఉంటాయి.

"పేదవానికోపం పెదవులకు చేటు" అనే సామెత తెలుగులో ఉంది. అయితే ఆ సామెతకు మెలమెల్లగా కాలదోషం పడుతోంది. ధనికుల కోపం వారి పెదవులకే గాక పదవులకుగూడ చేటు తేవచ్చు.

నిజం చెప్పాలంటే కోపం ఏ సమస్యనూ పరిష్కరించలేదు సరిగదా ప్రాయికంగా క్రొత్త చిక్కులు తెచ్చిపెట్టవచ్చు.

కోపం ఎవరికీ మంచిదిగాదు. పేదవారికి కోపం చెడుపే. ధనికులకూ చేటే.

కోపం ఏవ్యక్తికైనా ఎంత చెరపు చేస్తుందో ప్రత్యేకంగా చూడాలంటే కోపం వచ్చిననాడు తన మొగం అద్దంలో చూచుకోవటం మంచిది. కోపం వచ్చినప్పుడు ఎంత అందమైన ముఖం అయినాసరే, వికృతంగా మారుతుంది. కోపాన్ని నిగ్రహించగలిగితే ఆత్మచైతన్య స్రవంతికి "ఆనకట్ట" కట్టినట్లే. అప్పుడు జీవితం సశ్యశ్యామలం అవుతుంది.

---

నస్మరించకుండ సంకల్పబహుళముల్
కావిగట్టువాడు కాడు యోగి
స్వార్థముడిగి-జ్ఞాని-సంసారమందుండి
పొందవచ్చు ముక్తి బొంకె లేద

# దానం

శతేషు జాయతే శూరః
సహస్రేషు చ పండితః
వక్తా దశ సహస్రేషు
దాతా భవతి వా న వా॥

"వందమందిలో ఒకడు శూరుడు ఉద్భవించవచ్చు వేయిమందిలో ఒకడు పండితుడు కావచ్చు. పదివేల మందిలో ఒకడు వక్త కావచ్చు. "దాత" ఒక్కడు ఎక్కడా కన్పించటం అరుదు" ఇది పై శ్లోక తాత్పర్యం.

పౌరాణిక వాఙ్మయంలోగూడ దాతలు అరుదుగానే కన్పిస్తారు. "దాత" అనగానే జ్ఞాపకం వచ్చేది మహాభారతంలోని కర్ణ పాత్ర. ధనవంతులు అందరూ దాతలు కాలేరు. దుర్యోధనసార్వభౌమునికంటే గొప్ప ధనవంతుడు కాడుగదా కర్ణుడు. అయితే త్యాగం ఉండాలి. ఎవరైనా దాత కావాలంటే ఉండవలసింది కరుణార్ద్రహృదయమే గాని కేవలం సంపన్నత మాత్రమే కాదు. త్యాగమే దానానికి "ఆత్మ". ఇంద్రుడు, పుత్రమమకారంతో అర్జునునకు మేలు చేయగోరి కర్ణుని దగ్గరకు మాయాబ్రాహ్మణుడై వచ్చి అర్థించినపుడు కర్ణుడు తన సహజ కవచకుండలాలు దానం చేశాడు. తన్ను అర్థించింది బ్రాహ్మణుడు కాదనీ ఇంద్రుడనీ కర్ణునికి తెలుసు.

భాగవతంలోని పాత్ర బలిచక్రవర్తి గూడ తనకు రాబోయే విపత్తును తన గురువు శుక్రాచార్యుడు హెచ్చరించి చెప్పినాసరే వామన వటువునకు "మూడు అడుగులు" దానం చేసి తాను పదభ్రష్టుడైనాడు.

ప్రపంచంలో అన్ని మతాలు దానధర్మాలు ఆధ్యాత్మికోన్నతికి విధ్యుక్తసూత్రాలుగా అనుశాసించాయి. సనాతనహిందూమతం దాన ధర్మాలకు కల్పించిన ప్రాముఖ్యం అందరకు తెలిసినట్టిదే! గోదానం, భూదానం–హిరణ్యదానం, సాలగ్రామదానం, కన్యాదానం, అన్నదానం, విద్యాదానం-దానాలపట్టిక హిందూమతంలో ఒక అంతులేని ఆకృతిగణం.

పండుగలలో పర్వాలలో శుభకార్యాలలో శ్రాద్ధకర్మలలో అన్ని మతప్రక్రియలలో హిందూమతం దానకృత్యాల్ని విధ్యుక్తధర్మాలుగా అనుశాసించింది.

సాహిత్యంలో సర్వమత సంప్రదాయాలలో ఇంతగా శ్లాఘింపబడిన దాత మహనీయుడే అని అంగీకరింపక తప్పదు. అయితే అది పాత్రదానమైనప్పుడు దాతకంటే, ఆలోచిస్తే దానగ్రహీతయే గొప్పవాడు అని చెప్పవలసివస్తుంది. ఏ మహారాజో ఒక వేదవేదాంగ పారంగతునికి లేదా ఒక పండితునికి ఒక అగ్రహారం దానం చేస్తే, నిశ్చయంగా ఆ విద్వాంసుడే ఆ మహారాజుకంటే గొప్పవాడు. ప్రాయికముగా, దానధర్మాలు పాత్రులకు ఇచ్చేవి బహుమతులే!

ఇంతేగాదు, ఐహికదృష్టితో చూస్తే, ఎంత ఎక్కువ ధనం వ్యయం చేస్తే అది అంత గొప్ప దానం కావచ్చు. కాని పారమార్థిక దృష్టితో చూస్తే దానంయొక్క విలువ దాత చేసిన త్యాగంపై ఆధారపడి ఉంటుంది.

అశ్వమేధయాగం చేసినప్పుడు, మహాభారతకథలో ధర్మరాజు తన కోశాగారంలో ఏమీ మిగుల్చకుండా దానధర్మాలు చేశాడట. అతని తమ్ములు అందరు తమ అన్నగారి దాతృత్వానికి గర్వించారుకూడా: అయినప్పటికీ అతనికి సమకాలీన సమాజంలో దాతగా కర్ణుడు ఆర్జించిన కీర్తి దక్కలేదు. ఒక ముంగిస ఆ మహాయజ్ఞ స్నాతకోత్సవానికి వచ్చి, ఋత్విజులు విద్వాంసుల ముందర ధర్మరాజు చేసిన దానాలుగాని అంతకుముందు షోడశమహారాజులు చేసిన దానాలుగాని ఒక పేదవిప్రుడు సక్తుప్రస్థుని దానానికి సరితూగవని ఆక్షేపించింది. ఆ సక్తుప్రస్థుడు కరువు కాటకం దేశాన్ని అలముకొన్నప్పుడు తాను ఉంఛవృత్తిచే సేకరించిన ధాన్యం తెచ్చి, పిండిచేసి తయారుచేసిన గంజిని ఆకలిగొనియున్న అతిథికి సమర్పించాడు. అతని కుటుంబసభ్యులు ఆవిధంగానే చేశారు. వారికి బ్రహ్మలోకప్రాప్తి కలిగింది. ఆ దానజలంలో పొరలాడిన ఆ ముంగిస దేహం సగం బంగారంగా మారింది. అప్పటినుండి ఆ ముంగిస ఎన్నో యజ్ఞయాగాలకు వెళ్లిందట! మిగిలిన సగందేహం బంగారం చేసుకోవాలని. షోడశమహారాజుల యజ్ఞాలలో చివరకు ధర్మరాజు అశ్వమేధయాగంలోగూడ ఆ ముంగిస కోరిక ఫలించలేదు.

అనగా ఒక మహారాజుగారు నవరత్న కాంచనరాసులతో నిండిన కోశాగారం అంతా ఖాళీచేసి చేసిన దానధర్మాలకంటే, తనకే తినటానికి తిండి లేని ఒక నిరుపేద హృదయపూర్వకంగా చేసిన దానం-అది పేలపిండి గంజి అయినప్పటికీ-ఆధ్యాత్మికంగా గొప్పది అనేది మహాభారత సందేశం.

అందుచేత దాతకు ఉండవలసిన లక్షణాలు 1. ఔదార్యం 2. త్యాగం. ఔదార్యం లేని దానం లంచంతో సమానం. త్యాగం లేని దానం-దర్పం-అవుతుంది. నిజమైన దానం పేరు ప్రతిష్ఠలు ఆశించి అనేదికాదు. అందుచేతనే అభిజ్ఞులు "గుప్తదానం" గొప్పది అని చెంటారు.

# అదృష్టం

మేరు పర్వత సంకాశాత్
సామర్థ్యాదపి భూతలే,
వరం సర్షప మాత్రం హి
భాగధేయం కదాచన.

భూలోకంలో మేరుపర్వతమంత సామర్థ్యం కంటె ఆవగింజంత అదృష్టం మేలని పై శ్లోక తాత్పర్యం.

మహాభారతంలో పై విషయాన్ని హృదయంగమంగా వివరించే సన్నివేశం ఒకటి ఉంది. పంచపాండవులు, కుంతి వారణావతంలో లక్క యిల్లు తగులబడే ముందు తప్పించుకొని ఏకచక్రపురంలో ఉన్నారు. కుంతికి తన పుత్రులు జగదేకవీరులనే సంతోషం లేకపోలేదు. అయితే వారు ఏకచక్రపురంలో భిక్షాటన చేసి జీవించవలసి వచ్చింది. ఆ సమయంలో ద్రుపదమహారాజు ద్రౌపదీ స్వయంవరం చాటించటము, ఆ స్వయంవరములో మత్స్యయంత్రం భేదించి, అర్జునుడు ద్రుపదరాజపుత్రిని సంపాదించటము అందరికీ తెలిసిన కథే. పాండవులు ద్రుపదరాజపుత్రికను వెంటబెట్టుకొని రాజధానిలో ఒక కుమ్మరి ఇంటిలో బసచేసిన తల్లి దగ్గరకు వచ్చారు. పంచపాండవుల మధ్య నడచివచ్చే ద్రౌపది, ఐదు కొండలమధ్య తుళ్ళింతలాడుతూ ప్రవహించే నదీసుందరివలె కన్పించినదని కవివర్ణన ! ద్రౌపది కూడా, జగదేకధనుర్ధరులైన ఆ ఐదుగురు శూరులను గన్న వీరమాత ఈమెయే గదా అని కుంతీదేవిని

ఆశ్చర్యతన్మయత్వంలో తేరిపారజూచి, అత్తగారికి పాదనమస్కారం చేసింది. కుంతీదేవి కోడలిని కౌగిటిలో గ్రుచ్చియెత్తి దీవించింది, మునిమునినవ్వులతో. కుంతి ఏమని దీవించింది కోడలిని? "మహారాజపుత్రీ, నీవుకూడా శూరులను కని వీరమాతవు గమ్ము" అని ఆమె ఆశీర్వదించ లేదు.

భాగ్యవంతం ప్రసూయేథాః
మా శూరం మా చ పండితం"

"అమ్మా! నీవైనా అదృష్టవంతులైన పుత్రుల్ని కనమ్మా! శూరుల్ని కనవద్దు, పండితుల్ని కనవద్దు" అన్నది కుంతీదేవి. ఎందుకంటే అతిలోకసామర్థ్యం; అసాధారణ పాండిత్యము ఉంటే ఈ భూలోకములో ఏమి లాభము? మేరుపర్వతమంత సామర్థ్యంకంటే ఆవగింజంత అదృష్టం ఉంటే మేలు అని ఆ వీరమాత కుంతీదేవి అనుకున్న దంటే, ఆ మాతృహృదయం ఎంతటి ఆవేదన అనుభవించిందో ఊహించుకోవచ్చు.

పౌరాణికయుగంలోని పాండవుల మాట అటుంచినా, నేడు గూడ నమకాలీన నమాజంలో అదృష్టదేవత కటాక్షవీక్షణాలకు నోచుకోని నమర్థు లెంద రెందరో అష్టకష్టాలకు లోనై అలమటించి పోతున్నారు. ఇక అదృష్టం ఉంటే, అనమర్థులకుకూడ ఉన్నతపదవులు లభించవచ్చు. అష్టైశ్వర్యాలతో తులతూగవచ్చు.

అయితే, అదృష్టదేవత అభిమానం ఎవరిమీద; ఎప్పుడు ఏవిధంగా ప్రసరిస్తుందో ఇంతవరకు ఎవరికి అంతు చిక్కలేదనే చెప్పాలి. ఎంతో కష్టపడి కష్టపడి చీమవలె శ్రమించితేనే ధనం వస్తుందని చెప్పలేము.

ధనలక్ష్మి అదృష్టదేవతకు చెలికత్తె. ఆమె ఏ యింట్లోనో ఎవరికీ తెలియకుండానే ప్రవేశించవచ్చు.

ఆయాతి పురుషం లక్ష్మీః
నారికేళఫలాంబువత్
నిర్యాతి పురుషాల్లక్ష్మీః
గజభుక్తకపిత్థవత్.

పై శ్లోకానికి చక్కని తెలుగు అనువాదం సుమతీశతకంలో ఉంది.

సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్;
సిరి దా పోయిన పోవును
కరిమ్రింగిన వెలగపండు కరణిన్ సుమతీ.

సిరి యొత్తుకుంటే టెంకాయలోకి నీళ్ళు చేరినట్లు చేరుతుంది. నీరు వల్ల వెరుగు: కాని అదృష్టం పట్టితే, క్రిందనుండి టెంకాయి చెట్టు పైకివెళ్ళి కాయలోకి ప్రవేశిస్తుంది! ఇక ఏనుగు విసర్జించే వెలగకాయలు పైకి బాగానే కన్పిస్తాయి. ఎక్కడా చిల్లులుగాని చీటలుగాని కన్పించవు. అయితే అందులో "గుంజు" ఏమైనట్లు? అది సృష్టిలోని వింతలలో ఒక వింత. అట్లాగే ఐశ్వర్యవంతులుగూడ దురదృష్టపీడితులైనప్పుడు నిరుపేదలు కావటం కద్దు.

దుష్యంతుని నోట కాళిదాసమహాకవి ఒక అర్థవంతమైన వాక్యము పలికించాడు. 'అరణ్యంలో అదృష్టం ఎట్లా పడుతుంది' అని దుష్యంతుడు తర్కించుకొని "అథవా భవితవ్యానాం ద్వారాణి భవంతి సర్వత్ర"

అంటాడు. "అదృష్టానికి అన్నీ తలుపులే" అని పై వాక్యానికి తాత్పర్యం. అదృష్టదేవత, విజ్ఞానాలు వింగడింపలేక, చివరకు వేదాంతులు అది మనుజుల పూర్వపుణ్య సంచితం అని సరిపెట్టారు. భర్తృహరి మహాకవి వ్రాసిన శ్లోకం ఇట అనుసంధేయం.

వనే రణే శత్రు జలాగ్నిమధ్యే
మహార్ణవే పర్వతమస్తకే వా
సుప్తం ప్రమత్తం విషమస్థితం వా
రక్షంతి పుణ్యాని పురాకృతాని.

అదృష్టవంతుడు అరణ్యంలో ఉన్నా ఘోరసంగ్రామంలో చిక్కుకొన్నా సముద్రంలో పడిపోయినా, అగ్నిజ్వాలలో చిక్కుకొన్నా అతడు పురాకృత పుణ్యవిశేషంవల్ల తన ప్రయత్నం లేకుండానే రక్షింపబడుతాడు.

---

## సత్యము

సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుగావు
ఎఱుగు మెల్ల ధర్మంబుల కెందు పెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

— మహాభారతము

# అప్రియసత్యం

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్ సత్య మప్రియమ్,
ప్రియం చ నానృతం బ్రూయాత్
ఏష ధర్మ స్సనాతనః.

సత్యం పలుకవలె: ప్రియం పలుకవలె: అప్రియమైన సత్యం పలుకరాదు. ప్రియమని అసత్యం పలుకరాదు. ఇది సనాతనమైన ధర్మం. ఇది పై శ్లోకానికి తాత్పర్యం.

"సత్యమేవ జయతే"- సనాతన భారతీయ సంస్కృతికిది అంతరాత్మ. నేడు ఈ సుభాషితాన్నే స్వతంత్ర భారతదేశం మకుటంగా స్వీకరించింది. గాంధీమహాత్ముడు సత్యమే పరబ్రహ్మస్వరూపం అన్నాడు. అయితే పై శ్లోకం సత్యాన్ని ప్రియభాషణంతో ముడిపెట్టింది. సత్యం చెప్పాలి అయితే ఆ సత్యాన్ని ప్రియంగా చెప్పాలి. ఒకవేళ కఠోరసత్యం చెప్పవలసివస్తే? అప్రియమైన సత్యాన్ని చెప్పవద్దని పై శ్లోకం చెప్పే సలహా ! అయితే-ప్రియమైనదని అసత్యం మాత్రం ఎన్నడూ చెప్పగూడదు అని ఈ శ్లోకం అనుశాసిస్తోంది. ఈ శ్లోకం తెచ్చిపెట్టిన చిక్కు- అప్రియ సత్యం చెప్పరాదు' అనే ఆదేశం. ఈ అనుశాసనంతో ఏకీభవించని ఆదర్శప్రేరితులు "సత్యం ప్రియమైనా అప్రియమైనా సరే శంకాసంకోచాలు లేకుండా చెప్పవలసిందే" అంటారు. ఆ వాదాన్ని అంగీకరించేవారు "న బ్రూయాత్ సత్యమప్రియం" అనే పాదానికి వారి వాదానికి అనుకూలంగా

వ్యాఖ్యానం చేస్తున్నారు. "సత్యమును అప్రియంగా చెప్పకు" అని వారు ఆ పాదానికి అర్థం చెప్పుతారు. అయితే సత్యం ప్రియభాషణం కలిస్తే ఇక అది అందరకు ఆమోదదాయకమే గదా. వాల్మీకి మహాకవి ఈ వివాదానికి సుకుమార సుందరమైన అవ్యక్తి కల్పించారు.

పురుషా బహవో రాజన్
సతతం ప్రియవాదినః,
అప్రియస్య తు పథ్యస్య
వక్తా శ్రోతా చ దుర్లభః.

ఓ రాజా,

ప్రియము పలుకువారు పృథివిలో కొల్లలు:
వినెడివారు గలరు వేలకొలది:
అరుదు పథ్య మప్రియమ్ము పల్కెడువాడు
వినెడువాడుగూడ విశ్వమందు!

అని పై శ్లోకాన్ని తెలుగుపద్యంలోకి అనువదించవచ్చు. సనాతన ధర్మం 'సత్యమేవ జయతే' అని ప్రవచించించి లోకసంగ్రహార్థం అప్రియ సత్యాన్ని చెప్పవద్దనటానికి "వక్తా శ్రోతా చ దుర్లభః" కారణం కావచ్చు. మానవుడు సంఘజీవి. అప్రియసత్యం పలుకటం సామాజికజీవితంలో ఎటికి ఎదురీత. అయితే, మానవమాత్రునకు అప్రియసత్యం చెప్పే సాహసం లేకపోవటం సహజం అని పై శ్లోకాలు సానుభూతి చూపిస్తున్నాయి గాని, నిరయంబైన నిబద్ధమైన ధరణీనిర్మూలనంబైన....ఓరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య వేయేటికిన్' అనే మహాదారులు అతిలోకతేజస్సులు ఆధ్యాత్మికతపస్సంపన్నులు అని పై శ్లోక కర్తలు

అంగీకరిస్తారని సూక్ష్మదృష్టికి తట్టుతుంది. ఎందుచేతనంటే ఈ శ్లోక ధ్యేయం సత్యపారమ్య నిరూపణమే.

అయితే ఈ భూలోకంలో దేశకాల పాత్రానుబద్ధమైన
భూతహితంబుగా పలుకు బొంకును
సత్యఫలంబు నిచ్చు: తన్
భూతభయాస్పదంబగు ప్రభూతపు
సత్యము బొంకు సట్లు; ప్రా
ణాతురుడై నచో పరిణయంబున
యందును ఆడు బొంకు న
త్యాతిశయంబ యండ్రు మహితాత్మక!
ఇట్టివి "ధర్మసూక్ష్మముల్"

అని బ్రాహ్మణతపస్వి కౌశికునకు వివరిస్తాడు.

భాగవతంలో బలిచక్రవర్తి సత్యవ్రతానికి కట్టుబడి వామనునికి మూడు అడుగులు దానం చేసే సందర్భంలో రాక్షసగురువు శుక్రాచార్యుడు సత్యభాషణానికి కొన్ని అపవాదాలు ప్రతిపాదించాడు.

వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణ విత్త మాన భంగ మందు
చకిత గోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు: అఘము పొంద దధిప::

శుక్రనీతిలోని సత్యనిర్వచనభాగంలో పాల పాలుకంటె నీటి పాలు అధికంగా కన్పిస్తోంది. అయితే బలిచక్రవర్తి తన సత్యనిష్ఠ వదలు కోలేదు. అట్లాగే కేవలం సత్యనిష్ఠకు అంకితమైనవాడు హరిశ్చంద్రుడు,

ఎట్టి ఇక్కట్టులు దాపురించినా అతడు తన సత్యశీలనిష్ఠకు భంగం రానీయలేదు.

ఇక ఈ సందర్భంలో అనుశీలించవలసింది, నిరత సత్యవ్రత నిష్ఠాగరిష్ఠుడైన ధర్మరాజు మాట. మహాభారత సంగ్రామంలో సేనాధిపతియైన ద్రోణుని ధాటికి తట్టుకోలేక పాండవసైన్యం చెల్లాచెదరై వెనుదిరిగి పారిపోతోంది. ధనువు చేతనుండగా ద్రోణుని విజృంభణ అరికట్టటం అసాధ్యం. శ్రీకృష్ణుడు చెప్పిన సలహా "అశ్వత్థామ చచ్చె" నని ధర్మరాజు వెళ్ళి ద్రోణునితో చెప్పితే, పుత్రశోకార్తుడైన ద్రోణుడు తన చేతవిల్లు దించగలడు అని. ఇక ధర్మరాజు సత్యవ్రతం ఏంకావాలి! దానికి ధర్మరాజు సమ్మతించడు. ఇంతలో భీముడు ముందుకు వచ్చి, తాను అంతకుముందే "అశ్వత్థామ" అనే ఏనుగును చంపినానని చెప్పి ద్రోణుని దగ్గరకు వెళ్ళి "అశ్వత్థామా హతః" అని బిగ్గరగా అరచి వచ్చారు. ద్రోణుడు, భీముని మాటలు నమ్మలేకపోయాడు. అతడు ధర్మరాజు దగ్గరకు వచ్చి నిజం చెప్పమని అర్థించాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని ప్రేరణవల్ల జయాశవల్ల బిగ్గరగా అశ్వత్థామా హతః అని మెల్లగా "కుంజరః" అని మేలిముసుగు వేసిన అసత్యం చెప్పాడు.

ఇది ధర్మరాజు శీలానికి కళంకం కాదా? కాదని ఎవరనగలరు? అందుకనే ధర్మరాజు మొదట నరకసందర్శనం చేసి అటుపిమ్మట స్వర్గానికి వెళ్ళినట్లు మహాభారతకథనం! అంతేగాక ధర్మరాజును అసత్యమాడమని ఆదేశించింది శ్రీకృష్ణపరమాత్మ. ధర్మరాజు "సర్వ ధర్మముల్ పరిత్యజించి" శ్రీకృష్ణపరమాత్మకు శరణాగతుడైన భక్తుడు. "మానవమాత్రుడెవడు అసత్యదోషానికి బాధ్యత వహించి నిష్కృతి కల్పించ గలడు? కేవలం పరమాత్మ తప్ప"— అని సరిపెట్టుకోవాలి అని పండితులు దీనికి సమన్వయం కల్పిస్తారు!

*

# త్యాగం

న కర్మణా న ప్రజయా
న ధనేన త్యాగేనైకేన
అమృతత్వ మానశుః ।

సత్క్రియలు చేయటంవల్ల గానీ- సత్ సంతానం కనటం వల్ల గానీ, అపారమైన ఐశ్వర్యం ఆర్జించటం వల్లగానీ లభించని 'అమృతత్వం' ఒక్క త్యాగం వల్ల మాత్రమే సాధకుడు ఆవిష్కరించుకోగలుగుతాడు'- అని పై మంత్రవాక్యానికి తాత్పర్యం. సత్కర్మాచరణవలన పుణ్యం లభించవచ్చు. పై మంత్రార్థం సత్కర్మలను ఏమాత్రం గర్హించటం లేదని గుర్తించాలి. అట్లాగే-సంతానం వల్ల పున్నామ నరకం నుండి విముక్తి లభించవచ్చు. ప్రాచీనులు సంతాన లాభమునకు ఇచ్చిన ప్రాముఖ్యం అందఱకు తెలిసిందే. సంతాన ప్రాప్తియే ఈ సృష్టి సర్గాన్ని అవ్యాహతంగా కొనసాగిస్తున్నది. 'ధనమూల మిదం జగత్'- ధన సంపాదన ఐహికాముష్మిక శ్రేయోదాయకం. ఇవన్నీ గొప్పవే. కాని ఇవి ఏవీ "త్యాగం" తో సరితూగజాలవు.

త్యాగంతో మాత్రమే అనిర్వచనీయమైన దివ్యత్వం ఉంది. త్యాగమే అమృతత్వాన్ని ఆవిష్కరించుకో గలదని ఈ ఋక్కు నొక్కి వక్కాణించటం గమనించదగ్గ అంశం.

రామాయణంలో ఆదికవి వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రుని గాధ హృదయంగమంగ అభివర్ణించాడు.

కూజంతం రామ రామేతి
మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితాశాఖాం
వందే వాల్మీకి కోకిలం॥

అని ఆ మహాకవికి తరువాతి కవులు చేయెత్తి మ్రొక్కి ప్రక్కన నిలబడ్డారు!

వాల్మీకి-శ్రీరాముని "రామో రాజీవలోచనః" అని అనేకమార్లు అభివర్ణించి "విగ్రహవాన్ ధర్మః" రాముడు మూర్తీభవించిన ధర్మమే అని సహృదయులు తలయూపేటట్లు రామాయణకథ తీర్చిదిద్దాడు. రాముడు సమస్తకల్యాణగుణగణాలతో భాసించవచ్చు. అయితే రాముని దివ్యుని చేసింది అతని అలౌకిక త్యాగం. తాను-సింహాసనాన్ని త్యజించి, పితృవాక్యపరిపాలనకై పదునాలుగేండ్లరణ్యవాసం చేశాడు.

నిత్యసత్యవ్రతుడై-తన సామ్రాజ్యాన్ని సర్వస్వాన్ని ఒక సన్న్యాసికి ధారవోసిన హరిశ్చంద్రచక్రవర్తి త్యాగం - యుగయుగాంతరాలుగా-సహృదయుల హృదయాలను ఉఱ్ఱూతలూగిస్తూనే ఉంది. ఈ పౌరాణిక గాథలు అటుంచి చారిత్రక కాలంలో బుద్ధభగవానుడు దేశదేశాంతరాలలో దివ్యుడుగా అమృతత్వం ఆవిష్కరించుకోగలిగాడు? ఎందుచేత? అతని మహత్తర త్యాగం అనన్యసాధారణం. అతిమానుషం.

గౌతమబుద్ధుడు ఒక అర్ధరాత్రి-అర్ధాంగినీ చిరంజీవినీ సింహాసనాన్నీ వదలి, విశ్వమానవకల్యాణం కోసం-అంతఃపురం వదలి అరణ్యసీమలలోకి వెళ్ళిపోయాడు. ఎందరు మానవులు పగలు-రాత్రిళ్లు-ఎన్ని ప్రయాణాలు చేయలేదు? ఎంతమంది తమ తమ గృహాలనుండి ఎన్నో

కారణాలవల్ల నిష్క్రమించటంలేదు కాని-ఆనాటి యువరాజు సిద్ధార్థుని యాత్ర బౌద్ధ - వాఙ్మయప్రపంచంలో "మహాభినిష్క్రమణం"గా చిర స్మరణీయమై నిలిచింది. వివేకానందమహర్షి బుద్ధుని త్యాగంలోని ఆధ్యాత్మికప్రతిపత్తిని వేనోళ్ళ శ్లాఘించాడు.

అధునాతనయుగంలో గాంధిమహాత్ముని చరిత్ర సుప్రసిద్ధం. మహాత్ముని 'త్యాగం'-భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించటమే గాక, యావత్ప్రపంచానికీ-అహింసాసిద్ధాంతం సత్యనిష్ఠ ద్వారా అమృతత్త్వాన్ని ఆవిష్కరించింది. మహాత్ముని శంఖారావానికి తమ గుండెలు త్రుంచుకొని జారసాలవండి చేసాలకు వెళ్ళిన త్యాగమూర్తులు ఉన్నారు!

"త్యాగమే ఆధ్యాత్మిక భారమితి"

అందుచేతనే అన్నిమతాలలో "సన్న్యాసదీక్ష" ఏర్పడింది. మానవ చరిత్రలోనే సర్వసంగపరిత్యాగియైన సన్న్యాసి జగదారాధ్యుడైనాడు, దేశదేశాలలో మతమతాంతరాలలో.

"తలలు బోడులైన తలపులు బోడులా??"

అని వేమనవంటివారు ఆక్షేపించవచ్చు. తలలు మాత్రమే గాక తలపులుగూడ బోడులైన వారేదా నిజమైన సన్న్యాసులు. సర్వసంగ పరిత్యాగులు. అయితే, సంసారంలో ఉండి గూడ త్యాగయోగులు అయిన వారున్నారు. "సన్న్యాస వ్యవస్థ"- త్యాగానికీ సర్వమతాలు సమకూర్చిన "గుర్తింపు" అని గ్రహించవచ్చు.

ఏ సమాజంలో అయినా స్వార్థ త్యాగి, దయావీరుడుగా దివ్యుడుగా గుర్తింపబడి అమృతత్వం ఆవిష్కరించుకోగలుగుతున్నాడు. పై బుద్ధుకు-స్వేచ్ఛానువాదప్రాయమైన తెలుగు పద్యం.

"సాధనలు గావు సంతాన సంపదల్,
సత్క్రియాచరణము- జ్ఞాన పటిమ,
త్యాగ మొకటె అమృతయోగసిద్ధికి త్రోవ,
సకలధర్మసార సంగ్రహమ్ము." *

# వెనుకటిగుణం

కర్పూరధూళీరచితాలవాలః
కస్తూరికాకుంకుమలిప్తదేహః,
వన్నీరసీరైః పరిషిచ్యమానః
ప్రాంచం గుణం ముంచతి కిం పలాండుః ?

"కప్పురపు పొడితో పాదు చేయవచ్చు. కుంకుమం కస్తూరి పులుమవచ్చు. పన్నీటితో తడుపవచ్చునుగాని "ఉల్లి" గడ్డకు వెనుకటి గుణం పోతుందా?" ఇది పైశ్లోకతాత్పర్యం.

తెలుగుభాషలో ఒక సామెత ఉంది. పుట్టుకతో వచ్చే బుద్ధి పుడకలతో గాని పోదు.

అంటే సహజసిద్ధమైన గుణాలు— మరణించే వరకు మనిషిని వదలిపెట్టవు అని భావం.

తెలుగువారికి పై శ్లోకం చదువగానే జ్ఞాపకం వచ్చేది సుమతిశతకంలో ఒక పద్యం ఉంది.

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండ పెట్టి శుభలగ్నమునం
దొనరగ పట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ.

పై సంస్కృత శ్లోకంలో- సుమతి శతకంలోని తెలుగు పద్యంలో గూఢ రచనాశిల్పంలో ఒక సొగసు ఉంది. శ్లోకంలో 'ప్రాంచం

గుణం' అనీ, తెలుగు పద్యంలో వెనుకటి గుణం అనీ- సూచ్యార్థసూచకంగా కవి వదలి పెట్టాడు గాని ఆ వెనుకటిగుణం వాచ్యంచేసి చెప్పలేదు. చెప్పనక్కరలేదు, చెప్పగూడదు. చెప్పితే అది జుగుప్సావహం.

అయితే ఇక్కడ ఈ శ్లోకంలో ఈ పద్యంలో ప్రస్తుతమైన "ఉల్లిగడ్డ" - "శునకం" కేవలం అన్యాపదేశాలు మాత్రమే. లోకంలో ఇటువంటి బాపతు మనుష్యులు ఉంటారు సుమా! జాగ్రత్త? అనే హెచ్చరిక పీటిలో అంతర్గర్భితంగా ఉంది.

అయితే ఇక మానవుడు పుట్టినప్పటినుండి చచ్చిపోయే వరకు మారడా? విద్య-పెంపకం- పరిసరాల ప్రభావం- మానవులమీద ఉంటదా? ఉండదని పై శ్లోకంగాని పై పద్యంగాని పిడివాదం చేయటం లేదు.

మనిషి- మారడు. విద్య పరిసరాలు సంస్కారం అంతా పై పై పూత మెరుగులే అని వాదించేవారు లేక పోలేదు.

పూతపసిరి మెరుపు పూయవచ్చునుగాని
నరుల నేమి మార్చు నాగరకత?
తడిసినపుడు పట్టు- తప్పకుండగ- త్రుప్పు
మొరయు నట్టి ఇనుప మేకు వెల్ల.

సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు

"Man is a saint when inspired and a criminal when compelled"

అని అన్నారు. "భవ్య ప్రేరేపణ లభించినపుడు మానవుడు యోగికావచ్చు. ప్రతికూల పరిస్థితులవల్ల పాపికావచ్చు" అని ఆయనభావం.

వివేకానంద మహర్షి. Religion awakens the Divinity already in man" అంటారు.

అసలు ప్రతిమనిషిలో వానరరూపంలో బీజప్రాయంగ "ఎన్నో గుణాలు" ఉంటాయి. మానవత్వం, అటు దివ్యత్వానికి ఇటు పశుత్వానికి మధ్య కదలుతూవుండే ఊయెల ఊపు.

ప్రపంచ చరిత్రలో ఎందరో భోగులు విరాగులైన యోగులుగా మారారు. దొంగలు దివ్యులుగా మహర్షులుగా మారారు.

యోగియగును మనిషి ఉత్తేజితుండైన !
పరిసరాలబట్టి పాపియగును !!
చదువు-చుట్టునున్న సాంఘిక స్థితిగతుల్
మనిషి మనసు- నడత- మలచగలవు. అనే వారూ ఉన్నారు.

ఇక రెండు వాదాలు సమీక్షించవచ్చు.

మొట్టమొదట ఉదహరించిన శ్లోకానికి స్వేచ్ఛానువాదం.

పాదు తడువవచ్చు పన్నీటి జల్లుతో :
నింపవచ్చు కప్పురంపు ధూళి:
చల్లవచ్చు పునుగు జవ్వాది- కస్తూరి :
మారి ఉల్లి గుణము వేరుగాదు.

అయితే యీ వాదానికి పూర్వపక్షం నెలకొల్పుతూ చెప్పదగినమాట ఒకటి ఉంది.

జనన మందినపుడు జనులెల్ల శిశువులే
పుణ్యుడెవడుగాడు పుట్టగానె :
పుట్టుపాపి ఒకడు పుడమి పైనను లేడు
మనిషి గొప్పఋషిగ మారవచ్చు.

)(o)(

"Forwarded Free of Cost and with the Compliments of the Department of Education, Government of India, New Delhi".

# విద్య

ఆచార్యాత్ పాద మాదత్తే
పాదం శిష్యః స్వమేధయా
పాదం సబ్రహ్మచారిభ్యః
శేషం కాలక్రమేణ చ.

విద్యాభ్యాసాన్ని గూర్చి – విశేష పరిశ్రమ చేసిన విద్వాంసుడెవ్వరో చెప్పినది ఈ సంస్కృత శ్లోకం. గురువుగారి దగ్గర నుండి శిష్యులు నేర్చుకొనేది ఒక వంతు. తోడి విద్యార్థుల దగ్గరనుండి నేర్చుకునేది ఒక పాలు. మిగిలిన నాలుగో వంతు విద్య–కాలక్రమమున సిద్ధిస్తుంది.

విద్య–గ్రహణంలో గురువుగారు వహించే పాత్ర నూటికి పాతిక పాళ్ళు మాత్రమే! లోకంలో ఒక దురభిప్రాయం ప్రచారంలో ఉంది. చదువు–గురువుగారినుండి సంపూర్ణంగా సిద్ధిస్తుందని, జిజ్ఞాసువైన శిష్యుడు తన స్వకీయ ప్రతిభవలన కొంతజ్ఞానార్జన చేయవచ్చుననే సంగతి చాల మంది అంగీకరిస్తారు. అయితే గురువుగారి దగ్గరనుండి శిష్యుడు ఎంత నేర్చుకొనునో అంత సొంతంగా కృషిచేసి విజ్ఞానార్జన చేస్తాడని ఈ శ్లోకం నిర్దేశిస్తుంది. అంటే గురు ప్రబోధంతో సరిసమానంగా ఉండాల్సినమాట స్వయంకృషి ! విద్యాభ్యాసంలో" గురుప్రబోధానికి" "విద్యార్థి స్వయంకృషికి" —ఉన్న విలువ లోకం గుర్తించింది. అయితే విద్యార్థులు గురువు దగ్గరనుండి మాత్రమేగాక తోడివిద్యార్థులనుండి గాఢ జ్ఞానాన్ని సమకూర్చుకుంటారనే సంగతి చాలామంది గుర్తించియుండరు.

పాఠశాలకు పంపించకుండా ఇంటిదగ్గర తల్లిదండ్రులే విద్యాబుద్ధులు గరపి పరీక్షలో కృతార్థుడయ్యేటట్లు చేశారనుకుందాం ఒక విద్యార్థిని. అతని జ్ఞానార్జనలో పాతికశాతం "లోటు" ఉంటుందని ఈ శ్లోకం అంగీకరిస్తోంది. సరే పాఠశాలలకు వెళ్ళి స్వయంకృషికూడ చేసి గురువుల దగ్గర సహపాఠకులవద్ద – విద్యాభ్యాసం కొనసాగించిన విద్యార్థికికూడ ఈ శ్లోకం ప్రకారం నూటికి నూరు పాళ్ళు "విద్య" అబ్బదు, 75శాతం మాత్రమే లభిస్తుంది! మిగతా 25 శాతం కాలక్రమేణ సిద్ధించవలసిందే!

ఈ శ్లోక కర్త – ఉద్దేశ్యపూర్వకంగా – విద్యారంగంలో – "గురువు" నిర్వహించ వలసిన పాత్ర ప్రాముఖ్యాన్ని తగ్గించినట్లు కన్పించుటలేదు.

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" – అనే మన దేశంలో విద్యా ప్రబోధంలో ఎవరెవరు ఎంతెంత ప్రాధాన్యం వహిస్తారో నిష్పక్షపాతంగా బేరీజు వేశాడు ఈ శ్లోక కర్త అని చెప్పవచ్చు.

ఈ శ్లోకం ప్రకారం విద్యార్థికి ఉండవలసినవి 1) గురుభక్తి 2) స్వయంకృషి 3) సత్సంగము 4) లోకజ్ఞానం. ఇందులో ఏది కొరవడినా పరిపూర్ణజ్ఞానం లభించదు. గురు సన్నిధి- స్వయం కృషి సహపాఠులసత్సంగం పాఠశాలలో లభించవచ్చుగాని లోకజ్ఞానం అక్కడ లభించదు. అంతేగాక చాలా విసురుగా శ్లోకకర్త- "శేషం కాల క్రమేణ చ" అనటంలో జిజ్ఞాసువులకు విద్యార్థిదశ యావజ్జీవితం పొడిగించినట్లే!

"శేషం" అంటే మిగిలినవి అని అర్థం చెప్పడం సులువేగాని దానికి అంతరార్థం అన్వేషించడం చాలాకష్టం, ఈ శేషంలో చేర్చవలసింది "అనుభవం"

కనులు-చెవులు-లేని గ్రాంథిక జ్ఞానమ్ము।
నడువలేక క్రిందపడును తరచు
ఆదరింపదగును అనుభవజ్ఞానమ్ము
చదువు అనుభవమ్ము సాటిగాదు॥

ఇక అనుభవం అనే మాటలో ఎన్నో యిమిడి ఉన్నాయి. అంతే గాక ఆ అనుభవం ఒక్కసారి రాదు- వస్తూనే ఉంటుంది. ప్రాచీనులు ఈ జ్ఞాపకాలు సంపాదించుకునేందుకు పంచమార్గాలు చెప్పారు.

దేశాటనం పండితమిత్రతా చ
ప్రౌఢాంగనా రాజసభాప్రవేశః
అనేక శాస్త్రాణి విలోకితాని
చాతుర్యమూలాని భవంతి పంచ

ఇవి అయిదు అని ఒకడు చెప్పితే- అయిదువేలు కూడ దాట వచ్చు అందరూ చెప్పినవి కలిపితే! అనుభవాలు అసంఖ్యాకాలు. లోక జ్ఞానం కోసం- విద్యాజిజ్ఞాసువులకు ప్రౌఢాంగనా పరిచయం కూడ అవస రమేనని ఆనాడు అన్నారంటే- తాత్వికదృష్టితో జ్ఞానార్జన చేసేవారికి విధి నిషేధాలు- తాత్కాలిక నీతి నియమావళులు ప్రతిబంధకాలు కావు. జిజ్ఞాసు వులు అచేతనములనుండి-గాలి నుండి ధూళినుండి- ప్రవహించే సెలయేళ్ళ నుండి రాళ్ళనుండి రప్పలనుండి పాఠాలు నేర్చుకోవచ్చు నన్నాడు షేక్స్పి యరు మహాకవి. విద్యార్థికి విశ్వప్రపంచము గురుపీఠమే.

అయితే విద్వాంసులైనా గురువులేకుండా ఏ విద్యా అలవడదు. విద్యాగురువుకే ప్రథమస్థానం ఇవ్వాలి.

ఉదయంతు శత మాదిత్యాః
ఉదయంతు శతమిందవః
న వినా విదుషాం వాక్యైః
నశ్యత్యాభ్యంతరం తమః ॥

వంద సూర్యులు ఉదయించు గాక. వంద చంద్రులు ఉదయించు గాక! విద్వాంసుని వాక్యాలవల్ల తప్ప- లోపలి చీకట్లు చెదరిపోవు! గురు ప్రబోధ ప్రాముఖ్యం- గురు ముఖమునుండి నేర్చుకునే చదువుకు ఉన్న విలువ పై శ్లోకం గుర్తించింది.

ఇక- సింహావలోకన ప్రాయంగా పునరుద్ఘాటించదగిన మాట.

కొంత నేర్చుకొనును గురుసన్నిధిని విద్య,
కొంత నేర్పవచ్చు సొంతతెలివి,
సంక్రమించు కొంత సహపాఠకులవల్ల
జీవయాత్ర నేర్పు శేష విద్య.

---

"ఒక్క కుఱ్ఱవాడు ఒనరించు నేరమ్ము
తల్లి తండ్రి యొక్క తప్పుతోడ
వందమంది పెద్దవారి వైఫల్యమ్ము
చదువులోని లోటు చాటగలదు"

# మనస్సు

మన ఏవ మనుష్యాణాం
కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం
ముక్త్యై నిర్విషయం స్మృతమ్ ॥

మనుష్యులకు- బంధమోక్షములకు మనస్సే కారణం. మనస్సు విషయాసక్తం కావటమే బంధం! విషయవిరక్తం కావటమే ముక్తి:

అని పై శ్లోక తాత్పర్యం. ఈ శ్లోకం మిక్కిలి పురాతనమైన కాలానికి చెందింది. ఇది కృష్ణయజుర్వేదంలో అమృత బిందువు లోనిది.

సమస్త సృష్టికి మకుటాయమానమైనది మానవుని మనస్సే సృష్టికి ప్రతిసృష్టిచేసి పంచభూతాలపై మానవునకు ఆధిపత్యం ప్రసాదించగలిగింది మానవ మనస్సే

పసిడి కంటె-వజ్రవైడూర్యముల కంటె
విలువయైన దేది విశ్వమందు?
అసలు సృష్టి కేది అపరసృష్టిని జేయు
అబురహస్యశక్తి నధిగమించి?
మనుజునేది చంద్రమండలమ్మును జేర్చె
మనిషి మనసు!! గొప్ప మహిమ గలది!!

అయితే — ఇంతవరకు శాస్త్రవేత్తలు — పరిశోధకులు రోదసీనౌకలు నడుప

గలుగుతున్నారు. జలాంతర్గాములతో సముద్రాలలోతు త్రవ్వుచున్నారు. కాని మానవ మనస్సు లోతుపాతులను మాత్రం కనిపెట్టలేకుండా ఉన్నారు. ఆధునిక తత్త్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తి మనిషిలో ప్రబుద్ధమనస్సు లవలేశమాత్రమేననీ– సుప్తము, అబోధపూర్వము అయిన భాగమే మిక్కిలి యెక్కువ అని నొక్కి వక్కాణించుచున్నారు. మన తత్త్వజ్ఞులు గూడ అదే అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు.

న మోక్షో నభసః పృష్ఠే
న పాతాళే న భూతలే।
సర్వాశాసంక్షయే చేతః
క్షయో మోక్ష ఇతీర్యతే।

మోక్షం ఏదో ఆకాశం వెనుకగాని భూమిమీదగాని ఉండే స్థానవిశేషం కాదు. ఆశలతో కూడుకొనియున్న చిత్తవృత్తి నివృత్తి కావడమే మోక్షం అని అథర్వవేద (అన్నపూర్ణ 70) ప్రోక్తం.

మిల్టన్ మహాకవి ఆంగ్లంలో వ్రాసిన కవిత ఈ అభిప్రాయంతో సంవదించుచున్నది.

The mind is its own place and in itself
Can make a Heaven of Hell or a Hell of Heaven.

పై ఆంగ్లకవితకు స్వేచ్ఛానువాదం

నరకమగును దివము – నాకమౌ నరకమ్ము
మనసు సృష్టి నెల్ల మార్చగలదు।
స్వర్గ మనిన ఏమి? స్వస్థచిత్తము గాక
మనసు సాటి యేది మనసు గాక?

పతంజలి మహర్షి వ్రాసిన యోగశాస్త్రంలోని ప్రథమ సూత్రం -

"యోగః చిత్తవృత్తి నిరోధః"

చిత్తవృత్తులను నిరోధించుటయే యోగము అని ఈ సూత్రమునకు తాత్పర్యం. ఈ సూత్ర వివరణము విషయాంతరం. ఇందులో ఇచట గ్రహించవలసింది మనస్సుకు గల ప్రాధాన్యం.

Stone walls do not a prison make
Nor iron bars a cage;
Minds that are innocent
May take it to be a hermitage.

అని ఆంగ్లంలో ఉంది. దానికి అనువాద ప్రాయమైన తెలుగు పద్యం-

ఇనుప కటకటాలు! ఎత్తైన గోడలు
కఠిన శృంఖలాలు! ఖైదు గాదు;
నిర్మలాత్ముడైన నిర్దోషి దృష్టిలో
అది - పవిత్రమైన ఆశ్రమంబె;

ఈ విషయం మన కాలంలో గాంధీమహాత్ముని జీవితం ఋజువు చేసింది సంస్కృత వాఙ్మయంలో నుండి హృదయంగమమైన ఒక ఉదాహరణ స్వీకరించవచ్చు "పురుషుడొకడు భార్యను కౌగిలించు కుంటాడు పుత్రికను అలింగనం చేసుకుంటాడు. క్రియ ఒకటే కాని రెండింటికి ఎంతో అంతర మున్నదిగదా. ఇందు చూడవలసినదీ ప్రధానమైనదీ మనస్సే.

పుణ్యపాపవిషయంలో గూడ మనస్సే ప్రధానమైనదని తాత్త్వికులు విశదీకరించుచున్నారు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు - మనస్సు నిస్సందేహంగా చంచల మైనదనీ – దుర్నిగ్రహమైనదనీ చెప్పినాడు. అయితే వైరాగ్య సాధనవల్ల-అభ్యాసంవల్ల మనోనిగ్రహం సాధ్యమే అన్నాడు.

అసంశయం మహాబాహో
మనో దుర్నిగ్రహం చలం।
అభ్యాసేన తు కౌంతేయ
వైరాగ్యేణ చ గృహ్యతే ॥

తన మనస్సును నిగ్రహించుకోలేనివాడు ఈ ప్రపంచాన్ని జయించిన "విశ్వవిజేత" గా అగ్గింపబడినా ఏమిలాభం: అలెగ్జాండరు చక్రవర్తి చరిత్ర ఈ విషయాన్ని ఋజువు చేసింది. అంతవరకూ ఎందుకు? నిత్యం మనకన్నులయెదుట మనోనిగ్రహం లేని ప్రయోజకుల జీవితాలు చూస్తున్నాము. మనోనిగ్రహం లేనప్పుడు ఎంతటి ప్రతిభ- ఎంతటి సామర్థ్యం ఉన్నా బూడిదలో పోసిన పన్నీరు. మనోనిగ్రహం ఉన్నవారికి ఇంకేమీ లేకపోయినా వారు నిత్యసంతుష్టులే. జీవన్ముక్తులే; **

---

పొరపు ధర్మముల్ విమల సత్యము పాపముచేత బొంకుచేత
పొరము పొందలేక చెడ బారిన నైనను యవస్థదప్పు లె
వ్వారలు పేక్ష సేయురది వారలచేటగుగాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును వైవముండెడిన్

– మహాభారతము-ఉద్యోగపర్వం శ్రీకృష్ణుడు

# ఈర్ష్య

య యీర్ష్యః పరవిత్తేషు
రూపే వీర్యే కులాన్వయే
సుఖసౌభాగ్యసత్కారే
తస్య వ్యాధిరనంతకః ॥

పై శ్లోకం మహాభారతం ఉద్యోగపర్వంలో విదురనీతి ఘట్టంలోనిది "ఇతరుల ధనమునకు, పరాక్రమమునకు– అభిజాత్యమునకు– సుఖసౌభాగ్య సత్కా-రాలకు అసూయపడేవారు నయముగాని దీర్ఘరోగంతో కుమిలిపోవలసిందే!" అని ఈ శ్లోక తాత్పర్యం.

ఈ మాటలు విదురుడు– ధృతరాష్ట్రునితో అన్నవి. సందర్భం ఏమిటంటే సంజయుడు పాండవులదగ్గరకు రాయబారియైవెళ్లి ఉపప్లావ్యం నుండి తిరిగివచ్చి - ధృతరాష్ట్రునితో చెప్పాడు ధర్మరాజు అన్న మాటలు. ధృతరాష్ట్రుడు సంజయుని రాయబారిగా పంపించాడు పాండవులదగ్గరకు మంచిమాటలు చెప్పిరమ్మని. సంజయుని రాయబారం కేవలం– "శుష్కప్రియాలు–శూన్యహస్తాలు." తమకు రాజ్యభాగం ఇవ్వకపోతే పాండవులు యుద్ధమునకు సంసిద్ధులు అని తేలిపోయింది, ఆనాటి రాత్రి ధృతరాష్ట్రునకు నిదురపట్టలేదు. అతడు విదురుని పిలిచి తన మనస్తాపం వివరించాడు. విదురుడు ధృతరాష్ట్రుని మనః స్థితిని గ్రహించి

"బలవంతుడు పై నెత్తిన
బలహీనుడు, ధనము గోలుపడినయతడు మ్రు

చ్చిం వేచువాడు, కామా
కులచిత్తుడు, నిద్రలేక కుందుదు రధిపా."

అని చెప్పాడు. బలవంతుడైనవాడు దండెత్తివచ్చినప్పుడు బలహీనుడు, ధనము పోగొట్టుకున్నవాడు, దొంగతనం చేయుటకు ఉద్యుక్తుడైనవాడు, కాముకుడు నిద్రలేక బాధపడతారు- అని పై పద్యభావం. పాండవులు బలవంతులని ధృతరాష్ట్రునకు భయం. ఈ విషయాన్ని అర్థవాదరూపంగా విదురుడు, అతనికి సూచించాడు.

ఇక అసలు విషయం ఏమిటంటే– మొదటినుండి కురుపాండవులకు వైరకారణంగూర్చి విదురుడు చెప్పక తప్పదు. ధృతరాష్ట్రుడు తమ్ముని తనయులను, తన సుతులను సమానప్రేమతో చూచి పెంచాలని అనుకున్నవాడే. అయితే– భీముడు అందరిలో బలవంతుడు. చిన్నప్పుడు ఆటపాటలలో అతడు కౌరవ రాజకుమారులను పదిమందిని తన భుజాలపై ఎక్కించుకొని గంగలోకి దూకేవాడు. వాళ్ళు నీటిలో మునగలేక తేలలేక ఎంతో ఇబ్బందిపడి చావుబ్రతుకుగాక గట్టు చేరుకునేవారు; కౌరవులు– ఏ చెట్టు మీదికో ఎక్కి– ఏ కోతికొమ్మచ్చులో ఆడుకునే టప్పుడు భీముడు ఆ చెట్టును ఊపేసరికి– వాళ్ళు రేగివండ్లవలె క్రిందికి రాలేవారు. ఈ విధంగా కౌరవులకు తొలుత భీమునిపై పిమ్మట మిగిలిన పాండవులపై అసూయ రేకెత్తింది.

పాండవజ్యేష్ఠుడు ధర్మరాజు నిండుకుండ, న్యాయపరుడు అనీ సౌశీల్యవంతుడనీ సౌజన్యమూర్తి అనీ పేరుతెచ్చుకున్నాడు. అర్జునుడు విలువిద్యలో ఆరితేరిన దిట్ట అయ్యాడు. నకుల సహదేవులు అన్నకు అనువైనవారు. అందగాండ్రు.

కౌరవులలోగూడ సౌభ్రాత్రం – అన్యోన్య సహకారం ఉంది.

దుర్యోధనుని నాయకత్వంలో వారు పాండవులకు అపకారం చేయాలని చూచారు. లాక్షాగృహదహనం, మాయాజూదంలో పాండవుల పరాజయం తదనంతరం వారి అరణ్యవాసం, అజ్ఞాతవాసం - కథ చాలా జరిగింది. దీని కంతటికి దుర్యోధనుని అసూయయే కారణం అని విదురుడు ధృతరాష్ట్రునకు చెప్పదలచాడు.

అసూయవలన దాపురించే అనర్థం-ప్రమాదంగూర్చి విదురుడు సుకుమార సుందరసాహితీఫణి-లో ధృతరాష్ట్రునకు అభివర్ణించి చెప్పాడు. తెలుగులో తిక్కన మహాకవి పై సంస్కృత శ్లోకానికి చేసిన అనువాదం గాఢ మృదుమధుర మనోహరంగా ఉంది.

"పరుల ధనమునకు - విద్యా
పరిణతికిం దేజమునకు బలమునకు మనం
బెరియగ అసహ్యపడు-అ
న్నరుడు తెవులు లేని వేదనం బడు అధిపా."

అసూయ రోగములేని దీర్ఘవ్యాధి!

హత్య-మహాపాతకం అయితే తేజోవధకూడ పాపమే. శారీరక వధ ఎంతటి ఘోరపాపమో ఇతరుల తేజస్సును సంహరించటం-వారి ప్రవర్తనపై లేనిపోని నీలాపనిందలు వేయటం ఇది అంతా ఈర్ష్యాళువులు చేసే పనే.

అసూయ కట్టెను అంటుకున్న అగ్గివంటిది. అసూయాద్వేషం ఇతరులను దగ్ధం చేయగలదో లేదో గాని తానున్న చోటును మాత్రం కాల్చివేయటం తథ్యం. అందుచేత అసూయ - ఆత్మహత్యాసదృశం అని చాటవచ్చు.

*

# సువర్ణసూత్రం

శ్రుతి ర్భిన్నా స్మృతి ర్భిన్నా
సర్వవాదేషు మధ్యగం
సువర్ణసూత్ర మిత్యుక్తం
వరిష్ఠం ధర్మసంగ్రహే

వేదాలలో భిన్నధర్మాలు ఉన్నాయి. అట్లాగే పురాణాలలో భిన్న ధర్మాలు కన్పిస్తాయి. అయితే ఇక లోకానికి ఉపాదేయం ఏమిటి? అనే సందేహం రేకెత్తడం సహజం. భిన్నవాదాలలో సమన్వయాత్మకమై మధ్యన ఉండే సారం గ్రహింపదగినది. దానికి సువర్ణ సూత్రం అని పేరు. ధర్మ సంగ్రహమందు "సువర్ణసూత్రము" వరిష్ఠం అని పై శ్లోక తాత్పర్యం.

ప్రాచీనగ్రీసు దేశంలో గూడ సుప్రసిద్ధులైన సద్గురులు ఉండేవారు. అందులో ఒక మహర్షి-
"The Golden mean is the Best" అనే సందేశాన్ని లోకానికి అందించాడు. సువర్ణసూత్రం అంటే విప్రతిపన్నములైన రెండు తీవ్రవాదాలమధ్య- సమన్వయ సంధానకమైన సంధిమార్గం.

లోకంలో తీవ్రవాదులు కొందరు. సమన్వయసంధి సంధాతలు మరికొందరు. వీర శైవులకు వీరవైష్ణవులకు మధ్య పొత్తు కుదర్చటానికై తెలుగు చరిత్రలో తిక్కనమహాకవి హరిహరనాథోపాసన ప్రతిపాదించిన సంగతి అందరకూ తెలుసు. తిక్కన మూర్తీభవించిన- సువర్ణసూత్రం.

తిక్కన దృష్టిలో వేదవ్యాసమహర్షి గూడ అటువంటివాడే. మహాభారతం_

"వేదములకు, అఖిలస్మృతి
వాదములకు బహుపురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థ కామమోక్షస్థితికిన్"

అని తిక్కన ఎలుగెత్తి చాటాడు.

నిజానికి వేదాలకు పురాణాలకు పోరాటం ఉంటుందా ? అవి అన్నీ ధర్మ ప్రతిపాదకములే గదా అనే ప్రశ్నకు సమాధానం ఉంది. స్థూల దృష్టికి వేదాలలో పురాణాలలో అనేక విప్రతిపత్తులు గోచరించవచ్చు. కాని సూక్ష్మదృష్టితో ఆలోచిస్తే అంతర్లీనమైన సమన్వయం గోచరిస్తుంది. దీనికి తిక్కన మహాకవి "ధర్మాద్వైతస్థితి'' అని వ్యపదేశం కల్పించాడు. వ్యాసుడు, వేదాలకు-పురాణాలకు ధర్మాద్వైత సమన్వయం సాధించుటకై మహాభారతరచన చేసినట్లు తిక్కన మహాకవి చెప్పాడు.

"తెలుగుదేశం అటు ఉత్తరభారతమునకు ఇటు దక్షిణభారతమునకు అటు కాశ్మీరమునకు ఇటు కన్యాకుమారికి మధ్యస్థలం. అందుచేత తెలుగువారికి ఈ సమన్వయసంధానచాతురి సహజ సిద్ధం." అని కవయిత్రి సరోజినీదేవి అన్నది.

సంస్కృతకవులలో కాళిదాసుగూడ వేదవ్యాసమహర్షి వలెనే అనేక విషయాలలో ధర్మాద్వైత వేదాంతిగ సమన్వయసంధాతగ కన్పిస్తాడు.

కవులలో ప్రాయికముగ కొందరు భాషపై మొగ్గుచూపిస్తారు

కొందరు భావంపై నిష్ఠ చూపిస్తారు. కాళిదాసమహాకవి రఘువంశంలో వ్రాసిన ప్రార్థనాశ్లోకం ఉదాహరింపదగినది.

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

ఇది పార్వతీపరమేశ్వర ప్రార్థనగా జగత్ప్రసిద్ధం. అయితే ఇందులో పార్వతీ-పరమేశ్వరుల అఖిలోక దాంపత్యం, వాక్కు- అర్థము భాషా భావముల అవినాభావసంబంధంతో పోల్చబడింది. అంటే కాళిదాస మహాకవి కవితాప్రపంచంలో పేర్కొన దగిన సువర్ణసూత్రధారి.

'అతి సర్వత్ర వర్జయేత్-అనే సుభాషితంగూడ సువర్ణసూత్ర పరిభాషలో చేర్చవచ్చు.

'సత్యం వద'- అనే వేద వాక్యం వుంది.

ఉదాహరణకు ఒక అరణ్యం అందులో ఒకఋషివాటిక; ఒక గృహస్థు ఏదో కొంత ధనంతో దేశాంతరం వెళ్ళుతున్నాడు. దొంగలు అతన్ని దోచుకుని సంహరించేటుకు వెంబడించారు అతడు ఆ ఆశ్రమంలో దాగాడు. దొంగలు ఆ ఆశ్రమంలోని ఋషీశ్వరుని ఆ గృహస్థు ఉనికి గూర్చి ప్రశ్నించారు. ఆ ముని సత్యంచెప్పితే- "అహింసా పరమో ధర్మః అనే వేదసూక్తికి భంజకం. లేదా అసత్యదోషం సంప్రాప్తిస్తుంది. అందు చేత మహాభారతంలో ధర్మసూక్ష్మవివరణ ఉంది" భూతహితంబుగా పలుకు బొంకును సత్య ఫలంబు నిచ్చు"-అని మహాభారత ప్రవచనం.

శీర్షిక శ్లోకానికి తెలుగులో స్వేచ్ఛానువాదం ఇలా చేయవచ్చు.

భిన్నవాద తర్క-బీభత్సములు సుమ్ము
శ్రుతులు-స్మృతులు ధర్మసూక్ష్మగతులు!
సర్వవాదమధ్య సౌవర్ణసూత్రమ్ము
సామరస్య ధర్మ సంగ్రహమ్ము.

••

# వైరాగ్యం

పురాణాంతే శ్మశానాంతే
శృంగారాంతే చ యా మతిః
సా మతిః సర్వదా స్యాచ్చేత్
కో న ముచ్యేత బంధనాత్॥

పురాణ శ్రవణానంతరం, వల్లకాటికి వెళ్ళినప్పుడూ శృంగార విలాసం అంతమొందినప్పుడు తాత్కాలికంగా కలిగే వైరాగ్యబుద్ధి-తదనంతరం గూడ సుస్థిరంగా ఉంటే-ఎవడు సంసారబంధం నుండి విముక్తి పొందకుండా ఉంటాడు? ఇది పై శ్లోక తాత్పర్యం.

ఆహార నిద్రాభయాదులు సర్వమానవులకు ఏవిధంగా స్వభావ సిద్ధాలో-అట్లాగే ఆలోచించగల బుద్ధి కూడా అందరికి సహజసిద్ధమైనదే. ఇదే ప్రాణికోటిలో మానవుని విశిష్టత అంటారు పెద్దలు. ఈ "మతి"-"మేధ" మానవుని సమస్తసృష్టికి మకుటాయమానని చేసింది. ఈ ఆలోచన పరాకాష్ఠ చెందింది వేదాంత విద్యగా.

అయితే-మానవు లందరు వేదాంతులు కాకపోవచ్చు. మేధావులు కాకపోవచ్చు. కాని ఆలోచన సుంతయైన లేని మానవుడు ఉండడు.

జాయమానాంశ్చ సంప్రేక్ష్య
మ్రియమానాం స్తథైవ చ
న సంవేగోస్తి చేత్ పుంసః
కాష్ఠలోష్ఠ సమం హి సః

ఈ ప్రపంచంలో – జనులు పుట్టడం చూస్తూ – చచ్చిపోవడం గమనిస్తూ ఏ మానవుడైనా ఎట్టి మానసిక సంవేదనం పొందకపోతే- ఇక అట్టివాడు కట్టెతో మట్టిముద్దతో సమానం-అని పై శ్లోకం చెప్పుతున్నది.

అందుచేత - ప్రతిమానవుని మెదడులో - ఇంతో ఎంతో-కొంత వేదాంతం ఎప్పుడో ఒకప్పుడు చోటుచేసుకుంటుంది. వేదాంత పరిణామంలో వైరాగ్యం ఒక ముఖ్యాంగం. వైరాగ్యం అంటే భోగవాంఛలను విసర్జించే విరక్తి.

వైరాగ్యం ఏటికి ఎదురీత. ఎంతో వేదాంతం అనుభవసిద్ధంగా జీర్ణించిన వారికిగానీ సులువుగా వైరాగ్యం సంక్రమించదు. అందుచేత సాధారణంగా వయస్సుమళ్ళినవారిలో వైరాగ్యధోరణి ఎక్కువగా కన్పిస్తుంది. అనుభవంచేత-జ్ఞానం వల్ల వైరాగ్యం ఏ వయస్సులో ఉన్నవారికైనా కలుగవచ్చు. అయితే వైరాగ్యం సుస్థిరంగా నిలవటం కష్టం.

తాత్కాలిక వైరాగ్యాన్ని పెద్దలు మూడు విధాలుగా వింగడించారు.

1) పురాణ వైరాగ్యం 2) శ్మశానవైరాగ్యం

3) ప్రసూతి వైరాగ్యం

పురాణప్రవచనాలు విన్నప్పుడు - ఆదర్శప్రేరితులైన సత్యహరిశ్చంద్రుని కథ, పరోపకారార్థం తన శరీరం కోసియిచ్చిన శిబిచక్రవర్తిగాథ, ఆడిన మాట తప్పకుండా వామనునికి దానం చేసిన బలిచక్రవర్తి చరిత్ర విన్నప్పుడు-అందరికీ ఏదో అతిలోకమైన ఆదర్శపరాయణత్వం లేశమాత్రంగా అయినా అలముకొంటుంది. దగ్గరబంధువులో ఆప్తులో మిత్రులో మరణించినప్పుడు శ్మశానంలో అంత్యక్రియలు దర్శించినప్పుడు- "మనము గూడా ఇంతేకదా!" అనే అనుభూతి ఆవహిస్తుంది. గర్భవతి ప్రసవవేదన

పడేటప్పుడు - వైరాగ్యం ఆమెకు కలుగుతుంది. అయితే పురాణ ప్రవచనం విన్న తరువాత - ఆప్తుల అంత్యక్రియలు ముగిసిన పిమ్మట. బిడ్డను ఎత్తుకొన్న పిమ్మట "ఇంటికి" తిరిగి రాగానే ఈ వైరాగ్యం అంతర్థానమై పోతుంది!!

మానవ జీవితయాత్ర మళ్ళీ మామూలు మార్గంలోనే కొనసాగుతుంది. అట్లాగే, శృంగారలాలసత్వంలో ఉన్న ఉత్సాహాతిరేకం - తదనంతరం ఉండదు. ఒక్కొక్కప్పుడు నాయికానాయకులు విడిపోవచ్చు. విడివడి వేరొకరి పొందు కోరవచ్చునుగూడ. అప్పుడు తొలివారలకు ఆశాభంగమే గతి. వైరాగ్యమే శరణ్యం.

'లోకవృత్తాంతదర్శనం నాటకం' - అన్నారు ఆలంకారికులు. ఇట్టి సన్నివేశాలను కావ్యరచనలలో రంగస్థలంపై ప్రదర్శించి సహృదయులకు "భావితాంతఃకరణప్రవృత్తి"ని కల్పించవలెనని సాహితీస్రష్టల కృషి. హరిశ్చంద్రనాటకంలో

"మాయామేయ జగంబె నిత్యమని
సంభావించి మోహంబునన్
నాయిల్లా లని నాదు పుత్రుడని
జన్మంబందు నందాక ఎం
తే యారాటము చెందు ఈ శరీర
మిపుడే యీ కట్టెలంగాలుచో
ఆ యిల్లాలును రాదు పుత్రుడును
తోడై రాడు రక్షింపగన్."

అని, నటుడు అభినయించేటప్పుడు-సామాజికులకు తాత్కాలికంగా అయినా

శ్మశానవైరాగ్యం దాపురిస్తుంది.

అయితే – వైరాగ్యానుభూతి–మెరపుతీగల వంటిదని గృహస్థులకు అనుభవసిద్ధం. యోగీంద్రులకు వైరాగ్యానుభూతి స్థిర సౌదామనివలె వెల్లివిరిసి వారిని దివ్యులను చేస్తుంది. కొందరు ఋషీశ్వరులుగూడ తపోభంగం పొందిన కథలు తామరతంపరలు. దీనినిబట్టి స్థిరవైరాగ్య యోగం ఎంత కష్టసాధ్యమో తెలుస్తుంది. ప్రాయికంగా వైరాగ్యం అభినివేశం గాక అభినయవిశేషంగా భాసించే ప్రమాదం ఉంది. అట్టి వారిని గూర్చి వేమన–

"తలలు బోడులైన తలపులు బోడులా?
విశ్వదాభిరామ వినుర వేమ!"

అని అన్నాడు. ఈ పథంలో ఎన్ని మిట్టపల్లాలు ఉన్నా – వైరాగ్య సంపన్నుడే జీవన్ముక్తుడు కాగలడు.

*

---

పారమార్థిక మద్వైతం
ద్వైతం భజహా హేతవే।
తాదృశీ యది భక్తిః స్యాత్
సా తు ముక్తిశతాధికా॥

# కాకి-కోకిల

కాకః కృష్ణః పికః కృష్ణః
కో భేదః పికకాకయోః।
వసంతకాలే సంప్రాప్తే
కాకః కాకః - పికః పికః

కాకి నల్లగా ఉంటుంది.. కోకిల నల్లగా ఉంటుంది: స్థూలదృష్టికి రెంటికి తేడా తెలియటం కష్టం. కాని వసంత ఋతువు వచ్చినప్పుడు కాకి కాకిగా, కోకిల కోకిలగా తేలిపోతుంది. అంటే, ఆకారాన్నిబట్టి ఏది కాకో, ఏది కోకిలో నిజంగా నిర్ణయించటం కష్టమే. వసంత ఋతువులలో కోకిల గొంతెత్తి కమ్మని కంఠంతో వినసొంపుగా కూహూ కూహూ అని గానమాధుర్యాలు వెదజల్లుతుంది. కాకి—కర్ణకఠోరంగా కేవ్ కేవ్ మంటూ రొదచేస్తుంది.

మాటవరసకు సైనికులు ఉన్నారనుకోండి. దూరమునుండి చూస్తే అందరూ ఒకే దుస్తులతో ఒకే నడకతో ఒకే మాదిరిగా కనిపిస్తారుగదా! కాని యుద్ధసమయంలో వీరుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తాడు. అనగా—సంగ్రామకాలే సంప్రాప్తేవీరో వీరః భీరు ర్భీరుః—అని ఆ శ్లోకానికి సందర్భానుసారముగా అర్థము చెప్పవచ్చు. సంగ్రామము సంప్రాప్తించినపుడు వీరు డెవరో భీరు డెవరో తేలిపోతుంది.

అట్లాగే - పాఠశాలలలో — ఏ తరగతిలో అయినా ఎందరో బాల బాలికలు చదువుకుంటూ ఉంటారు గదా. వయస్సులో రూపురేఖలలో

చూపరులకు అందరూ ఒకే విధంగా కనిపిస్తారు. ఈ రోజులలో స్కూలు యూనిఫారాలలో ఒకే రంగు ఒకే రకం దుస్తులు ధరించటం చేత అందులో ఎవరు తెలివిగలవాళ్ళో ఎవరు బాగా చదువుతారో ఎవరు ఏ విధంగా ప్రవర్తిస్తారో తెలియటం కష్టం. పరీక్షలు వచ్చినప్పుడు – మాత్రం ఎవరు కాకులో తేలిపోతుంది. 'పరీక్షకాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః' అన్నమాట.

ఈ పరీక్ష–విద్యార్థులకు పెట్టే "పరీక్ష"లకు మాత్రమే పరిమితం కాదు. ఎవరైనా ఎన్నోసార్లు జీవిత పరీక్షలలో కృతార్థులు కావలసి యుంటుంది. ఆ తరుణాలలో వారి వారి సామర్థ్యాలు బయటపడి పోతాయి – ఈ శ్లోకంలో అర్థవాదరూపంతో ఉన్న అంతర్యం గ్రహించి నప్పుడే ఇందులోని స్వారస్యం స్వయం వ్యక్తమవుతుంది.

ఈశ్లోకంలో కాకులు అంటే కాకులని అర్థం చెప్పగూడదు. అట్లాగే వసంతం అంటే వసంతఋతువు మాత్రమే అని అనుకోగూడదు. "కోకిల"– సామర్థ్యం వసంతఋతువులో బయలుపడుతుంది. వీరుని శౌర్యం యుద్ధసమయంలో అభివ్యక్తమౌతుంది. విద్యార్థి తెలివితేటలు పరీక్షలలో తెలుస్తాయి. అట్లాగే మానవజీవితంలో ఎవరికైనా సరే సముచితసమయంలోనే సామర్థ్యం అభివ్యక్తమౌతుంది. కోకిల వసంతఋతువులో శోభిస్తుంది. ఈ అర్థవాదరూపంలో ఉన్న ఈ శ్లోకాన్ని వ్యష్టిజీవితాలలోనే గాక, సమష్టి జాతీయ చరిత్రకుగూడ అన్వయించవచ్చు. అధునాతన భారతదేశ చరిత్రలో – గాంధీయుగంలో– స్వాతంత్ర్య శంఖారావము వినిపించినప్పుడు ఎందరెందరో యువతీ యువకులు ముందుకు దూకి మహాయోధులుగా త్యాగయోధులుగా పేరుకెక్కారు. ఆనాడు హిమాలయాల నీడ కన్యాకుమారిపై పడింది.

భారతదేశ చరిత్రలో అది ఒక వసంతకాలం. అప్పుడు-కోటానకోట్ల ప్రజలలో కాకః కాకః పికః పికః- కొందరు కాకులుగా మరికొందరు కోకిలలుగా తేలిపోయారు.

అయితే-కాలచక్రంలో ఋతువులు క్రమానుక్రమణికలో నిర్ణీత గణితబద్ధంగా పంచాంగం ప్రకారం అనువర్తితమౌతూ ఉంటాయి. కానీ-వ్యక్తుల జీవితాలలోగానీ-దేశచరిత్రలలో గాని ఋతుసంచారాన్ని నిర్ణీతగణితబద్ధం చేయటం సాధ్యముగాదు. వ్యక్తుల జీవితచక్రాలలో ఋతువుల సంఖ్య ఆరుగాక పది పన్రెండు ఉండవచ్చు. ఇక వ్యక్తుల జీవితాలలో ఏ ఏ ఋతువులు ఎప్పుడెప్పుడు సంప్రాప్తిస్తాయో చెప్పలేము. పాపంఒకని జీవితంలో అసలు వసంతఋతువు ఒకసారి కూడ రాక పోవచ్చు. ఆ జన్మం శిశిరఋతువుగానే యావజ్జీవితం ఆకులపాటుతోనే గడిపే అభాగ్యు లుండవచ్చు!!

ఇక - దేశదేశాల చరిత్రలలో ఋతువుల సంఖ్య-ఋతువుల పరివర్తనం పింతవుంతలు త్రొక్కవచ్చు. ఫ్రెంచి విప్లవం సంభవించి నపుడు దేశచరిత్రలో అర్ధవాదరూపంగా ఏ ఋతువు ప్రవర్తించినదని చెప్పాలి? దేశములో అరాచకత్వము దాపురించినపుడు విప్లవాలు వికటాట్టహాస విలయతాండవాలు చేసినప్పుడు గూడ ఈ శ్లోకాన్ని పాఠాంతరాలతో వల్లెవేసుకోవచ్చు.

కాకః కృష్ణః పికః కృష్ణః
కో భేదః పికకాకయోః ।
వినాశకాలే సంప్రాప్తే
కాకః పికః ! పికః కాకః!॥

వినాశకాలం సంప్రాప్తించినపుడు - కాకులు కోకిలలు గావచ్చు: కోకిలలు కాకులుగా పరిగణింపబడవచ్చు అది వేరే మాట! *

# సంధాత

అమంత్ర మక్షరం నాస్తి!
నాస్తిమూల మనౌషధం
అయోగ్యః పురుషో నాస్తి!
యోజక స్తత్ర దుర్లభః॥

మంత్రంగా ఉపకరించని అక్షరమే లేదు. మందుగా ఉపయోగపడని చెట్టువేరు లేదు. దేనికీ పనికిరాని మనిషి ఉండడు. అయితే- అంతర్యం తెలుసుకొని వీటన్నిటినీ వాడుకో గలిగినవాడు మాత్రం అరుదుగా కన్పిస్తాడు. ఇది ఈ శ్లోక తాత్పర్యం.

అన్ని అక్షరాలకు మంత్రశక్తి ఉన్నది. మానవుడు భాషను కనిపెట్టి తన భావాలను ఆభాషలో వెల్లడించటం అంటే అది యెంత గొప్ప శక్తి! ఆ భాషను వింగడించినప్పుడు ఏర్పడే అవ్యక్తప్రకృతులు అక్షరాలు. అక్షరాల కలయికే శబ్దాలు. ఈ జగద్వ్యాపారాన్ని కదలించేది అక్షరశక్తియే. చైతన్య శక్తిలేని అక్షరము లేదు. మన పూర్వీకులకు ఎన్నెన్నో మూఢవిశ్వాసాలు ఉన్నాయని ఆక్షేపిస్తూ ఉంటారు నేటి ఆంగ్ల మానసపుత్త్రిలు. "అమంత్ర మక్షరం నాస్తి" అని అనగలిగిన ప్రాచీనులకు ఎంతటి విశాలదృక్పథం ఉన్నదో మన ఊహలకు అందకపోవచ్చు.

ఇక—ఈ ప్రపంచంలో ఔషధానికి పనికిరాని చెట్టువేరు లేదట. నాస్తి పత్రమనౌషధం అనే పాఠాంతరంగూడ ఉంది. అంటే "ఔషధమ్ముగాని ఆకు లేదిలలోన" అని అనువదించవచ్చు. ఈ సందర్భంలో

తక్షశిలా విశ్వకళాపరిషత్తులో విద్యార్థిగా వైద్యవిద్య అభ్యసించిన జీవకుని కథ స్మరించదగినది. తక్షశిలలోని వైద్యవిద్యాచార్యుడు-విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థుల్ని పిలిచి-వైద్యానికి పనికి రాని మొక్కలు-ఆకులు-వ్రేళ్లు తీసికొని రమ్మన్నాడట. విద్యార్థులు - గంపలకొలది - కొందరు రాకుమారులు రథాలపై, మరికొందరు బండ్లనిండుగా ఆకులు అలములు తెచ్చారట. జీవకుడు ఒక్కడుమాత్రం ఉత్తచేతులు ఆడించుకొంటూ గురువు గారి దగ్గరకు వచ్చాడు. అందరూ అతన్ని ప్రశ్నించారు. ఉత్తచేతులతో ఎందుకు వచ్చినట్లని. అతని సమాధానం.ఔషధాలకు ఉపయోగించని ఆకుగాని మొక్కగాని వేరుగాని తనకు కనిపించలేదని. అంటే జీవకుని గాథవల్ల నేర్వదగిన పాఠం- "నాస్తిమూల మనౌషధం" అన్నమాట. ఆ జీవకుడే తరువాత బుద్ధభగవానునకు శిష్యుడై-బౌద్ధమతస్థు లందరకూ ఉచిత వైద్యం, చేసేవాడట. కొందరు జీవకుని వైద్యం కోసం బౌద్ధ మతం స్వీకరించటం మొదలుపెట్టితే-బుద్ధుడు-రోగులకు బౌద్ధమత దీక్ష ఇవ్వవద్దనే నియమం ఏర్పాటు చేయవలసి వచ్చింది. ఇప్పుడు గూడ-వైద్యంలో క్రొంగ్రొత్త పరిశోధనలు జరుగుతున్నాయి. వైద్యానికి పనికి రాని పదార్థమేది పృథివిలో మిగులదేమో-ఆ మాటకు వస్తే, ఉపయోగించుకునే శక్తి ఉండదుగాని అసలు పనికిరాని వస్తువంటూ ఈ సృష్టిలో ఏదీ ఉండదు-అని ఈ శ్లోక తాత్పర్యం, అని విశాలమైన అర్థం చెప్పవచ్చు.

ఇక "అయోగ్యః పురుషో నాస్తి" పనికిరాని మనిషి ఈ ప్రపంచములో లేడని వేరుగా చెప్పాలా ? "ఉరిశిక్ష" ఉండరాదని ప్రచారం చేసే వారి వాదంలో ప్రధానమైన అంశం ఏమిటంటే (**"Hanging is the worst use that a man Can be Put to"** అంటే) ఉరితీయటం మానవుణ్ణి ఉపయోగించుకొనే ప్రక్రియలలో అధమాధమం అని.

ఉపేక్షియకుండా ప్రతిమానవుని జగద్ధితంగా ఉపయోగించుకోవచ్చునని వారి వాదం.

శ్రీకృష్ణదేవరాయలు–మంత్రి తిమ్మరుసును గూర్చి లోకంలో ఒక కథ ప్రచారంలో ఉంది. రాయలవారు మంత్రిగారితో కలిసి మారు వేషంలో ఒక సత్రంలో ఒక రాత్రి విడిసి చేయవలసి వచ్చిందట. అక్కడ ప్రక్కగదిలో ఒక క్షయరోగి దగ్గుతూఉంటే ఒక ముక్కోపి–అతన్ని దగ్గవద్దని ఆదేశించాడట. పాపం అతడు దగ్గటం ఎట్లామానగలడు? ఆరోగి దగ్గాడు; ఆ ముక్కోపి అతన్ని కత్తితో పొడిచి చంపివేశాడు. రాయలవారు ఆగ్రహోదగ్రుడై ఆ ముక్కోపిని మరునాడు కొలువుకు పిలిపించి మరణశిక్ష వేయాలని చూస్తుండగా–మంత్రి తిమ్మరుసు అతనిని గజసాహిణిని చేశాడట. ఏనుగులకోసం దివాణంనుండి సరఫరా అయ్యే ఆహారములో చాలాభాగం మావటివాళ్ళు మిగుల్చుకొనేవారట–ఆముక్కోపి గజసాహిణి ఐనప్పటినుండి ఏనుగులు బలవటం మొదలుపెట్టాయి. అతనంటే అందరకూ హడలు – ఒకసారి అతన్ని రాయబారిగా శత్రురాజుల దగ్గరకు పంపించాడు మంత్రి తిమ్మరుసు. ఆ ముక్కోపి ఎదుర చెప్పిన శత్రురాజును సింహాసనంమీదే కలబడి కత్తితో పొడిచి చంపటం–తరువాత రాజోద్యోగులు రాయబారిని సంహరించటం జరిగినా–అచటి అరాచకత్వం ఆధారం చేసుకొని రాయలవారు సులువుగా ఆ రాజ్యాన్ని జయించగలిగారని కథ.

గ్రుడ్డివాని భుజాలపై కుంటివాడు ఎక్కితే ఉభయతారకం. ఉభయులు కలసి తమ్ము తాము ఉద్ధరించుకొని లోకానికి ఉపయోగపడవచ్చు. సంస్కృతంలో- "ముఖే ముఖే సరస్వతీ" అనే సూక్తి ఉంది. అంటే ప్రతిమనిషికి ఏదో ఒక విద్య ఉంటుంది అని

ఈ భాషిత తాత్పర్యం. ఎవరిలో ఏ ప్రజ్ఞ దాగుకొని ఉన్నదో-కనిపెట్టి వాడుకోగలిగినవాడే పరిపాలనాదక్షుడు. పరిపాలన ఒక లలితకళ.

ఎరువులు అరువుదొరకవచ్చు-మరనాగళ్ళు ఉండవచ్చు-పెట్టుబడికి ధనం ఉండవచ్చు. అయితే ఈ సదుపాయాలను అన్నిటినీ ఒకచోటకు సమకూర్చే సంధాత - యోజకుడు లేకపోతే ఒక బస్తాధాన్యం కూడా పండదు-అందుచేత ఈ శ్లోకాన్ని తెలుగులోకి తర్జుమా చేసుకుంటే

"ఔషధమ్ముగాని ఆకు లేదిలలోన!
మంత్రశక్తి లేని-మాట లేదు!
లేదు-పనికిరానివాడే పృథివిలోన
యోజకుండొకండు ఉండవలయు!"

అని చెప్పవచ్చు.

*

---

ద్వైతం మోహాయ బోధాత్ ప్రాక్
జాతే బోధే మనీషయా
భక్త్యార్థం కల్పితం ద్వైతం
అద్వైతాదపి సుందరం॥

# ధనము

"అర్థానా మార్జితం దుఃఖం
అర్జితానాం చ రక్షణే
ఆయే దుఃఖం వ్యయే దుఃఖం
ధిగర్థం దుఃఖభాజనమ్"

ధనసంగ్రహణ దుఃఖంతో కూడిన పని. ఆర్జించిన ధనాన్ని రక్షించుకోటం కూడా దుఃఖకృత్యమే. ఆదాయం దుఃఖం. ధనవ్యయం దుఃఖం. ఛీ! ఛీ! ధనం దుఃఖభాజనం.

ఇది వైరాగ్యం బోధించే వేదాంతులు చెప్పిన నీతిబోధ. అయితే వాస్తవ జగత్తులో ధనం లేకపోతే క్షణం గూడ బ్రతుకటం కష్టం. రామాయణంలో లక్ష్మణుడు అన్నగారు-త్యాగమూర్తి అయిన శ్రీరాముని తోనే చెప్పిన మాటలు ఈ సందర్భంలో ఉదాహరించదగినట్టివి.

ధన మార్జయ కాకుత్స్థ
ధన మూల మిదం జగత్!
అంతరం నాభిజానామి
నిర్ధనస్య మృతస్య చ !

"డబ్బు ప్రోగుచేయవయ్యా కాకుత్స్థవంశంలో పుట్టినవాడా; ఈ జగత్తుకు ధనమే మూలం. డబ్బులేనివానికీ శవానికీ ఏం తేడా ఉందో నాకు తెలియదు" అన్నాడు లక్ష్మణుడు.

డబ్బులేనివాడు – ధనస్వామ్య సమాజంలో నడపీనుగేగదా. ధనమే

వ్యావహారికమైన కర్మజగత్తుకు గురుత్వాకర్షణ నాభి.

సత్యం, విప్రతిపన్నాలైన యీ రెండు భిన్నధ్రువాల మధ్య ఉయ్యాల లూగుతుంది.

ధనం-ఈ లోకంలో కొనలేనిదేమిటి ? సాధించలేనిదేమిటి ? అని ఒక వేడి నిట్టూర్పు విడిచే వేదాంతులున్నారు. వాపోయే దరిద్రులు ఉన్నారు. ప్రాచీనకాలంలో-నాగరకత పెరుగని రోజులలో ధనానికి నేటి ప్రాబల్యం ఉండేదికాదు. పరాక్రమానికీ పాండిత్యానికీ, సంగీతానికి, సాహిత్యానికి-వివిధ విద్యలకు చతుఃషష్టి కళలకు సముచిత ప్రాధాన్యం-గౌరవప్రపత్తులు లభించేవి. ధనానికి సమాజ వ్యవస్థలో సార్వభౌమ పట్టాభిషేకం కట్టిపెట్టటం కేవలం కలియుగ లక్షణమే అనిపిస్తుంది !

ఒక పరిహాస కథ ఉంది. ఢిల్లీలో ఒక దొంగ ఏకాంతంగా దారివెంట నడచిపోయే ఆగంతకుణ్ణి ఆపి-కత్తి ఝళిపిస్తూ, "నీ దగ్గర ఉన్న డబ్బు ఇచ్చేస్తావా? లేకపోతే నీ తలకాయ నరికి పారవేయ మంటావా" అని బెదిరించాడట! ఆ ఆగంతకుడు "ఏమైనాసరే నీకు డబ్బు ఇచ్చేది లేదు. తలకాయ లేకుండా అయినాసరే ఢిల్లీలో బ్రదుక వచ్చునేమోగాని డబ్బు లేకుండా జీవించటం సాధ్యం కాదు" అని సమాధానం చెప్పాడట ! ఇది పరిహాస గాథ అయినా ఇందులో పరమార్థం లేకపోలేదు.

మానవజీవితాన్ని క్షీరసాగరంవలె మథించి మథించి, చక్కని చిక్కని సామెతల వంటి సుభాషిత శ్లోకాలు వ్రాసిన భర్తృహరి-ధనాన్ని గూర్చి చెప్పిన శ్లోకం.

"యస్యాస్తి విత్తం స నరః కులీనః
స పండితః సః శ్రుతవాన్ గుణజ్ఞః ।

న ఏవ వక్తా న చ దర్శనీయః"
సర్వే గుణాః కాంచన మాశ్రయంతి!!"

పై శ్లోకానికి - శ్రీ ఏనుగు లక్ష్మణకవి హృదయంగమమైన అనువాదం చేశాడు.

"ఏ నరునకు విత్తముగల
దా నరుడు కులీను దధికు దార్యు ధతండే
ధీనిధి ! ధన్యుడు ! నేర్పరి !
నానా గుణ గణము కాంచనంబున నిలుచున్!"

అయితే - పై శ్లోకాలు అన్నీ లక్ష్మణుడి వాదాన్ని బలపరుస్తున్నాయా? స్థూలదృష్టికి అవి ధనమాహాత్మ్యాన్ని అభివర్ణిస్తున్నాయి గాని సూక్ష్మదృష్టితో చూస్తే అవి అధిక్షేపణలే.

ఐహిక జగత్తులో ధనం సాధించలేనిది ఏదీ లేదనిపించవచ్చు! అందుచేతనే సంపన్నదేశమైన అమెరికా "Almighty Dollar" - "డాలరు సర్వస్వామ్యం" సామెతగా పరిణమించింది. (డాలరు అమెరికను నాణెము) సమాజంలో ప్రాయికంగా కులపాలికల పాతివ్రత్యాన్ని ప్రజాస్వామ్యంలో పౌరుల ఓట్లను సైతం ధనం కొనగలిగితే- ఇక చెప్పగలిగింది ఏముంది? అయితే, ప్రపంచంలో ఏ కోటీశ్వరుడైనా - శీలవతియైన సౌందర్యవతి పాతివ్రత్యాన్ని, నిజాయితీగల పౌరుల ఓట్లు కొనలేడు. ధనానికి సర్వంసహాధిపత్యం ఉన్నదనుకోటం వట్టి భ్రమ. ప్రపంచంలో ఎందరో కవీశ్వరులు పోతనవంటివారు ధనానికి దాసోహం అనలేదు. త్యాగరాజు- "నిధిచాలసుఖమా? రాముని సన్నిధి చాల సుఖమా? నిజముగ పలుకుము మనసా!" అని ఆలపించి - ఆచరణలో చూపించాడు-తన వైరాగ్యాన్ని!

ధూర్జటి మహాకవి,

"తరగల్ పిప్పలపత్రముల్ మెరుగు
టద్దంబుల్ మరుద్దీపముల్
కరి కర్ణాంతము లెండమావులతతుల్
ఖద్యోతకీటప్రభల్
సురవీథీలిఖితాక్షరంబు లసువుల్
జ్యోత్స్నాపయః పిండముల్
సిరులందేల మదాంధు లౌదురు
జనుల్ శ్రీకాళహస్తీశ్వరా।"

అని ఎలుగెత్తి ఆలపించాడు.

వేదాంతులు-కవీశ్వరులు-యోగులు చెప్పిన మాటలు అటుంచి, ఒకసారి వాస్తవ జగత్తును సమీక్షిస్తే గూడ ధనానికి ఉన్న శక్తి పరిమితం ఆధానమాత్రం అనిపిస్తుంది.

ధనము పెట్టి దేని కొనవచ్చు పృథివిలో?
లోని గుంజు కాదు! పైని డొలక !!
ఔషధాలు గాని-ఆరోగ్యమును గాదు !
సేవకులను గాని-చెలిమిగాదు!
మరుగు పరుపు గాని-మరపు నిద్దుర గాదు!
సౌఖ్యములను గాని-శాంతిగాదు!
చదువు బిరుదు గాని-సంస్కారమును గాదు!
ఒడలు గాని-వెలది యెదద కాదు!!

అయితే - యీ చర్చకు సరియైన ముగింపు ఏమిటి? కాళిదాస మహాకవి చెప్పిన "త్యాగాయ సంభృతార్థానాం" "ధన సంపాదన పరోపకారార్థం త్యాగబుద్ధితో దానం చేయటానికే-" అనేతీర్పు చిరస్మరణీయమైనది. *

# పరోపకృతి

అష్టాదశపురాణేషు
వ్యాసస్య వచన ద్వయం;
పరోపకారః పుణ్యాయ
పాపాయ పరపీడనమ్॥

అష్టాదశ పురాణాలలో వ్యాసమహర్షి ప్రబోధం అంతా రెండు మాటలలో సంగ్రహించవచ్చు.

పుణ్యం అంటే పరోపకారమే! పాపం అంటే పరపీడనమే! సనాతన భారతీయ సంస్కృతి—"పరోపకారార్థమిదం శరీరమ్" అని ఉద్ఘోషించుచున్నది.

బౌద్ధమతంలో పరోపకారార్థం తమ అసువులను అర్పించిన మహాను భావులకు "బోధిసత్త్వాలు" అని పేరు. శిబి-జీమూతవాహనుడు మున్నగు మహనీయులు ఈ కోవకు చెందినవారే.

మహాభారతంలోని కపోతోపాఖ్యానం ఈ నీతిని హృదయంగ మంగ ప్రస్తరించి ప్రబోధించుతున్నది.

పరోపకార పారీణత సర్వమతసార సంగ్రహం.

గాంధీమహాత్ములకు ప్రియమైన పాట—"వైష్ణవజనతో" లో పర దుఃఖమునకు గుండె కరిగి దుఃఖించే వాడే శ్రీవైష్ణవుడు" అని ఉంది. పరదుఃఖానికి ఆనందించే వాడెవడైనా మానవుడే కాడు. అట్టివాడు రాక్షసుడే-అని అనవలసివస్తుంది.

సనాతన భారతీయ సంస్కృతిలో గృహస్థాశ్రమానికి ప్రధాన కర్తవ్యం పరోపకృతి. అందులో పంగ్వంధభిక్షుకబ్రహ్మచారి సంతర్పణ

గృహస్థులు అవశ్యం పాటింపవలసిన విధిగా ఆదేశింపబడింది.

జగదేక వీరులౌ సార్వభౌముల హేమ మకుటాలమెరసిన మణులకంటె;
పరమాత్మ శిరసుపై పరివేషమును గూర్చు గుడిలోని ముత్యాల
గొడుగు కంటె;
సౌందర్య సామ్రాజ్ఞి పొందామరల చుట్టు సిగలోని వజ్రాల జిలుగు కంటె;
విశ్వవిఖ్యాతులౌ విద్వాంసులౌవారి జ్ఞాన విజ్ఞాన తేజస్సుకంటె;
కరగినట్టియెడద-పరదుఃఖమునుగాంచి కరిగి కార్చు వేడి కంటినీరు
విలువ గట్ట హెచ్చు తులతూగు గొప్పదై వేయి రెట్లు స్వర్గవిపణిలోన!

భారతదేశంలో ప్రాచీనకాలం నుండి ఎందరెందరో సత్రాలు - అన్నదాన వసతులు కల్పిస్తూనే ఉన్నారు,

ఏ మానవుడు గాని-తాను-తోటి మానవులకు ఉపకారం చేయకుండా తనకు తోడ్పడమని భగవంతుని ఏవిధంగా ప్రార్థించగలడు? అందుచేత ఆధ్యాత్మిక ప్రగతిలో పాటించవలసింది ముందు పరోపకారం, తరువాత ప్రార్థన. భారతదేశంలో పండుగలకు పర్వాలకు-సూర్య చంద్రగ్రహణ సమయాలలో దానధర్మాలు అవశ్యకర్తవ్యాలుగా నిర్దేశించారు. అయితే దానధర్మాలు పరోపకృతికి బాహ్యచిహ్నాలు మాత్రమే. పరోపకార పారీణత నిజానికి అప్పుడప్పుడు మతం కోసం నిర్వహించే అవశ్య కర్తవ్యం కాగూడదు. అది ప్రతిమనిషి సౌశీల్యమునకు అద్యప్రకృతి కావాలి. నిజానికి వ్యాసుడు ప్రకటించినది "వచనద్వయం" కాదు. "పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం" అనే భావం ఏకైక వాక్యమే.

*

# దేశభక్తి

అపి స్వర్ణమయీ లంకా
న మే రోచతి లక్ష్మణ,
జననీ జన్మభూమి శ్చ
స్వర్గాదపి గరీయసీ.

ఈ మాటలు శ్రీరాముడు లక్ష్మణునితో అన్నవి. రావణవధానంతరం లక్ష్మణుడు లంకా సామ్రాజ్య వైభవాతిశయం చూచి ఆశ్చర్యతన్మయుడై, అన్నగారితో "మనం మళ్ళీ అయోధ్యకు పోవటం ఎందుకు? ఇక్కడే ఉండిపోకూడదా?" అని అంటాడు. ఆ ప్రతిపాదనకు శ్రీరాముడు చెప్పిన ప్రత్యుత్తరమే యీ శ్లోకం. "ఓ లక్ష్మణా, లంక-సువర్ణమయమైనదే కావచ్చు. అయినా, నాకు ఇక్కడ ఉండటం రుచించదు. ఏలన, కన్నతల్లి గాని, జన్మభూమిగాని స్వర్గం కంటే గూడా గొప్పవే."

ఈ శ్లోకంలో ఉన్నవి రెండు ముఖ్య విషయాలు. 1) మాతృభక్తి 2) స్వదేశాభిమానం. ఈ రెంటితో ఐదంయుగీనులు మాతృభాషనుగూడ కలుపుకొని

మాతృభాషకంటె - మాతృదేశముకంటె
మధురమైనదేది మానవులకు?
స్వర్గమైన ఏమి సౌఖ్యము లొనగూర్చు
తల్లికంటె సొంత యిల్లుకంటె

అని కవిత చెప్పవచ్చు.

ఈ సృష్టిలో - తల్లి ప్రేమయే పరమపవిత్రమైనది. తల్లిప్రేమ లేకపోతే మానవసృష్టియే లేదు - సమస్త ప్రాణికోటిలో మానవుడు శైశవస్థితిలో సంపూర్ణంగా తల్లిపై ఆధారపడి బ్రతికే జీవి! ఆపైన గూడ తల్లిప్రేమ సుస్థిరంగా వెల్లివిరుస్తుంది.

అట్టి-జననితో తుల్యమైనది జన్మభూమి. అనేక దేశాలలో ఎందరెందరో వీరాధివీరులు మాతృదేశ సంరక్షణార్థం తమ ప్రాణాలను బలియిచ్చారు. మన భారతదేశంలో ఈమధ్య గాంధీయుగంలో ఎందరో కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు దేశభక్తులై స్వాతంత్ర్య సమర సత్యాగ్రహంలో పాల్గొని కారాగారశిక్షలు అనుభవించారు. కొందరు తమ అసువుల్ని కోలుపోయారు. ఆనాడు లంకారాజ్యంలో ఎందరో వీరాధివీరులు కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలైనవారు స్వదేశ సంరక్షణార్థం రావణుని కంటే ముందే యుద్ధంలో తమ ప్రాణాలను ఆహుతి చేశారు.

అయితే - ఈ దేశభక్తి వెఱ్ఱితలలు వేసిన సన్నివేశాలు కూడ ఎన్నో ఉన్నాయి. గతించిన రెండు మూడు శతాబ్దులలో ఐరోపా ఖండంలో ఎన్నోదేశాలు-దేశభక్తిదురభిమానంతో అనేక యుద్ధాలుచేసి అన్యోన్యమారణహోమానికి ఆహుతి అయ్యాయి. ఒక జాతివారు మరో జాతివారిని జయించి-ఆయా దేశాలను దోచుకొని చెప్పరాని కడగండ్లపాలు చేశారు.

దేశభక్తి వెఱ్ఱితలలు వేసినప్పుడు అది స్వజాతీయదురహంకారానికి దారితీయడం సహజం. అదే సామ్రాజ్యవాదానికి దారితీసింది. ఇందులో ఒక ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే-స్వదేశంలో దానకర్ణుడుగా, దయామయుడుగా పరోపకారపారీణుడుగా ప్రఖ్యాతి వహించ

తన జీవితాన్ని తీర్చిదిద్దుకొనిన మహానుభావుడే ఇతరదేశాలను జయించినప్పుడు ఆరని రక్తదాహంతో ఘోరరాక్షసకృత్యాలను పాల్పడటం కద్దు! ప్రపంచ చరిత్రలో ఇటువంటి ఉదాహరణాలు కోకొల్లలు. ఆంగ్లేయులు రవి అస్తమించని సామ్రాజ్యం నిర్మించుకొనుటకు ఇట్టి దేశభక్తియే దోహదం కల్పించింది. ప్రపంచ చరిత్రలో ఆధునాతన చరిత్ర అంతా దేశభక్తి కొట్లాటలే. సామ్రాజ్యవాదంలో కొంత విజయం సాధించిన రాజ్యాలు ప్రపంచాధిపత్యంకోసం కలబడుగన్నాయి! జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్, ఇంగ్లాండు మున్నగు దేశాలే గాక జపానుగూడ ఈ నడిగుండంలో ఒకసారి చిక్కుకొని చీనామీద దురాక్రమణ సల్పింది!

మోతాదు మించిన దేశభక్తి, స్వదేశాభిమానం జగత్కంటకం కావచ్చు. ఈ విషయం గుర్తించిన భారతీయులు ఏనాడో సంస్కృతంలో

"ఉదార చరితానాం తు వసుధైక కుటుంబకమ్"

అని అన్నారు. అనగా సౌశీల్యవంతులకు ఎల్లప్పుడూ వసుధైక కుటుంబియే గద. "ఈ ప్రపంచమంతా నా ఊరే" అన్నాడు ఒక పురాతన తమిళ కవీశ్వరుడు.

దేవాలయాలలోని విగ్రహారాధన-విశాలదృష్టితో చూచినప్పుడు ఉపనిషత్ ప్రోక్తమైన భగవత్ తత్త్వమునకు ప్రతీకయే. దేశమంటే మట్టికాదోయ్, నిజమే-దేవుని విగ్రహమంటే రాయికాదోయ్! అది ఆస్తికతకు మొదటి సోపానం అని అన్నారు విజ్ఞులైన వేదాంతులు. ఇప్పుడు యావత్ ప్రపంచంలో, సంకుచిత దేశభక్తి మంచిదికాదనీ కావలసింది విశ్వమానవ శాసనపరిషత్తు. వసుధైక ప్రభుత్వం అని ఎలుగెత్తి చాటుచున్నారు, క్రాంతదర్శులైన మహానుభావులు.

భవిష్యత్ కాలంలో - ఎప్పుడో వసుధైక ప్రభుత్వం ఏర్పడి నప్పుడు గూడ, "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అనే మంచివారు ఉండవచ్చు. ఆనాడు గూడ ఉత్తరధ్రువమండలంలో నివసించే ఎస్కిమో ఢిల్లీ ఎండకు ఓర్చుకోలేదుగదా! 'మాతృదేవో భవ' అనే వాక్యంలో ఇతర మాతలను ద్వేషించ కూడదనే మాట కూడ అంతర్గర్భితంగా ఉన్నదే చెప్పవచ్చు. తన తల్లిని ప్రేమించి గౌరవించే వాడు ఈ ప్రపంచంలో ఏ తల్లిలోనైనా జగన్మాతృ స్వరూపమును సాక్షాత్కరించుకోగలడు.

*

---

"ఒక్క కుఱ్ఱవాడు ఒనరించు నేరమ్ము
తల్లి తండ్రి యొక్క తప్పుతోడ
వందమంది పెద్దవారి వైఫల్యమ్ము
చదువులోని లోటు చాటగలదు"

# వెలుగునీడల వింతమెలిక

పదే పదే చ రత్నాని
యోజనే రసకూపికా।
భాగ్యహీనా న పశ్యంతి
బహురత్నా వసుంధరా।

"ఈలోకంలో అడుగడుగుకు రత్నాలు లభిస్తాయి! వెనుదిరుగకుండా పయనిస్తే ప్రతియోజనానికి ఒక అమృతపుబావి కనుపిస్తుంది! దురదృష్టవంతులు మాత్రమే వాటిని చూడరు. రత్నగర్భయైన యీ పృథివిలో నిధినిక్షేపాలు కోకొల్లలు!" ఆశావాదియైన కవీశ్వరు డెవ్వరో పై శ్లోకం ఆలపించాడు ముక్తకంఠంతో.

మానవజీవితం—వెలుగునీడల వింతమెలికే గాని కేవలం వెన్నెల పాలకడలిలో వెండిపడవపై వినోద విహారం కాదు. గొజ్జగి పూలపాన్పు కాదు. కాళరాత్రులు-కంటకకిరీటాలు-కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు వికటాట్టహాసం చేసే విచిత్ర రంగస్థలం మనిషి బ్రతుకు. భూమికి "వసుంధర"-"రత్నగర్భ" అనే పర్యాయపదాలు ఉన్నప్పటికీ-భీకరబీభత్ససమస్యలే అడుగడుగున జీవయాత్రలో మానవులకు ఎదురవు తాయిగదా. వాటి మాటనే శ్లోకకర్త తలపెట్టలేదు. అయితే-పై శ్లోకకర్తవంటి ఆశావాదికి సమస్య లంటే భయం ఉండదు. అవ్వే, సమస్యలా అవి!! సమస్యలు మారువేషంలో మనుష్యుల వెంటబడే సదవకాశాలే అంటాడు ఆశావాది.

ఎదురుకొనుట మేలు- ఏ సమస్యలనైన
సదురు బెదురులేక బ్రదుకులోన,
మారు రూపు దాల్చి-మన వెంట బడుచుండు
సదవకాశము లవి; వదలరాదు.

ఈ సదవకాశాలు – ఎల్లప్పుడూ అవశ్యచారిత్రక భవితవ్యంగా – సమాజంలోని సభ్యులకు వస్తూనే వుంటాయి. ఒక జాతి – "ఒక సమాజం–ఒక దేశం అధఃపతనం చెందింది, ఇంక ఎట్లా లేవగలదు? అని అనుకున్నప్పుడు కూడ బురదలోనుండి పద్మం ఉద్భవించనట్లు ఆ జాతిని ఉద్ధరించేందుకు ఎవరో ఒక మహానాయకుడు ఆవిర్భవిస్తాడు. ఆ సదవకాశం ఎక్కడికీ పోదు. మేలుకొని వున్న మరియొకడు దానిని సద్వినియోగం చేసుకుంటాడు.

సమయమునకు వచ్చు సదవకాశము లెల్ల
జారి పారిపోవు జగతి విడిచి
నీవు నిదుర కనక–నీ సోదరుడొకండు
మేలుకొనినవాడు మేలు పొందు:

'బహురత్నా వసుంధరా' అన్నప్పుడు, రత్నం అన్నప్పుడు కేవలం రత్నమాణిక్యాలు వజ్రవైఢూర్యాలు అనే సంకుచితమైన అర్థం చెప్పుకో కూడదు. ఔపచారికంగా ఆ పదాలు స్వీకరిస్తే-భూమి వసుంధర, మరియు రత్నగర్భ. భూమిలోని రత్నాలను వాడుకునే శక్తి ఉండాలి అంతే.

అయితే–భూమిలో రత్నాలు–నిధినిక్షేపాలు తప్ప, తుక్కు–దూగర, చెత్త–చెదారం ఉండవా? అనే యెదురు ప్రశ్నకు ఆశావాది చెప్పే సమాధానం ఉత్తేజకరమైంది.

విలువవచ్చు శాస్త్రవిజ్ఞాన మహిమచే
చేరకు విప్పికైన చేత్తకైన;
చచ్చు పుచ్చు తుక్కు-సంపత్తి యగుగాత:
పనికిరాని దేది? ప్రజ్ఞ యున్న.

ఈదృష్టితో చూస్తే, ఈ సువిశాలప్రపంచం - అనంత రత్న సమంచితమ్! అపార నిధి నిక్షేప నిలయం.

ఈ ఆశావాదం ప్రతిపాదించిన శ్లోకకర్త ఇందులో ఒక అర్థవంతమైన వాక్యం పొందుపరచాడు.

"భాగ్యహీనా న పశ్యంతి"

దురదృష్టవంతులు మాత్రమే-ఈ వసుంధరను బహురత్నగర్భగా చూడలేరు. అయితే ఎందరు అదృష్టవంతు లుంటారు? అనే ఎదురు ప్రశ్నకు ఆశావాది చెప్పే సమాధానం-

"ధైర్యే-సాహసే లక్ష్మీః"

ధైర్యసాహసాలు ప్రదర్శించి పురోగమించే వారినే అదృష్టలక్ష్మి వరిస్తుంది. ఇందుకు సందేహం లేదని ఆశావాది నమ్మకం. ఇక-మానవుని కర్తవ్యం ఏమిటంటే-సమాధానం

"పురుషకారమే యేకైక పరమపథము"

మానవుడు సదా పురోగామి. మానవుడు సృష్ట్యాదినుండి పురోగమిస్తూనే ఉన్నాడు. "ప్రగతి"- మానవుని జన్మహక్కు. అవశ్య చారిత్రక భవితవ్యం.

ఉత్తిష్ఠత-జాగ్రత - ప్రాప్యవరాన్ నిబోధత. లెమ్ము! మేలుకొమ్ము! ధ్యేయాన్ని సాధించేవరకు ఆగకుండా పురోగమించు.

*

# కర్తవ్యం

గతే శోకో న కర్తవ్యో
    భవిష్యం నైవ చింతయేత్
వర్తమానేన కాలేన
    వర్తయంతి విచక్షణాః

గతించిన దానిని గూర్చి దుఃఖించగూడదు. రాబోయే దానిని గూర్చి ఆలోచిస్తూ కాలం గడుపరాదు. ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి ఆలోచించి తగినట్లుగా ప్రవర్తిస్తారు వివేకవంతులు.

ఈ భావాన్నె - లాంగ్‌ఫెలో అనే అమెరికను కవి ఆంగ్లంలో Psalm of life (జీవితసూక్తం) అనే శీర్షిక క్రింద ఒక పద్యం వ్రాశాడు

Trust no future however Pleasant !
    Let the dead past bury its dead!
Act-Act in the living Present !
    Heart within and God over head !

భవిష్యత్తును గూర్చి మధురాతిమధుర స్వప్నాలను కనవద్దు - మరణించిన భూతకాలాన్ని-మరచిపో. సమాధులు త్రవ్వవద్దు. వర్తమాన కాలంలో ఈ క్షణంలో-ప్రస్తుత కర్తవ్యాన్ని నెరవేర్చు. ఆంగ్ల పద్యం లోని ఈ మూడు పంక్తులు సంస్కృత శ్లోకానికి కేవలం అనువాదమే - ఆంగ్లకవి అదనంగా చేర్చిన నాలుగో పంక్తిలోనున్న అంతరాత్మను ఆపైనున్న భగవంతుని పాత్రమే- పరిగణించమన్నది.

ముందు రాబోవు శుభదినములను గూర్చి
తియ్యని పగటికలలు చిత్రించుకొనకు
జరిగిపోయిననాటి సంస్మరణ లేల?
తాల్చు మిప్పుడె నేటి కర్తవ్య దీక్ష.

చాలమంది-ముందు మంచి రోజులు వస్తాయనే ఆశలు పెంచుకుంటారు. ఒకవిధంగా అట్టి ఆశలు లేనిదే మానవులు బ్రతుకలేరేమో! కాని-తనకు కాబోయే పెండ్లి గూర్చిగాని-రాబోయే ఉద్యోగాన్ని గూర్చిగాని పగటి కలలు కంటూ కూర్చుంటే-అది వృథా కాలహరణం అవుతుంది-అట్టివాడు సాధించవలసినది సాధించలేడు. సాధించగలిగినంత సాధించలేకపోవచ్చు. ఈవిధంగా పగటి కలలు కనేవాళ్ళు కర్తవ్యానికి ఎంత దూరంలో నిలుస్తారో వీరికి వ్యతిరేకులు కొందరు అనవసరంగా భయపడే భీరువులుగూడ వట్టి నిష్ప్రయోజకులే అవుతారు.

ఆశావాదం మంచిదా? నిరాశావాదం మంచిదా?

ఆశ లెండ మావు లటంచు అనినయెడల
భయములన్ - రజ్జు సర్ప విభ్రాంతి గావె?
మిథ్య గాదోయి జీవితోన్మేష మెల్ల
పురుషకారమే యేకైక పరమ పథము

ఆశలు ఎండమావులు. ఆశల వెంటబడటం కొఱవి దయ్యాల వేట. 'ఆశలు అసత్యాలు అంటే భయాలు మాత్రం అన్నీ నిజాలే అవుతాయా? త్రాడును చూచి దాన్ని పామని భయపడటం గూడ వద్దు. అందుచేత ఆశలూ వద్దు భయాలూ వద్దు. మధ్య నిలిచి, నీ ప్రస్తుత కర్తవ్యం నిర్వహించుమనది,' అనే సందేశమే ఈ శ్లోకంలోని అంతరార్థం.

గతే శోకో న కర్తవ్యః-అన్నదానికి ఛాయగా పెద్దలు "గతజల సేతుబంధనం" ఎందుకు అంటారు. ప్రవహించిపోయిన జలానికి ఆనకట్ట వేయటమే భూతకాలాన్ని గూర్చి యోచించటం, We should not cry over spilt milk నేలపై ఒలికి పోయిన పాలకోసం దుఃఖించి ప్రయోజనం ఏమిటి - అనే ఆంగ్లభాషలోని సామెత ఈ అర్థాన్నే ప్రబోధిస్తుంది.

ఇంతవరకు ఎంతో బాగా ఉంది. భూతకాలం కడుపులో నుండే వర్తమానకాలం పుడుతుంది. వర్తమానకాలం కడుపులో నుండి భవిష్యత్ కాలం ఆవిర్భవిస్తోంది. భూతకాలాన్నిగూర్చి జరిగిపోయిన సంగతులు గూర్చి ఆలోచిస్తు కాలం వృథ చేయగూడదనే హితోపదేశానికి అర్థం - గతచరిత్రను చదువవద్దని జరిగిన సంగతులనుండి గుణపాఠాలు నేర్చు కోవద్దని చెప్పటం కాదు, భూత భవిష్యత్ వర్తమానాలకు గల అవినాభావ సంబంధం గుర్తించిన క్రాంతదర్శులనే త్రికాలవేదులని పెద్దలు అగ్గించారు. History Repeats itself-చరిత్ర పునరావృత్తం అవుతుందని ఆంగ్లంలో ఒకసూక్తి ఉంది. దీని అర్థం యథాక్షరంగా స్వీకరించరాదని, అర్థవాద రూపంలో సంగ్రహించాలని వేరే చెప్పనక్కరలేదు.

Act-Act in the living present అని ఆంగ్లంలో అన్నదానికి

వర్తమానేన కాలేన వర్తయంతి విచక్షణాః

అని సంస్కృతంలో అన్నదానికీ, తాల్పువిప్పవే నేటి కర్తవ్యదీక్ష అన్న దానికీ ఒకటే అంతరార్థం - అది మానవుడు క్రియాశూరుడు కావాలి. "I slept and dreamt that life was Beauty I woke and found that life was Duty"

జగతియెల్ల మధుర సౌందర్యమయ మంచు
కనులు మూసి కలలు గాంచినాను,
కనులు విప్ప తెలిసె-కర్తవ్యముల దీర్చ
వాసయోగ్య మగును వసుధ యనుచు. *

# ఆశ్రమచతుష్టయం

శైశవేఽభ్యస్త విద్యానాం
యౌవనే విషయైషిణాం
వార్ధకే ముని వృత్తీనాం
యోగేనాంతే తను త్యజాం॥

ఇది కాళిదాసమహాకవి వ్రాసిన శ్లోకం. రఘువంశీయులైన రాజుల ఆశయాలను అభివర్ణించే సందర్భంలోనిదే అయినా-ఈ శ్లోకంలో ఆ మహాకవి తనకు అభిమతమైన స్వీయవేదాంతమే ప్రతిపాదించినట్లు ఊహించవచ్చు.

చిన్నతనంలో చదువుకోవాలి! యౌవనంలో విషయసుఖాలను అనుభవించవచ్చు! వయస్సు మళ్ళినపుడు శృంగారసౌఖ్యాలపై వ్యామోహం తగ్గించుకొని ఆత్మసంయమనం అలవరచుకోవాలి. చిట్టచివరకు సన్యాస్యాశ్రమం స్వీకరించి పరమపదించాలి. ఇది ఆ మహాకవి అందించిన సందేశం.

శైశవం విద్యాభ్యాసానికే అనువైన సమయం. చిన్నపిల్లలకు జిజ్ఞాస సహజం. "లక్షప్రశ్నలు - కోటిప్రశ్నలు-లక్షలకొలదీ యక్ష ప్రశ్నలు"- అంటూ ఆధునిక బాలమనస్తత్వజ్ఞులు విశ్లేషిస్తున్నారు. చిన్న తనంలో కంఠస్థం చేసిన పద్యాలు ఆజన్మం జ్ఞాపకం ఉంటాయి. వయస్సు మళ్ళినకొలదీ ధారణాశక్తి సన్నగిలుతుంది.

ఇక యౌవనంలో విషయసుఖాలను అనుభవించవచ్చు అన్నాడు కాళిదాసు. ఎల్లప్పుడూ విషయసుఖాలకు దూరంగా ఉండాలి అనేవారు

ఉన్నారు. అజన్మబ్రహ్మచారులుగా జితేంద్రియులైన మహర్షులూ చరిత్రలో కన్పిస్తున్నారు. అయితే అది మానవులందరకూ సాధ్యమా? అవసరమా? అజన్మబ్రహ్మచర్యం మానవస్వభావ విరుద్ధం-అనవసరం అనే వారూ ఉన్నారు. విషయసౌఖ్యం నైసర్గిక పాపచర్య అని నిరసించే పాశ్చాత్యులు ఉన్నారు. శృంగారం ''పాపం'' అయితే ఇక జగత్సృష్టి ఆగిపోవలసిందేనా? ఈ ప్రశ్నకు సమాధానమే లేదుగదా. అయితే కాళిదాస మహాకవి శృంగార లౌల్యాన్ని సమర్థించినట్లుగా ఈ వాక్యానికి అపార్థం కల్పించకూడదు. కామదహనానంతరమే-కాళిదాసు పార్వతీ పరమేశ్వరుల దాంపత్యబంధం అనుసంధించియున్నాడు. కనువేదురుతో ఉద్భవించిన శృంగారంతో ప్రారంభించిన శకుంతలాదుష్యంతులు - విడివడి-చిట్టచివరకు మారీచాశ్రమంలో కలుసుకున్నారు. అయితే కాళిదాసు అభిప్రాయంలో శృంగారానుభూతి 'పాపం' కాదు. ఉపాదేయమైనదే. అది సృష్టికి సహజసిద్ధం సముచితం.

ఇక-మూడవదశ- ''వార్ధకే మునివృత్తీనాం'' వయస్సుమళ్ళుతున్నవాళ్ళు ఏంచేయాలి? ఏంచేసినా ఏంచేయకపోయినా శృంగార నాయికానాయకులుగా ఉండాలని ఉబలాటపడకూడదు. ప్రేమికుని భూమిక ధరించే వృద్ధునికంటె నవ్వులపాలయే వ్యక్తి మరి యెవరు? వృద్ధులు-జగద్హిత జీవితం తీర్చిదిద్దుకుంటే ఎంత బాగుంటుంది? అది ఆ సమయంలో అసాధ్యం కాదు. ఏటికి ఎదురీత కాదు.

**"Culture is Voluntary Self control."** "సంస్కారం అంటే స్వచ్ఛందంగా అలవరచుకొనే ఆత్మనిగ్రహం" అని రాజాజీ ప్రవచనం. శక్తి, తక్కువైనకొలందీ, రక్తి ఎక్కువైతే అది హాస్యాస్పదం! వానప్రస్థానికి- "ముని" గా వుండటం-వార్థకంలో అభిలషణీయమూ, ఆచరణ యోగ్యము కూడా అని చెప్పవచ్చు. ముని స్వభావమే మౌనం, బాల్యంలో

యౌవనములో ఏదో తహతహ ఉండవచ్చు. లోకాన్ని చూచినప్పుడు ఆవేశకావేశాలు కలుగవచ్చు. యౌవనము పొంగే పాలు. వార్ధకం కాగి చల్లారిన పాలుగా మీగడ కట్టాలి. ప్రపంచాన్ని ఎన్నో వర్యాయాలు ఆలోచించినప్పుడు 'అహో! మనోనేత్ర నిర్వాణం' అని మౌనంగా ఉంటాడు ముని.

"జ్ఞాని – పూనదగును మౌన ముద్ర"

ఇక–నాలుగోదశ-యోగిగా తనువు చాలించటం దీనికి ఎంతో సాధన–తపస్సు అవసరం. మూడవదశలో మునివృత్తి అలవరచుకున్న వారికి ఈ నాలుగోమెట్టు ఎక్కటం చాల సులువు.

శైశవం అంటే దశదిశలా సౌరభం వెదజల్లుతూ మొగ్గ–పువ్వుగా వికసించటం. యౌవనంలో అందాలు చిందుతూ వికసించిన ఆ పువ్వు–వాడిపోయి మూడవదశలో పిందెగా ఆవిర్భవిస్తుంది. కొన్ని పిందెలు రాలిపోతాయి. కొన్ని కాయలుగా ఎదుగుతాయి. కొన్ని ఎండిపోతవి. మరికొన్ని కుళ్ళిపోతాయి. నాలుగోదశలో ఆ కాయ ఎండిపోకుండా కుళ్ళిపోకుండా చివరకు చక్కని పండుగా రూపొందాలి. అంటే మనిషి యోగికావాలి.

మానవజీవితాన్ని - ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రస్తరించి యేర్పరచిన నాలుగు ఆశ్రమాలు-బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ సన్న్యాసాశ్రమాలు కాళిదాసుకవి అభివర్ణనకు సమానాంతర రేఖలే. *

---

క్షమయు అహింసయు సత్యము
సమతయు ఇంద్రియజయంబు శమము పరిత్యా
గమును తపోలక్షణములు;
క్రమమున ఇన్నియును ఊర్ధ్వగతి కారణముల్
– మహాభారతము 3-6-108

# సుభాషితాలు

బోద్ధారో మత్సరగ్రస్తాః
ప్రభవః స్మయదూషితాః
అబోధోపహతాశ్చాన్యే
జీర్ణమంగే సుభాషితమ్

బోద్ధలగువారు మత్సరపూర్ణమతులు
ప్రబలగర్వవిదూషితుల్ ప్రభువులెన్న
ఇతర మనుజులబోధోపహతులుగాన
భావమున జీర్ణమయ్యె సుభాషితంబు.

భర్తృహరిమహాకవి విశ్వజనీన సత్యములను సూత్రప్రాయంగా మాత్రమేగాక సాహితీసుకుమారసుందరంగా సుభాషిత శ్లోకాలు సంస్కృతంలో వ్రాశాడు. యుగయుగాంతరాలుగా ఆ శ్లోక సుభాషితాలు సహృదయులు కంఠస్థంచేసి వల్లెవేస్తున్నారు. అయితే - సమకాలీనులు అతని సుభాషితాల గొప్పదనం గుర్తించినట్లు కన్పించటంలేదు. అందుచే భర్తృహరి చెప్పిన ప్రథమ శ్లోకంలో ఆ ఆరాటం స్వయంవ్యక్తమగుచున్నది.

"తెలిసినవారు లోకంలో ఉన్నారు. అయితే వారు సాటివాని సాహిత్య వైదుష్యం గొప్పతనాన్ని గుర్తించరు.

అధికారమత్తులైన ప్రభువులు ఏ విషయాలు పట్టించుకోరు. వారికి సుభాషితాలు అక్కరలేదు. సాహిత్యం సంస్కృతి అక్కరలేదు.

ఇక తెలియనివాళ్ళు ఉన్నారు. పాపం వారు అజ్ఞానులు. వారేమి చేస్తారు?

అందుచే-అనుభవజ్ఞుడైన విద్వాంసుడు చెప్పే మంచిమాటలు అతనిలోనే అణగిపోకతప్పదు. అట్టిగతియే నాకూ పట్టింది" అని భర్తృహరి వాపోయినాడు.

# మిడిమిడిజ్ఞానం

అజ్ఞః సుఖమారాధ్య స్సుఖతర
మారాధ్యతే విశేషజ్ఞః
జ్ఞానలవ దుర్విదగ్ధం
బ్రహ్మాపి నరం న రంజయతి.

తెలియని మనుజుని సుఖముగ
తెలుపందగు- సుఖతరముగ తెలుపగవచ్చున్
తెలిసినవానిన్- తెలిసీ
తెలియని నరు దెల్ప బ్రహ్మదేవుని తరమే!!

ఏ విషయమైనా,
తెలియనివారికి సులువుగా చెప్పవచ్చు. ఏలన వారి మనస్సు నిర్మలంగా ఉంటుంది. తెలుసుకోవాలనే కోరిక మానవులకు సహజంగా ఉంటుంది.
ఇక తెలిసినవానికి ఏవిషయమైనా ఇట్టే చెప్పవచ్చు.
అంత ప్రయాసపడవలసిన అవసరం ఉండదు. మరచిపోయినట్టి అంశంపై మనస్సును మళ్ళించినట్లే.
ఇక మూడవతరగతి మనుష్యులు ఉంటారు.
వారు తెలిసీతెలియనివారు.
మిడిమిడిజ్ఞానం మిక్కిలి ప్రమాదకరం. అట్టివారికి ప్రాయికముగా గర్వం ఉంటుంది. పూర్తిజ్ఞానం లేకపోవటంచేత వారు కొన్ని దుర్భ్రమలకు లోనై యుంటారు.
తెలిసీతెలియనివారికి-వారిని సృష్టించిన బ్రహ్మదేవుడుసైతం తెలియ చెప్పలేడని భర్తృహరి సుభాషితం.

# మూర్ఖుని మనస్సు

ప్రసహ్య మణి ముద్ధరే
న్మకర వక్త్ర దంష్ట్రాంతరా
సముద్రమపి సంతరేత్
ప్రచలదూర్మి మాలాకులం
భుజంగమపి కోపితం
శిరసిపుష్ప వద్ధారయేత్
న తు ప్రతినివిష్టమూర్ఖ
జనచిత్త మారాధయేత్

మకరముఖాంతరస్థమగు మణికమున్ పెకలింపవచ్చు-పా
యక చలదూర్మికానికరమైన మహోదధి దాటవచ్చు మ
స్తకమున పూవుదండవలె సర్పమునైన ధరింపవచ్చు మ
చ్చిక ఘటియించి మూర్ఖజనచిత్తము తెల్ప నసాధ్యమేరికిన్

మొసలి ముఖంలో ఉన్న మాణిక్యాన్ని అయినా బయటకు తీయవచ్చు!
పెద్ద పెద్ద కెరటాలతో గట్టుకనిపించని సముద్రాన్నిగూడా ఈదవచ్చు!
మెడలో పూలదండవలె త్రాచుపామును ధరించవచ్చు.
కానీ మూర్ఖునికి ఏవిషయమైనా అర్థమయ్యేటట్లు బోధించి అతని మనస్సును రంజింపజేయటం అసాధ్యం.

అనగా - మూర్ఖుల మనస్తత్వం అంత విచిత్రమైనది. మూర్ఖులను రంజింపజేయటం అసాధ్యాలలో అసాధ్యమైనది. విద్యాప్రబోధంలో నేర్చుకునేవారిలో అవశ్యం చూడవలసిన అంశం ముఖ్యమైనది. అర్హత-ఆనుషంగికమైనవి [illegible] మూర్ఖునిలో ఈ రెండు లక్షణాలు ఉండవు సరిగదా, అతని మనస్సులో ఏవో పేరుకొనిపోయినట్టి భ్రమలుగూడా ఉంటాయి. అనగా - సారాంశం

సుభాషితాలు సహృదయులైన పిల్లలకే
ఉపకరిస్తాయిగాని మూర్ఖులకు గాదు.

# స్థానచలనం

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు తప్పిన
తమమిత్రులె శత్రులగుట తథ్యము సుమతీ !!

సూర్యుడు పద్మమిత్రుడు అనేది ఒక సుకుమార సుందరమైన కవిసమయం.

నీటిలో ఉన్న పద్మాలు సూర్యకాంతికి వికసిస్తాయి. అయితే ఆ పద్మాలే నీటిలోనుండి పీకి గట్టుమీద పారవేయబడినప్పుడు, ఆసూర్యరశ్మి చేతనే వాడి కమిలిపోతాయి.

అదేవిధంగా—చిరకాలమిత్రులుగూడ, తమ తమ స్థానములు తప్పినప్పుడు శత్రువులు కావటం అందరకూ అనుభవప్రమేదితం. మైత్రి—అవస్థానాపేక్షము. లౌకిక జగత్తులో నిర్వ్యాజమైన స్నేహం అరుదు. సుమతీశతకంలోని ఈ సుప్రసిద్ధపద్యం అందించే లోకజ్ఞానం —రాజనీతినే ఇంకా గాఢంగా అనువర్తిస్తుంది.

రాజనీతిలో శాశ్వతమిత్రులు ఉండరు. శాశ్వత శత్రువులు ఉండరు. సామ్యవాద సమాజంలోకూడ ఈనీతి వర్తిస్తుంది.

"సుమతీ" శతకకారుడు-విశ్వజనీనమైన సత్యాన్ని-అలతి అలతి మాటలతో — బ్రతుకులో ఎన్నోసార్లు నెమరువేసుకోదగిన అనుభూతిని సహృదయులకు హృదయంగమంగా అందించాడు.

*

## అధ్యక్షపీఠం

పండితుడైనవాడు దిగువంబడియుండగ అల్పుఁడొక్కఁడు
ద్దండత పీఠమెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగున్??
కొండొక కోతి చెట్టుకొన కొమ్మలనుండగ క్రింద గండ భే
రుండ మదేభ సింహ నికురుంబములుండవె చేరి భాస్కరా.

ఈలోకంలో పలుసారులు పలుతావులలో పెద్దపదవులు-అసమర్థులకు అల్పులకు లభించటం కద్దు.

సమర్థులు-సౌశీల్యవంతులు యోగ్యులు చిన్నపదవులలో మగ్గుతూ ఉండవచ్చు!

ఇది ఈనాటి మాటగాదు. కేవలం ఏదో ఒకదేశానికి మాత్రమే సంబంధించిన అంశంకాదు.

ఈవిషయాన్ని-భాస్కరశతక కారుడు, అన్యాపదేశంగా మనోజ్ఞంగా మరువరాని మాటలతో అభివర్ణించారు.

అడవిలో కోతి చెట్టు యొక్క చిటారుకొమ్మపైకి ఎక్కి కూర్చుంటుంది.

అయితే ఆచెట్టుక్రిందనే గండభేరుండాలు-మదపుటేనుగులు-సింహాలు ఉండవచ్చు. అంతమాత్రంచేత ఆకోతికి వచ్చే ఘనత ఏమీలేదు. క్రింద ఉన్న ఏనుగులకు సింహాలకు ఏర్పడే న్యూనత ఏమీలేమగద.

సమర్థతకు తగిన పదవి లభించని యోగ్యులకు ఈపద్యం కల్పించే ఊరట ఇంతింతనరానిదే. అట్లే - కారణాంతరాలచేత ఉన్నతస్థానాలు లభించిన అల్పులపై ఈ పద్యం ఎంతటి పదునైన విసురు! ఎంతటి సునిశిత విమర్శ.

# యోగము

I

కాదు యోగమనిన కసరత్తు గరిడీలు
పుడమిలోన పూడ్చఁబడుట కాదు;
గాజు- ఇనుము-తినుట, రాజయోగము గాదు,
మనసు నిగ్రహించు మహిమ గాని.

II

కాదు యోగమనిన గడ్డాలు మీసాలు;
పసుపు కావి పట్టు బట్ట కాదు;
వేదశాస్త్రవాద వైదుష్యమా? కాదు;
ఒడలితోడి ముక్తి - యోగమనిన.

III

యోగమనిన- ఎట్టి ఉద్యోగ మందైన
దీక్షతోడ కూడు దక్షత సుమి;
మెరయు- యోగమందు- స్థిరతటిల్లతవోలె
కర్మ సామరస్య కౌశలమ్ము.

# సనాతనమతం

మతము - విజ్ఞానశాస్త్రగుంఫనము లేక
గ్రుడ్డిదగును-సమ్యగ్దృష్టి కోలుపోయి;
మహితశాస్త్ర విజ్ఞానమ్ము-మతము లేక
కుంటిదగును చైతన్యమ్ము కోలుపోయి.

—ఐన్‌స్టీను

# హేతువాదం

నేడు హేతువాదమునకు మతమునకు సహజవైరుధ్యం ఉన్నట్లు కొందరు భావించుచున్నారు. విజ్ఞానశాస్త్రం హేతువాదాన్ని అంగీకరిస్తుందనీ మతం ఓరస్కరిస్తుందనే భావం అట్టివారిలో కన్పిస్తుంది. హేతువాదాన్ని అంగీకరించకపోతే, విజ్ఞానశాస్త్రం విజ్ఞానశాస్త్రమేకాదు. అయితే హేతువాదాన్ని మతం ఓరస్కరిస్తుందనే మాట గూడ యదార్థం కాదు. నిజమైన అనుభూతి - మనుజ ప్రవృత్తిలో హేతువాదాన్ని తిరస్కరించదు. సత్యాన్వేషణే మతానికి ధ్యేయం. సత్యాన్వేషణ కాకపోతే మతానికి విలువలేదు. సత్యం ఎప్పుడూ హేతువాదాన్ని ఓరస్కరించదు. ఇక హేతువాదం అందుకోలేని సత్యం ఉండవచ్చు. అయితే-ఆ అనుభూతి హేతువాదానికి అతీతమైనదే కావచ్చునుగాని వ్యతి

రేకమైనదికాదు. కారాదు. మతం ప్రతిపాదించే ఆధ్యాత్మికానుభూతి ఊహకోవను పెంచిపెట్టింది.

మతము హేతుగతికి వ్యతిరేకమా? కాదు?
తోటి బాటసారి దూరయాత్ర
ఎచట హేతువాగు _ అచటి చీకటి దాటి
మతము సాగు ప్రగతి మార్గమందు.

సత్యాన్వేషణమే విజ్ఞానశాస్త్రానికి ధ్యేయం. మతానికి ఏకైక ధ్యేయం సత్యాన్వేషణమే. ఇంతవరకు ప్రపంచచరిత్రలో విజ్ఞానశాస్త్రం సాధించుచున్నది ఖండసత్యాలుమాత్రమే. సంపాదించింది జ్ఞానశకలాలు మాత్రమే. విజ్ఞానశాస్త్రవేత్తలలో నిరుపమానశేముషీ ధురంధరుడుగా పేరుగాంచిన న్యూటన్ మహాశయుడు చెప్పిన మాటలు ఉదాహరింప దగినట్టివి.

"విజ్ఞానసాగర సైకతస్థలంలో గులకరాళ్ళు కొన్ని ఏరుకునే డింభకులలో నేను ఒకణ్ణి అని నా భావన." —న్యూటన్

అందుచేత విజ్ఞానశాస్త్రం నైసర్గికంగా నిరంతర పరిశోధనలో నిమగ్నమై ఉండవలసినట్టిదేగాని-ఆ అన్వేషణకు పరిపూర్ణసిద్ధి అనేదిలేదు. విజ్ఞానశాస్త్రి ధ్యేయం ఎల్లప్పుడూ అందని ఆకాశమే. విజ్ఞానశాస్త్రం ఎల్లలు ఎప్పుడూ ఎదుగుచుండేవే. అందుచేత, విజ్ఞానశాస్త్రం మానవ జీవితమహాప్రస్థానంలో తోడి బాటసారిగ కొంతదూరం మాత్రమే రాగలదు. మానవునితో పాటు చిట్టచివరవరకు-మరణసమయం వరకూ మాత్రమే గాక మరణానంతర జీవయాత్రలోగూడ సహయాత్ర సాగించేది మతం ఒక్కటే- అంటారు ఆధ్యాత్మవిదులు.

*

# మతము-మరణశయ్య

మానవుడు - యుగయుగాంతరాలనుండి సాధించిన కళలు ఎన్నో ఉన్నాయి. నాగరికతా వికాసంతో చతుష్షష్టి కళలు శతసహస్రషష్టి కళలు కావచ్చు లలితకళలు ఉన్నాయి. అన్నీ మానవశ్రేయస్సుకు ఉపకరించునట్టివే. ఈ సువిశాల భూ ప్రపంచంలో అన్ని నాగరక జాతులు యథోచితంగా మతాలను ఏర్పరచుకొని ఆరాధించుచున్నారు. అయితే మానవజీవిత మహాప్రస్థానం మరణంతో అంతమవుతోంది. సమస్తవిద్యలు, కళలు, శాస్త్రాలు మానవుని మరణంతో అంతమయ్యేవే.

ఇవ్వలేవు శాంతి హేతువాదముగాని
కవితగాని లలితకళలుగాని!
మతమె ఇవ్వగలదు అతిలోక సంతృప్తి
మరణశయ్యమీద మానవులకు!!

"జాతస్య మరణం ధృవం" – పుట్టినట్టిజీవి గిట్టక తప్పదు. చావటంకోసమేనా యీ బ్రతుకు? పుట్టటం ఎందుకు? గిట్టటం ఎందుకు? మరణం అనేసరికి ఇహలోకంలో మనిషి పెంచుకున్న మమకారబంధాలు అన్నింటినీ తెగత్రెంపులు చేసుకోవటమేగదా; అది ఎంతటి కఠోర ఘోర వృత్తం!

మరణమందువరకు మనుజలోకమునందు
మతము అవసరమ్ము మానవులకు;
జననమందు జన్మ సాఫల్యయోగముల్
మతము చెప్పు గుట్టు మట్టు విప్పి.

'చావు' అనేది ఈ శరీరానికి మాత్రమేగాని ఆత్మకు కాదనీ, ఆత్మ, నిత్యము, నిర్వికల్పము, నిరంజనము, నిరవధికము, నిర్వికారము, సనాతనము శాశ్వతము అనే ఊరట మతం కల్పిస్తుంది.,

మనిషి, చినిగిపోయిన పాతవస్త్రాలు విడిచి, క్రొత్తబట్టలు ధరించి నట్లే ఆత్మ సదా నూతనవస్త్రాలు ధరిస్తుంది" అని భగవద్గీత ప్రతి పాదిస్తుంది. ఇక బీభత్స భయానక మృత్యుదేవత-కోరలు పీకివేసిన త్రాచుపామువలె-ఒక ఆటవస్తువు అవుతుంది. ఆధ్యాత్మికానుభవ సంపన్నులకు మరణం వివృత స్వేచ్ఛాస్వర్గద్వారము మాత్రమే. మానవ కోటికి మతంచేసిన ప్రాథమికమహోపకారం మృత్యువేదనలోని భీకర భయాందోళనలు ఉపశమించచేయటమే. సమాజజీవితం నుండి మతాన్ని బహిష్కరిస్తే మానవుల మరణశయ్యలను దుర్భరం చేయటమే. మత రహిత సమాజంతో ప్రతిమానవుని మరణం ఉరిశిక్షగా పరిణమిస్తుంది.

మరణమనిన ఏమి? ఉరిశిక్షయే గాక
మతము లేనియెడల మనుజతతికి?
వికటమృత్యుఘోర వికటాట్టహాసముల్
మనుజు దోర్వగలుగు మతము వలన.

మరణం ప్రతిమనిషికీ అవశ్యభవితవ్యం అయినప్పుడు - సమాజ జీవితం నుండి మతాన్ని బహిష్కరించటం అవివేకమేగాదు మానవులయెడ క్షమించరాని అపరాధం అవుతుంది. ఇనుపగోళీలను అనవగ్గిస్సుగా వండి వడ్డించి మనుష్యులచే ఆప్యాయంగా తినిపించగల మాహాత్మ్యం మతానికి మాత్రమే ఉంది.

మానవులు-జీవితయాత్రలో ఎదుర్కొనవలసిన విపత్తు ఒక్క మరణమే కాదు. మనిషి బ్రదుకు ఏటికి ఎదురీత. మానవ జీవితం

బహుశ విపత్పరంపరావిలమైనవి. అయితే చిచ్చరపిడుగులు కురిసే పెనుతుఫాను ఝంఝూ ప్రభంజనాలను చల్లని వెన్నెల వడగళ్ళు విరిసే కమ్మతెమ్మెరలుగా మార్చే మహిమ మతానికి మాత్రమే ఉన్నదన్నమాట యుగయుగాంతరాలుగా మానవులందరకూ అనుభవామ్రేడితం.

విద్యుత్కంటె—మహిత విజ్ఞానగరిమకంటె
గాలి నీరు కంటె - కళలకంటె
రాజకీయ వాద రాద్ధాంతముల కంటె
మతము అవసరమ్ము మానవులకు.

మాటవరసకు—మతం కేవలం సాంఘిక ప్రయోజన సాధనకోసం మనిషి సృష్టించుకోవలసివచ్చిన ఒకానొక వ్యవస్థ మాత్రమే అనేవాదాన్ని అంగీకరించినప్పటికీ-జగద్ధితమునకు మతాన్ని మించిన ఉత్కృష్టపరికరం వేరొకటి లేదు అని చెప్పక తప్పదు. బహుశః ఈ అర్థంలోనే కాబోలు హేతువాదసిద్ధాంతానికి తన జీవితచరిత్రను అంకితం చేసుకున్న ఫ్రెంచి వేదాంతి వోల్టేరు, "ఒకవేళ భగవంతుడు లేకపోతే, అతనిని సృష్టించవలసిన ఆవశ్యకత ఉంది" అన్నాడు. విశ్వశ్రేయః కావ్యం అన్నారు ఆలంకారికులు. కళలు-లలితకళలు, సకలశాస్త్రాలు, సమస్తవిద్యలూ మానవశ్రేయానికే గదా. అయితే "విశ్వశ్రేయః మతం" అనే సూత్రం అన్వర్థం.

మానవజాతిచరిత్రలో మతం ఎప్పుడు ఉద్భవించింది? ఏ విధంగా ఉత్పన్నమైంది? మతం-మానవుడు కవలబిడ్డలే. ఆదిమ మానవుని మనస్సు వికసించినప్పుడే-మానవావతరణతోనే-మతం ఆవిర్భవించింది. ప్రాక్తన మానవునకు-ఉరుములలో - మెరుపులలో-గాలిలో-ధూళిలో-చెట్లలో పుట్టలలో-కొండలలో-కోనలలో సమస్త ప్రకృతి ఏదో

అనిర్వచనీయ దివ్యత్వంలో తొణికిసలాడుతూ సాక్షాత్కరించింది. ఆటవికుడైన ఆ ఆదిమమానవుని ఆశ్చర్యచకితత్వమే నాగరికత పెరిగిన పిమ్మట మతం అనే మారుపేరుతో అవతరించింది అంటున్నారు సాంఘిక శాస్త్రవేత్తలు. "ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్" అని మంత్రద్రష్టలైన మహర్షుల ప్రాబలుకులు మేధావులు ఉదహరించవచ్చు వనదేవత అనీ వాయుదేవుడనీ, వరుణదేవుడనీ, అగ్ని దేవుడనీ... ముక్కోటిదేవతలు అవతరించవచ్చు. అయితే - ఏ పేరుపెట్టినా సృష్టి ప్రాగుషస్సుల నుండీ యుగయుగాంతరాలుగా మానవహృదయాన్ని తన్మయత్వంలో ముంచెత్తిన-అనుభూతి వాస్తవమైనదే కదా. మానవునకూ-మానవాతీతమైన ఏదో దివ్యశక్తికి మధ్యగల అవినాభావ సంబంధమే మతం అని చెప్పవచ్చా?

---

క్షమ లేని తపసి తపమును
ప్రమత్తుసంపదయు, ధర్మబాహ్యప్రభు ధా
న్యము భిన్న కుంభమున తో
యము లట్టుల అధ్రువంబులగు నివి యెల్లన్

—మహాభారతము 1-2-178

# పరాశక్తి

అయితే – ఆ పరాశక్తి ఎవరు? ఎటువంటిది ?

ఆపరాశక్తికి ముక్కు, మొగము, నోరు, చేతులు కల్పించి – ప్రాయశః నాలుగైదు మొగాలు, చతుర్బాహువులు, చతుర్వింశతిబాహువులు –మున్నగునవి కల్పించి "దేవుడు" అన్నారు. బైబిలులో

Man is made in the image of God భగవంతుడు, తనకు ప్రతిబింబంగా మానవుని సృష్టించాడు అనే ప్రతిపాదన ఉంది. హేతువాదులు దీనికే పూర్వపక్షం నెలకొల్పుతూ, 'మానవుడే దేవుని తనకు ప్రతిబింబంగా సృష్టించాడనే వాదమే సమంజసమైనది' అని అంటారు. బహుశః చీమలసృష్టిలో భగవంతుడు. చీమకు ప్రతిబింబంగానే ఉండవచ్చు. ఈ ప్రజ్ఞావాదాలకేమిగాని, అపరాశక్తిని ఉపనిషత్తులు "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని అభివర్ణించాయి. ఈ సృష్టికి అర్యప్రకృతియైన ఏదో స్వయంభువమైన శక్తి ఉంది. దానిని మానవుడు తర్కించేత తెలుసుకోలేడు. అది అవాఙ్మానస గోచరం? అని మహర్షుల అభిభాషణ. ఇక ఉపనిషన్మతానుయాయులే విగ్రహారాధన చేయటం లేదా అని అంటే అది వితండతర్కవాదం అవుతుంది. తర్కం వేరు. సత్యాన్వేషణ వేరు. విగ్రహం ఒక ప్రతీక మాత్రమే. దేశపటం దేశం కాదు. దేశపతాకం ఆదేశానికి ప్రతీక. మతం దేవుణ్ణి ఒక శిలాప్రతిమక్రింద భావించింది అనుకోటం పెద్దపొరపాటు. మక్కా మాత్రమే పవిత్రస్థలం అనిగాని అందులో ఆ మసీదులో ఉన్న శ్యామల పాషాణం పవిత్రతమమైనది అనిగాని – చంద్రవంక–లోహిత స్వస్తికాలు

మాత్రమే పవిత్రచిహ్నాలు అనిగానీ మతం లోతుపాతులు తెలిసినట్టివారు హేతువాదులలో పిడివాదానికి దిగరు. నేటి "దేశభక్తి" అనే విచిత్ర వ్యామోహం మాత్రం భౌగోళికమైన విగ్రహారాధన కాదా? ప్రతిమలకు, ప్రతీకలకు మానవమనస్సులలో మనజనసమాజాలలో ఉన్న - సముచిత స్థానం - స్థాయిమీరకుండా పరిగ్రహించవచ్చు. కొందరికది మతం, దేవుణ్ణి మానవాతీత ప్రజ్ఞామహితుడుగా చిత్రించటంకూడ కద్దు. దేవుడు చతుర్బాహువు కావచ్చు. త్రినేత్రుడు కావచ్చు. ఇట్టి అతిలోక కల్పనలు ఆ పరాశక్తికే యథోచిత పరికల్పనలు కావచ్చు.

ఈ విశాలవిశ్వంలో మానవుడు దేవుని ఉత్కృష్టసృష్టి అని ఆధ్యాత్మికులు అంటే హేతువాదులు ఆవాదాన్ని త్రిప్పి కొట్టించి, "దేవుడు మానవుని ఉత్కృష్ట సృష్టి" అంటున్నారు. మరికొందరు "మానవుని పిరికితనమే దేవుని సృష్టించింది" అని వాదిస్తున్నారు. ఇవి అన్నీ అధిక ప్రసంగాలే. అసలు విషయం ఈ సృష్టికి మూలాధారమైన "శక్తి" ఉండాలి. ఆశక్తియే నీవుగా అవతరిస్తున్నావు. "తత్త్వమసి", తత్ = అతత్త్వం, త్వం = నీవు, అసి = అగుచున్నావు." 'ఆ శక్తిలో నీవు అంతర్భాగానివి' అని ఇంకో వ్యాఖ్యానం. ఆ శక్తి నిర్గుణం నిర్వికల్పం, నిరజనం, నిర్వికారం... అయితే ఆశక్తిలో మానవునకు సంబంధం ఏముంది? ఆ శక్తి నేను.

"అహం బ్రహ్మాస్మి"
నేనే ఆ బ్రహ్మను అని అద్వైత ప్రవచనం.

"మనోబుద్ధ్యహంకార చిత్తాని నాహం
న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రే

న చ వ్యోమభూమి ర్న తేజో న వాయుః
చిదానందరూపశ్శివోహం శివోహం !"

పై శ్లోకానికి స్వేచ్ఛానువాదం తెలుగులో

"పంచభూతములును పంచేంద్రియమ్ములు
కాను-మనసుబుద్ధిగాను-నేను
నేను నిత్యసచ్చిదానందరూపుండ
నేన బ్రహ్మ; విష్ణువేన శివుడ!"

అనేది అద్వైతమతం. బ్రహ్మము అనే పరదైవతానికి శివుడనిగాని, కేశవుడనిగాని, హరిహరనాథుడనిగాని జహోవా అనిగాని ఇంకే పేరేదైన పెట్టుకోవచ్చు.

"ఆ పరాశక్తి ఏకైకం ఏకమేవాద్వితీయం బ్రహ్మ"
వేదాంతులు ఆ పరతత్త్వాన్ని వేరువేరుగా వ్యపదేశించవచ్చు

"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" -ఉపనిషత్తు

ఏకో జ్యోతిర్బహుధా విభాతి -అథర్వవేదము

ఈనాడు భౌతికశాస్త్రానుసారం ఈ సృష్టి పరమాణువులతో నిండియుంది. అత్యల్పమైన పరమాణువును ఛేదిస్తే అపారశక్తి ఆవిర్భవిస్తుంది. సిద్ధాంతమాత్రముగా, విశ్వంలోని పరమాణువులు అన్నిటినీ ఛేదించగలిగితే ఏర్పడేది అనంతమైన ఏకైక శక్తియేగద. దానికి ఏదైనా పేరుపెట్టుకోవచ్చు. వివిధమతాలు విభిన్నరీతులలో ఆపరాశక్తిని వింగడించాయి. అయితే సమన్వయసంధాతలు, "అన్ని నదులు భిన్న భిన్న ప్రదేశాలనుండి ఒకే సముద్రాన్ని చేరుకొనచున్నట్లే-అన్ని మతాలు ఒకే పరాత్పరుని చేరుకొంటున్నాయి" అంటారు.

ఆకాశాత్ పతితం తోయం
యథా గచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారః
కేశవం ప్రతిగచ్ఛతి.

ఉపనిషత్తులు ముక్తకంఠంతో ఆపరాశక్తిని "అవాఙ్మానసవేద్యము," అని ప్రవచించాయి. ఇక అట్టిదేవునితో ఇక మానవులకు ఏమి ప్రయోజనం? అందుచే అద్వైతులను "ప్రచ్ఛన్నబౌద్ధులు" అనీ "పాషండులు" అనీ, కొందరు ఆస్తిక శ్రోత్రియులు నిరసించటం జరిగింది.

శ్రీరంగనాథానందస్వామి చెప్పినట్లు, "ఉపనిషత్తు" లలో కన్పించేది అథానాస్తికత్వం మాత్రమే.

**"God is dead Long live God" is a strange paradox which the Upanishads have made us familiar with,** ఉపనిషత్తులు, మానవుడు తనకు ప్రతిరూపంగా సృష్టించుకొన్న భగవత్ భావనకు భరతవాక్యం పలికి అవాఙ్మానసగోచరమైన పరాత్పరుని చిరంజీవిని చేశాయి.

చచ్చిపోయినాడు సచ్చిదానందుడు
సృష్టికర్త జగదధీశ్వరుడు
జయము జయము దిగ్విజయ చిరంజీవియై
ఇంక బ్రదుకుగాక ఈశ్వరుడు

అని శ్రీరంగనాథస్వామివారి ఆంగ్లవాక్యానికి భావానువాదం చేయవచ్చు. *

# సగుణోపాసన

ఉపనిషత్తులు ప్రతిపాదించినది నిర్గుణోపాసన. నిర్గుణోపాసన అనుభవైకవేద్యమైన ఆధ్యాత్మికోపాసనలో ఒట్టచివరి పైమెట్టు. ఈ నిచ్చెనలో క్రిందిమెట్లు ఎన్నో ఉన్నాయి. నిర్గుణపరబ్రహ్మోపాసనలో సిద్ధిచెందేముందు – అనంతకల్యాణగుణ సంపన్నుడైన సగుణబ్రహ్మను ఆరాధించటం ఎన్నో మతాలకు ప్రాతిపదిక.

అవసరమ్ము విద్య కక్షరాభ్యాసమ్ము
కలము – కాగితాలు – పలక – గిలక;
గుడులు గోపురాలు గురుపురోహితకోటి
ప్రథమ మవసరమ్ము మతము కొరకు

అందుచేత,

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ
తస్మై శ్రీగురవే నమః

అనే సంప్రదాయం ఏర్పడి. గురువుకు, పరమేశ్వరునకు అభేదాధ్యవసాయం చేకూర్చాయి కొన్ని మతాలు.

కానీ, వ్యవస్థానుగతమైన మతాన్ని – గురుపీఠాన్ని – గురువుల్ని తిరస్కరించే వారూ ఉన్నారు.

"అనుభవైకవేద్య మధ్యాత్మ యోగంబు!
గుడులు వద్దు మరియు గురులు వద్దు
తనను తాను తెలిసికొనుటయే మోక్షమ్ము
మనసు సరిగమల సమన్వయమ్ము"

అని ప్రబోధించేవారూ ఉన్నారు. ఇవి అన్నీ, భిన్నవిభిన్నవాదాలుగా భాసించవచ్చు - ప్రకరణానుసంధేయాలు కాకుండ విడదీసి ఉదాహరించినప్పుడు! ఇవి అన్నీ ఆధ్యాత్మిక మహాప్రస్థానంలో తారసిల్లే దారిమలుపులు. ఎవరి అనుభూతినిగూర్చి వారు చెప్పినట్లు సమన్వయించుకోవచ్చు.

సగుణోపాసన శాఖోపశాఖలుగా ప్రవర్తిల్లింది. సగుణోపాసన ప్రపంచపరివ్యాప్తంగా అభివృద్ధిచెందటానికి గల మూలకారణం అది భగవంతుని సమస్త కల్యాణగుణ సంపన్నునిగా భావించటం. ఆభావన విశ్వజనీనమైనది. మానవుడు అట్టి సద్గుణ సంపత్తి పెంపొందించుకోవలని యుంటుంది కాబట్టి అది జగద్హితమైనది. దానివలన మానవులకు ప్రత్యక్ష లాభం ఏర్పడుతుంది. అదీగాక మానవులు అనిర్వచనీయమైన ఏదో పరాశక్తిమీద కంటె భూమిపై తమకు అందుబాటులో వుండే భగవత్ తత్త్వమే సాధారణంగా కోరుకుంటారు. అందుచే అవతారతత్త్వం మానవహృదయంలో ఉండే ఈ ప్రగాఢమైన కోరికను ఈడేర్చింది. ఇదే భాగవత తత్త్వం. ఇదే భాగవతభక్తతత్త్వం ఏదో రూపంలో అన్ని ఆస్తిక మతాలలో చోటుచేసుకున్నది.

నీపాదకమల సేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయు
తాపస మందార నాకు దయసేయగదే.

అనే పోతనపద్యం ఈ సగుణోపాసన తత్త్వాన్ని హృదయంగమంగా అభివర్ణించుచున్నది.

ఇందులో భగవత్ భక్తితోపాటు-భూతదయ, అపరిహార్యమైన పరికరంగా పేర్కొనబడటం గమనించదగిన అంశం. *

"Forwarded Free of Cost and with the Compliments of the Department of Education, Government of India New Delhi."

# పరోపకారపారీణత

అన్ని మతాలు - పరోపకృతిని కైవల్యసాధనకు అవశ్యకర్తవ్యంగా పేర్కొన్నాయి. బౌద్ధమతానికీ అంతరాత్మ భూతదయ. "అహింసా పరమో ధర్మః" అనేది ఔపనిషదమైన ప్రబోధం - బౌద్ధమతంలో ప్రధానసిద్ధాంతంగా పరిణమించింది. "పరోపకారార్థమిదం శరీరం" అనే సిద్ధాంతం సనాతన వేద మతసారంగా సుప్రసిద్ధం. బోధిసత్త్వులు జీమూతవాహన-దధీచి-శిబి ప్రభృతులు పరోపకారార్థం తమ శరీరాలు ఆత్మబలిదానంగా సమర్పించిన త్యాగయోగులు భారతీయ సాహిత్యంలో సుప్రసిద్ధులు. క్రైస్తవమతానికి అంతరాత్మగా చెప్పబడే ప్రధాన సూత్రం

"Love thy neighbour as thyself"

'నీ తోటి మనిషిని నీవలె ప్రేమించుము'-

అనేది పరోపకారపారీణతా ప్రబోధమే.

"అష్టాదశపురాణేషు వ్యాసస్య వచనద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం."

అష్టాదశపురాణాలలో వ్యాసమహర్షి ప్రతిపాదించినవి రెండే వాక్యాలు! పరోపకారమే పుణ్యం. పరపీడనమే పాపం. నిజానికి పై శ్లోకంలో వ్యాసుడు చెప్పినవి రెండు వేరువేరు వాక్యాలుగా కనిపించినప్పటికీ, అవి అంతర్యంలో ఒకే మాట. అది "పరోపకృతి పరమధర్మం" అని. కావలసింది అనుష్ఠాన వేదాంతం మతమంటే దేవుడనీ-దేవుడంటే దేవాలయమనీ అర్థంకాదు.

"దేవుడు మక్కా-మసీదులో లేడు
కాశీదేవాలయంలో లేడు
నీ హృదయకుహరంలోనే ఉన్నాడు చూడు"

అన్నాడు కబీరు.

పాలు-యోగి-త్రాగితె-వటకుటీరములల్లి,
త్రాగితె-బుషి కబీరు-బట్టనేసి;
చదువు-పదవి గావు సంస్కార హేతువుల్!
గుండె పండి, పచ్చు-గొప్పతనము.

ఆధ్యాత్మికానుభూతి పొందిన యోగులు వేరు. సాధారణమానవులు వేరు. ప్రతి మతానికీ-మసీదో-చర్చో-దేవళమో గ్రంథమో ఏదో ఒక బాహ్యప్రతీక ఉంటుంది. మానవుడు సహజంగా సంఘజీవి గాబట్టి అనుభవైకవేద్యమైన ఆధ్యాత్మికానుభూతిగూడ మతవ్యవస్థగా రూపొందుతుంది. ఈ సందర్భంలో వివేకానంద మహర్షి చేసిన హెచ్చరిక మరువరానట్టిది. "It is good to be born in a Church; but it is very bad to die there" ఏదో ఒక చర్చిలో (అనగా మతవ్యవస్థలో) పుట్టటం మంచిదేగాని ఆవ్యవస్థలోనే పడి కొట్టుకుచావటం మంచిది కాదన్నాడు వివేకానందుడు. ఏమతమైనా, ఎట్టి పవిత్రమైన ఆశయాలతో ఆవిర్భవించినా, చివరకు కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్య వివశులైన మనుష్యులచేతిలో పడినప్పుడు దుష్ఫల పరిణామం చెందటం ఆశ్చర్యపడవలసిన అంశం కాదు.

ఏమత సంప్రదాయాలలో పుట్టిపెరిగినా, వాటి అంతస్సారం గ్రహించకుండా, ఆ సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడి చావటం మంచిదికాదని వివేకానందమహర్షి హెచ్చరికకు అంతరార్థం.

అంగ్లంలో ఒక సామెత ఉంది. "Nearer the church - farther from God" అనగా దేవళానికి దగ్గర అంటే దేవునకు దూరం కావటమే అని దీని భావం.

చాల దూరముండు-జాగ్రత్త! జాగ్రత్త!
దేవళమ్మునకును దేవునకును !!
గుడులకట్టుబొట్ల సుడిగుండముల చిక్కి-
జీవు డెవ్వడు-ముక్తి-చెందలేడు.

ఎంతమాపులను వెంబడించటమే అవుతుంది మతం. కఠోరనిబంధనా వృతమైన వ్యవస్థగా పరిణమిస్తే, నిజవస్తువును విడి నీడను వేటాడటమే అవుతుంది. అందుచే ఉన్నత వేదాంత దృష్టితో చూస్తే

జీవితమే ఒక ప్రార్థన
కావలెను-పరోపకృతియె కర్తవ్యముగా ;
కోవెల-చర్చి-మసీదులు
దేవుని చెరసాలలంచు తెలియర వత్సా !

అని హెచ్చరిక చేసిన మనీషి నాస్తికుడని భ్రమింపనక్కరలేదు.

నీతినియమాలు దానధర్మదయాదాక్షిణ్యాలకు మానవజీవితంలో నిరుపమాన ప్రాధాన్యం ప్రతిపాదించినాయి. అందుచేత మానవ సమాజ జీవితంలో మతం యుగయుగాంతరాలుగ వసుధైక రక్షకభట పాత్రను నిర్వహించిన సంగతి వేత్తలకు అనారూఢవిషయం గాదు. "If there is no God, it is n:cessary to invent HIM" ఒకవేళ భగవంతుడు లేకపోతే, అతనిని లోకసంగ్రహార్థం సృష్టించటం అవసరం" అన్నారు వోల్టేరు. మానవులకు ఇహపరావసరాలు తీర్చేందుకు "దే వు డు"

అవసరం అని గుర్తించిన మేధావులు పలువురు ఉన్నారు. ఇంతకూ ఆస్తికులు నాస్తికులు చేసే వాదోపవాదాలు నిరర్థకాలే.

"ధాటె నొకఁడు ప్రాఁత నగము శూన్యమటంచు
ఒకఁడు నగము నీడ ఉన్నదనెను!
తగవు పెరిగి పెరిగి-పగిలిపోయెను తలల్
రమ్యహాసలోల! రామకృష్ణ!"

అనవలసి వస్తుంది. ఇట్టివే శైవ వైష్ణవ వేదాంత విభేదాలు, అన్ని మతాలలో ఉన్న ఎన్నో శాఖోపశాఖలు.

---

ఒరులేయవి యొనరించిన
నపకర; మప్రియము తన మనంబునకగు; నా
నొరులకు అవి సేయకునికి
పరాయణము పరమధర్మపథములకెల్లన్

– మహాభారతము 12–5–229

# విశ్వజనీనమతం

ఈ ఆధునిక వైజ్ఞానిక యుగంలోగూడ మానవుడు కన్నుతెరచి చూచేసరికి కనిపించేది పగలైతే సూర్యుడు, రాత్రి అయితే, నక్షత్రాలు. నిజానికి పగలుకూడా ఆకాశంనిండా నక్షత్రాలు ఉంటాయి. దుర్భిణీ యంత్రంలో చూస్తే కనిపిస్తాయి. ఆకాశంలో ఉండే అనంతకోటి తారామండలాలలో సూర్యుడు ఒకానొక చిన్న నక్షత్రం! ఆ నక్షత్రంచుట్టూ కోటాను కోట్ల సంవత్సరాలనుండి పరిభ్రమిస్తున్న ఒక చిన్న మట్టిగోళి మానవులు ఉండే ఈ భూమి! మన సౌరకుటుంబం ఉన్న "పాలపుంత"లో కోటాను కోట్ల నక్షత్రాలు ఉన్నాయి పాలపుంత కేంద్రంనుండి బయలుదేరిన ఒక నక్షత్ర కాంతి కిరణం- పరిధిని చేరేందుకు సెకనుకు కొన్నివేల మైళ్ళ వేగంతో పయనిస్తున్నప్పటికీ 36 లక్షలకోట్ల సంవత్సరాలు పడుతుందట! సూర్యుడు ఒక గంప అనుకుంటే- భూమిని ఒక నిమ్మకాయ అనుకుంటే ఆ గంపలో కొన్నిలక్షల నిమ్మకాయలు పడతాయట! భూమి సూర్యుని చుట్టు ఎన్ని లక్షల సంవత్సరాలనుండి పరిభ్రమిస్తోందో! సూర్యుడు పుట్టి ఒక గంట అయినదనుకుంటే, భూమి ఏర్పడి ఒక సెకను కాలేదు. భూమి ఏర్పడి ఒక గంట అయినదనుకుంటే, భూమిపై ప్రాణి పుట్టి ఒక సెకను కాలేదు. ప్రాణిపుట్టి ఒక గంట అయినదనుకుంటే- మనిషి ఏర్పడి ఒక సెకను కాలేదు!!

మానవావతరణ-మానవోదంతమ్ము
చిత్రమైన విశ్వశిల్పమందు
పరిహరింపదగిన ప్రశ్నత్తమా ఏమి ?
అసలు కథకు-అంత రార్థ మేమి ?

ఇంతవరకు శాస్త్ర హేతువాదము గాని
కవిత గాని లలితకళలు గాని
మతము గాని-మార్క్సు గతితర్కమితి గాని
కొలువలేదు-మనిషి గుండె లోతు

మతం - మానవజీవితంలో ఒక అంతర్భాగం మాత్రమే. మానవ జీవితాన్ని అంతటినీ దురాక్రమణ చేసే అధికారం మతానికి లేదు. అట్లే హేతువాదానికి గాని, మార్క్సిజానికి గాని మీరరాని సరిహద్దులు ఉన్నాయి. సరిహద్దులు మీరినపుడు అవి నిరర్థకాలు కాక తప్పదు.

"అర్ధశాస్త్ర కృతకయవని కాంతారమందు
నిలిపె మార్క్సు-మనిషి నీడ బొమ్మ
జీవనాడి లేని-చీమునెత్తురు లేని
నీడబొమ్మ వేరు - నిజము వేరు."

మార్క్సు గతితర్కవాదం - వయస్సులో ఇంకా శైశవంలోనే ఉన్నది. జగద్విమోచనానికి సామ్యవాదమే యేకైక శరణ్యమని నమ్మే వారు ఉన్నారు. మతాన్ని నమ్మకండి. మార్క్సును నమ్మండి అనటం హాస్యాస్పదం. నిత్యచైతన్యజగత్తులో నమ్మకం అనే మాట అర్థరహిత మైనది. మతం విషయంలో గూఢ అభిజ్ఞులు ఆధ్యాత్మిక తత్త్వం అనుభవైకవేద్యం అది వ్యక్తినిష్ఠం-దానిని ఎవరికివారు సాధనచేసి పరిగ్రహించవలసి యుంటుంది అని అంగీకరిస్తారు. తమ నమ్మకాలతో ఏకీభవించని వారికోసం నిర్బంధ కారాగార హింసాశిబిరాలు మతం ఏర్పరచినా, మార్క్సిజం ఏర్పరచినా అవి అమానుషాలే. నియంతృత్వం మతంలోనే గాదు, ఏ సామాజిక వ్యవస్థలోనైనా గర్హించదగినట్టిదే. What ever people may say, I am not a marxsist myself.

"ప్రపంచం ఏమైనా అనుకోవచ్చు - నేనుమాత్రం మార్క్సు భక్తుణ్ణి కాను" అని అన్న మార్క్సు ప్రవచనం మరువరానిది. నాగరకత పెరిగి, విజ్ఞానవికాసం ఎక్కువయ్యే కొద్దీ-మానవజీవితంలో మతం నిర్వహించవలసిన భూమికను గుర్తించటం సులువు కావాలి. మానవ సమాజజీవితం నుండి-రాజకీయనియంతలు ప్రభుత్వాధికారం చేపట్టి మతాన్ని బహిష్కరించవచ్చు అయితే మనం జ్ఞాపకం ఉంచుకోవలసిన అంశం

"నరుల జీవితమ్ము అర్థకామమె గాక
వెలుగుచీకటులకు ఏంత మెలిక;
మనిషి ప్రకృతిలోని మమకార సూక్ష్మముల్
సుడులు ముడులు మార్క్సు తడువలేదు:

కాబట్టి మానవజీవితంనుండి బలవంతంగా మతం నిర్వహించే భూమికను విరమింపచేస్తే - ఆ ఖాళీని హేతువాదం భర్తీచేయలేదు. యుగయుగాంతరాలనుండి కోటానుకోట్ల మానవులకు మనశ్శాంతిని దానం చేసిన మతానికి ప్రత్యామ్నాయం ఏదైనా ఉందా? మతంలో లోట్లు లేవని వాదించటం కూడదు. యుగయుగాంతరాలుగా స్వార్థత్యాగులైన మహానుభావులు యోగీశ్వరులు మతాన్ని పుటంవేసి ఎప్పటికప్పుడు మాలిన్యాలు తొలగిస్తూనే ఉన్నారు.

మానవుడు ఇటు దివ్యత్వానికీ అటు దానవత్వానికీ సంగమక్షేత్రం మానవునిలోని దానవత్వాన్ని అరికట్టి- దివ్యత్వానికి దోహదం చేయటమే మతంయొక్క ప్రధానధ్యేయం. ఆ కర్తవ్యం నిర్వహించటానికి చిరంతనానుభవం, సంపాదించిన వ్యవస్థ - మతం. మతాన్ని యథోచితంగా సంస్కరించాలి.

బంగారు గుడ్లను పెట్టే బాతును దురాశతో గాని, దురాగ్రహంతో గాని చంపరాదు.

*

# నాస్తికత్వం

నాస్తికులలో నోరుగలవారు మార్క్సు శిష్యులు.

"ప్రశ్నసోదనొక్క - భగవంతు బంధించి
మతము ప్రజలనేలె మత్తు చల్లి;
మతము మరణ మొంద మనుజుండు బ్రతుకురా
మార్క్సు ఋషివరేణ్యు మాటవినుడు"

అంటారు సామ్యవాదసోదరులు. మతం నల్లమందు అని వారి అభిప్రాయం. ఔషధప్రాయంగా నల్లమందుయొక్క ఉపయోగంమాట అటుంచి మార్క్సు వాదం ఐదంయుగినలలో పలువురికి మతం వలనే మత్తుగొలపటం మరచి పోరానిది. సంస్కృత ఆలంకారికులు రసం సామాజిక నిష్ఠం అన్నారు. "మత్తు" గూడ సామాజికనిష్ఠమేగాని-నల్లమందులోనూ లేదు. మతం లోనూ లేదు.

మార్క్సు మాట యైన మహమూదు పలుకైన
వేద మైన శాస్త్రవాద మైన
మార్పు చెందవలయు మనుజు లుండెడి చోట
ప్రగతికొరకు-నూత్న జగతికొరకు.

మతసిద్ధాంతాలకూ మార్క్సు ప్రతిపాదనలకూ గూడా కాలదోషం పట్టటం మానవ సమాజ క్రమపరిణామవికాసంలో సహజం.

కేవలం హేతువాదం మానవజీవితంలోని అన్ని సమస్యలకు పరిష్కారమార్గం కాజాలదు.

విజ్ఞాన శాస్త్రాలు అన్నీ ఏకగ్రీవంగా ఎప్పుడో ఒకప్పుడు-సుదూర భవిష్యత్తులోనే అనుకోండి-మానవుడు అంతరించక తప్పదని నిష్కర్షగా చాటుచున్నాయి. అయితే-అట్టి విశ్వమానవ ప్రళయం ఇంకా కొన్ని లక్షల ఏళ్ళకుగాని సంభవించే అవకాశం లేదు. ఈలోపుగ మానవుడు మారణాయుధాలను పెంపొందించుకొని "అకాలప్రళయం సృష్టిస్తాడా?

"ఎగురు మానవుండు గగనాన విహగమై !
గండుచేపరీతి కదలి నీదు !
పుడమి మనిషివోలె నడువలేడేలకో !!
వింతలందు గొప్ప వింత గాదె !!

అని హృదయాళువైన ఒక మేధావి వాపోయాడు.

నేడు ప్రపంచంలో అగ్రరాజ్యాల దగ్గర ఉన్న ఉదజనిబాంబులు ఈభూలోకంలో ఉన్న మానవులను సుమారు ఇరవై పర్యాయాలు సంహరింప శక్తిగలవి అంటున్నారు అభిజ్ఞులు. ఇవిగాక అద్యతన భవిష్యత్తులో మరణకిరణాలు, కృత్రిమ తుపానులు సృష్టించగల వాయవ్యాస్త్రాలు, వారుణాస్త్రాలు సృష్టింపబడవచ్చు.

ఈ అకాల విశ్వమానవ ప్రళయాన్ని తప్పించటానికి - శక్తి - భూగోళంలోని ఏ శాస్త్రానికిగాని, ఏ విద్యకుగాని, ఏ కళకుగాని, ఏ "ఇజానికి" గాని లేదు. ఆ శక్తి ఒక్క మతానికి మాత్రమే ఉంది.

మతము మానవునిలో నిద్రాణమైయున్న దివ్యత్వాన్ని మేలుకొల్ప గలదని వివేకానందమహర్షి అభిభాషణ.

మతము మేలుకొలుపు మనిషిలోపల దాగి
తీవ్రనిద్రవోవు దివ్యదీప్తి
మతము పూన్పగలదు - బ్రతుకుగోతుల నెల్ల
భోగి-త్యాగి-యగును - యోగి-యగును !

ప్రపంచ చరిత్రలో యుగయుగాంతరాలనుండి ఎన్ని యుద్ధాలు జరుగలేదు? అయితే ఎన్నో మతాలు ఉన్నాయి. ఎందరో యోగీశ్వరులు ఉద్భవించారు. ఏ మతమైనా ఏ ఒక్క యుద్ధాన్ని అయినా మాన్ప గలిగిందా? 'కుడి చెంపమీద లెంపకాయ కొడితే-శత్రువును ఎదుర్కొన కుండా శత్రువును ద్వేషించకుండా నీ యెడమ చెంప చూపించు' అని ప్రబోధించిన ఏసుక్రీస్తు మతానికి చెందిన వారమని చెప్పుకునేవారు ఎన్ని యుద్ధాలు చేయలేదు? అని మూతి ముడిచే వారు ఉన్నారు. నిజమే- అది క్రైస్తవమతం తప్పుగాదు గద, మనిషి తప్పుగాని. కళింగ యుద్ధానంతరం బుద్ధభగవానుని మతం శిరసావహించి - తదుపరి భారత భూమిపై అశోకచక్రవర్తి యుద్ధానకు విముఖుడు కాలేదా? భవిష్యత్తులో ఏమి జరిగేది ఎవరు చెప్పలేరుగాని, విశ్వశాంతిని చేకూర్చే శక్తి ఈ పృథివిలో ఏ వ్యవస్థకైనా ఉంటే, అది ఒక్క మతానికి మాత్రమే ఉంది, అనటం పూర్వపక్షంలేని సిద్ధాంతం అనవచ్చు. అందుచేత, విజ్ఞానశాస్త్రం పురోగమించినకొద్దీ - క్రొంగ్రొత్త మారణోపకరణాలు - కృత్రిమ వాతా వరణ కారకాలు - మరణకిరణాలు అవతరించినకొద్దీ-మానవ సమాజంలో మతం ఆవశ్యకత అధికమౌతున్నదనే చెప్పాలి.

ఇరవయ్యో శతాబ్ది ప్రథమఖండం రెండు ప్రపంచయుద్ధాలు చూచింది. ద్వితీయ ఖండంలో యుద్ధం వస్తే అది తృతీయ ప్రపంచ సంగ్రామం - కాదు - క్షమించాలి - అంతిమ ప్రపంచయుద్ధమే కావచ్చు. అటువిమ్మట భూగోళంలో మానవుడే మటుమాయమై పోవచ్చు 1946లో హిరోషిమా నాగసాకీలో అటమ్ బాంబులు ప్రయోగించినప్పుడు - అచట బ్రతికినవి కొన్ని చీమలు మాత్రమేనట!! అంతిమ ప్రపంచ సంగ్రామా నంతరం చలిచీమలు తమభాషలో అంతరించిన మానవజాతిపై కరుణ గీతికలు వ్రాసుకుంటాయేమో

ఈ పెనుమంటి దిబ్బ వసియించి రొకానొకనాడు మానవుల్
పావము శేముషీ విభవ పారగులై ప్రకృతిన్ జయించి వి
శ్వావర సృష్టినల్పి-ప్రళయాంతక బుద్ధిని-గుండెలేక - ఆ
త్మావహతిన్ వినాశనము నొందిరి అందరు జ్ఞానశూన్యులై

అనుచు హతశేషమై అంత అవని మిగులు
ఏ పిపీలికలో రచియించు కొనును
కరుణ గీతికలీ నాటి వాఙ్మయములోన
ఇయ్యది అవశ్య భవితవ్యమేమొ మనకు !!

ఇట్టి - అకాలప్రళయం తప్పించగలవారు ఎవరు? రాజకీయ నాయకులా? ఈ మహత్తర కర్తవ్యం వారికి చేతనైన పనిగాదు. మతం కల్పించే భవ్యకవితావేశంతో-విశ్వసౌభ్రాత్రభావంతో ముందడుగు లేసే మహానుభావులే ఈ పవిత్ర బాధ్యత నిర్వహించటానికి అర్హులు. మామతం గొప్పదంటే మామతం గొప్పదని కీచులాడుకునే యుగాలు గతించాయి. అన్ని మతాలు బోధించేది విశ్వమానవ కల్యాణం. సకల మానవ సౌభ్రాత్రం.

ప్రగతిశీలమైన జగదేక మతమేది ?
నిత్యనూత్నమైన నీతియేది ?
పరులకుపకరించు కరుణార్ద్ర హృదయమే
పరమధర్మతత్త్వ గరిమనాభి,

మతయుద్ధాలు చేసి ఇస్లాముగాని, క్రైస్తవమతముగాని సాధించన దేమిటి? నిజానికి అవి మతసిద్ధాంతాల పోరాటాలుగావు. విభిన్న వేదాంత వివాదాలు గావు. అవి స్వార్థపరుల ఆరాటాలు. అజ్ఞానుల

ఊబిలాటాలు — ఇట ఒక విద్వాంసుని చమత్కార భాషణం ఉట్టంకించ తగింది.

మిథ్య-మతములన్ని-మేధావి దృష్టిలో !
తరచ-తా త్త్వికునకు తథ్యమన్ని !
లాభదాయకములు రాజకీయమునకన్ని !
మతము - జగతిహితము కొరకె;

మతం అనే శబ్దాన్ని - విస్తృతార్థంలో స్వీకరిస్తే స్వార్థత్యాగమే దానికి అంతరాత్మ. మతం - ఏకైక ధ్యేయం విశ్వశ్రేయస్సు.

మతం అంటే మూఢవిశ్వాసాల మిట్టకాదు. ప్రాతిసంప్రదాయాల గుట్టకాదు. కారణాంతరాలవల్ల మతాలు ధరించిన కవచాలు గాని, కంచుకాలు గాని అసలు మతం క్రిందికి రావు. అప్పుడప్పుడు — అన్నిరంగాలలో పులితోలుకప్పుకొని పంటచేనులలో బడి వచ్చుని పైరు మేసే గాడిదలు ఉంటాయి. అట్లాగే మతవ్యవస్థలోగూడ మాయావులు, గోమాయువులు మారువేషాలతో మసలవచ్చు.

అందుచేత, నేటి మానవుడు ఏ మతానికి చెందినవాడైనా, తాను విశ్వజనీన చరిత్రుడు కావచ్చు.

మానవజాతి, మనుగడయే శంకాస్పదమై పోతున్న సమయంలో,- యావత్ సృష్టిలో నిరుపమానమైన మానవ మేధ విజ్ఞానశాస్త్ర వికారవికాస పరిణామం, అకాల ప్రళయాన్ని సృష్టించే మార్గంలో పరుగెత్తుచున్న కాలంలో — మతంపై — విశ్వమానవ సౌభ్రాత్రభావాన్ని ప్రబోధించవలసిన పవిత్ర బాధ్యత-పడింది. ఇప్పుడు సంకుచిత మతతత్త్వాలకు తావులేదు. అన్యోన్యవైషమ్యాలకు ఇది అదనుకాదు. జాతి భేదాలకు ఆస్కారం లేదు.

వెలుగు వచ్చుగాక వివిధ దిక్కులనుండి,
వివిధ సౌరభాలు విరియజేసి;
మసలుగాక మనిషి-వసుధైక పౌరుడై;
మతము-సర్వమనుజ హితము కొరకె.

*

# సనాతనమతం

మెదడు పాడుచేయు పెట్ట వేదాంతమా ?
　　మతము అనిన మనిషి బ్రతుకు తీరు ;
త్యాగబుద్ధి - దానధర్మ సేవాదీక్ష !
　　మంచితనము లేక మతము లేదు.

మతము దైవభక్తి మాత్రమే కాదోయి,
　　జగతిహితము కొరకు సలుపు వ్రతము ;
ధ్యేయ సిద్ధికొరకు - స్థిరదీక్షతో సల్పు
　　కర్మలెల్ల - యజ్ఞకాండ సుమ్ము.

యజ్ఞపశువు గాదు-యాగ హోమము గాదు;
　　మంత్ర తంత్రకాండ - మతము గాదు;
జపము తపము గాదు - ఉపకార హృదయమ్మె
　　సర్వ నిగమసార సంగ్రహమ్ము.

మతము మాట విడిచి-మానవత్వ మటంచు
　　ప్రగతి యనుచు సామ్యవాద మనుచు
హేతువాద మనుచు-ఎన్ని పేరులు పెట్టి
　　మనుజసేవయైన - మతమె యగున.

స్వార్థరహితమైన-సందేహమే యైన
　　చిత్తశుద్ధియున్న చింతయైన
త్యాగబుద్ధియున్న - నాస్తికత్వముగాద
　　మతమె యగును మనుజ హితముగోర.

# డా॥ నండూరి రామకృష్ణమాచార్య గ్రంథములు

1. ఆంధ్రసాంస్కృతిక వికాసము రూ. 15-00

"దేశ భాషలందు తెలుగు లెస్స"- భారతదేశ చరిత్రలో ఆంధ్రులు నిర్వహించిన భూమిక. శాతవాహన మహాయుగ చరిత్ర - సంస్కృతి-సారస్వతము. సామాజిక స్థితిగతులు. నాగార్జునాచార్యులు - ఇక్ష్వాకుల నాటి సంస్కృతి - చాళుక్యయుగము. ఆంధ్ర చరిత్రలో తెలుగుకవులు నిర్వహించిన భూమిక - నన్నయ - తిక్కన - ఎఱ్ఱన - శ్రీనాథ మహాకవుల వ్యక్తిత్వములు - శ్రీకృష్ణదేవరాయలు - భువన విజయము. ఆంధ్రుల అవధాన కళ - అభిరుచులు. ఆంధ్రుల వీర రసాభినివేశము పరిహాస రసికత - మున్నగు శీర్షికలు. చివర ఆంధ్ర శిల్పము- చిత్ర లేఖనము - నాట్యకళ - గానకళలపై నాలుగు అధ్యాయములు కలవు.

2. తిక్కన భారతదర్శనము రు. 20-00
3. బుద్ధచరిత్ర - ధమ్మపదము 5-00
4. ధర్మచక్రము - నాటకము 5-00
5. ప్రాచీన దక్షిణభారతచరిత్ర 20-00
6. హాస్యనాటికలు 3-00
7. కవిత్రయము - తిక్కన 3-50
8. ప్రగతిగీత-చాటువులు 10-00
9. **Wisdom of the World**

**International Quotations** 50-00

ప్రతులకు :

**N. వేదవ్యాసచక్రవర్తి**

1-3-76 ప్రెండరుగాస్టురోడ్డు

36, జవాహరునగరు, సికిందరాబాదు-500 003.